1-10Pg1FBGO 1VJA_11-10Pg1FBGO.qxd 10/11/2025 12:35 AM Page 1

సాహితీ గత వారం రోజుల్లో వెలువడ్డ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
11-10-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 250 పేజీలు: 10+4 వెల: 6.50

గ్రామ పంచాయతీల్లో క్లస్టర్ వ్యవస్థ రద్దు 2లో


'దగ్గు' మృతులపై సిబిఐ వేయలేం: సుప్రీం 9లో

## పోరాట యోధురాలు వెనిజులా ప్రతిపక్షనేత మరియాకు నోబెల్ శాంతి



### నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా ఆమె పోరాటానికి అత్యున్నత గౌరవం

**న్యూఢిల్లీ, అక్టోబరు 10:** నోబెల్ శాంతి పురస్కారం అవార్డు ప్రకటన వెలువడింది. ఈ అవార్డుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నిరాశ ఎదురైంది. వెనిజులాలో నియంతృత్వాన్ని ఎదుర్కొంటూ ప్రజల ప్రజాస్వామ్య హక్కుల కోసం విశేషంగా కృషి చేసిన ఆ దేశ ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాడోను ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి బహుమతి వరించింది. ఈ మేరకు నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటన చేసింది. నిరంకుశ పాలన నుంచి న్యాయమైన, >>2



### 'శాంతి' వెనుక రాజకీయమేనా? 9లో

ట్రంప్ సహా శ్వేతసౌధం ప్రతినిధుల విమర్శలు

గడువు దాటాకే తమకు ఎండార్స్‌మెంట్‌లు వచ్చాయన్న నోబెల్ కమిటీ ఛైర్మన్

# ఐటి హబ్‌గా విశాఖ



శుక్రవారం సిఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశం

### గూగుల్, టిసిఎస్ సంస్థల రాకతో మారనున్న విశాఖ రూపు
### అమరావతిలో రూ.212 కోట్లతో రాజ్‌భవన్
### రూ.1.17 లక్షల కోట్ల పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం
### రాష్ట్రాన్ని నం-1 చేయాలన్నదే లక్ష్యం: సిఎం చంద్రబాబు

**విజయవాడ అక్టోబరు 10,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రాన్ని ఒక నిర్దిష్ట లక్ష్యంతో దేశంలో అత్యున్నత స్థాయిలో నిలపాలన్నదే ప్రభుత్వ ఆశయమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పునరుద్ఘాటించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతను ప్రభుత్వం ఇస్తోందని తెలిపారు. అన్ని ప్రాంతాలు ఆర్ధికంగాను, ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పన సమాంతరంగా ఉంటుందన్నారు. విశాఖపట్నం ముంబై తరహాలో అభివృద్ధి చెందుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కేబినెట్ సమావేశంలో అజెండా అంశాల తర్వాత మంత్రులతో వివిధ అంశాలపై సిఎం చర్చించారు. ఆమోదం పొందిన సంస్థలు గ్రౌండ్ అయ్యేలా మంత్రులు చర్యలు తీసుకోవాలని చంద్రబాబు తేల్చి చెప్పారు. కుట్రలు, కుతంత్రాలను అంతే బలీయంగా తిప్పికొడతామన్నారు. రాష్ట్రంపై గత పాలకులు ఎన్ని దుష్ప్రచారాలను చేసినా ప్రజామోదాన్ని పొందలేరన్నారు9. అమరావతి సచివాలయంలో నిర్వహించిన ఈ -కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులతో వివిధ అంశాలపై చర్చించారు. పెట్టుబడులకు ఆమోదంతో పాటు సంస్థలు గ్రౌండ్ అయ్యేలా మంత్రులు భాధ్యత తీసుకోవాలని తేల్చి చెప్పారు. కేబినెట్‌లో ఏప సంస్థకు ఆమోదం తెలుపుతున్నామో సంబంధిత శాఖ మంత్రి గ్రౌండ్ అయ్యేలా సమన్వయం చేసుకోవాలని చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. ఎంతో కష్టపడి రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తెస్తున్నప్పుడు రాజకీయంగాను వాటి ఫలాలు ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని చంద్రబాబు సూచించారు. విశాఖ ముంబై తరహాలో అభివృద్ధి చెందుతోందని చంద్రబాబు స్పష్టం చేశారు. గూగుల్, టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థల రాకతో ఐటీ హబ్‌గా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. 2028 నాటికి విశాఖలో వేలాది ఐటీ ఉద్యోగాలు వస్తాయని భవిష్యత్తులో విశాఖ ప్రత్యేక నగరంగా అభివృద్ధి చెందుతున్నారు. పశ్చిమలో ముంబై ఎలాంటి మహానగరమో తూర్పులో విశాఖ అంతటి మహానగరంగా అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. వచ్చే 15 ఏళ్లలో విశాఖ మహా నగరాల్లో ఒకటిగా గుర్తింపు పొందుతుందని తెలిపారు. వర్క్ ఫ్రంహోంలో భాగంగా ప్రస్తుతం 4.7 లక్షల మంది ఉన్నారు. ఈ సంఖ్యను 10 లక్షలకు పెంచాలని అభిప్రా యపడ్డారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడటంతో పాటు రైల్వేజోన్ సాధనవంటిఅంశాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. >>2

# జనవరిలో డిఎస్సీ నోటిఫికేషన్



### ఓంక్యాప్ ద్వారా వచ్చే ఐదేళ్లలో లక్ష బ్లూకాలర్ ఉద్యోగాలు
### నైపుణ్యం పోర్టల్‌లో ఇప్పటికే 23 విభాగాల డేటా బేస్: మంత్రి లోకేష్

**విజయవాడ,అక్టోబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఓం క్యాప్ కార్యక్రమం ద్వారా రాబోయే అయిదేళ్లలో లక్ష బ్లూకాలర్ ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా సుస్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఇందుకు ప్రణాళికాబద్ధమైన రూట్ మ్యాప్ సిద్ధం చేయాలనే ఈ దిశగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు రూపొందించాలన్నారు. ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని ప్రతి యువకుడికి నైపుణ్య ప్రాధాన్యత కల్పించే విధంగా ప్రత్యేక వ్యూహాలను సిద్ధం చేయాలని సూచించారు. 'ఎక్స్'వేదికగా ఆయన ఇందుకు సంబంధించి సమగ్ర సమాచారం వివరించారు. నర్సింగ్, వెల్డింగ్, ట్రక్కింగ్, బిల్డింగ్ వర్కర్లకు యూరప్‌తో పాటు జర్మనీ, ఇటలీ దేశాల్లో మంచి డిమాండ్ ఉందని పేర్కొన్నారు. ఆ రంగాల్లో విద్యనభ్యసించిన యువతకు ఆయా దేశాల భాషల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి, విదేశీ ఉద్యోగ అవకాశాలు లభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నర్సింగ్ రంగంలో ఉద్యోగాల ప్రోత్సాహానికి కేరళ మోడల్ ఆదర్శమని, ఆ రాష్ట్రం అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసి, ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయాలనిమంత్రి ఆదేశించారు. యూరప్, జీసీసీ దేశాల్లో డిమాండ్ ఉన్న ఉద్యోగాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కూడా స్పష్టం చేశారు. నైపుణ్యం పోర్టల్‌లో ఇప్పటికే 23 విభాగాల డాటాబేస్‌ను ఇంటిగ్రేట్ చేశామని మంత్రి వివరించారు. రాష్ట్రంలో ఉన్న 4,639 భారీ, మధ్యతరహా పరిశ్రమల అవసరాలను గుర్తించి, వారికి అనుగుణంగా వర్క్‌ఫోర్స్‌ను సిద్ధం చేయాలని సూచించారు. వచ్చే నెలలో ఈ పోర్టల్‌ను అధికారికంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆ సమయానికి యువతకు ఉద్యోగాలపై సంపూర్ణ సమాచారం ఒకే వేదికపై అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 83 ప్రభుత్వ ఐటీఐలను మిషన్ మోడ్‌లో అభివృద్ధి చేయాలని మంత్రి ఆదేశించారు. పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన, పీఎంఇంటర్న్‌షిప్ కార్యక్రమాలలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో నంబర్ వన్‌గా నిలపాలని లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. ఐటీఐల్లో కరిక్యులమ్, టెస్టింగ్, ఇంటర్న్‌షిప్, సర్టిఫికేషన్, ప్లేస్‌మెంట్స్ అంశాలలో నాణ్యత పెంచాలని మంత్రి స్పష్టం చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను మెరుగ్గా తీర్చిదిద్దేందుకు దేశంలోని విజయవంతమైన మోడళ్లను అధ్యయనం చేసి అమలు చేయాలని ఆదేశించారు. **హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో స్కిల్ అభివృద్ధి:** స్కిల్ డెవలప్‌మెంట్ ప్రణాళికలో భాగంగా హబ్ అండ్ స్పోక్ మోడల్‌ను అవలంబించనున్నట్లు తెలిపారు. ఇందులో >>2

# రుషికొండ భవంపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ

**విజయవాడ,అక్టోబరు 10,పభాతవార్త ప్రతినిధి:** సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం భేటీ ముగిసింది. రుషికొండ ప్యాలెస్ వినియోగంపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ భవనాన్ని ప్రయోజనకరంగా వినియోగించేందుకు సిఫార్సులు చేశారు. భేటీలో మంత్రులు పయ్యావుల కేశవ్, డీబీవీ స్వామి, కందుల దుర్గేష్ పాల్గొన్నారు. భవనం నిరుపయోగంగా ఉండటం వల్ల ఖర్చులు భరించాల్సి వస్తోందని మంత్రులు తెలిపారు. నెలకు రూ.25 లక్షలు విద్యుత్ ఛార్జీలు, మెయింటెన్స్ ఖర్చులు పెట్టాలి వసో_ందని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రతిపాదనలు, సలహాలను పరిశీలించారు. ఆతిథ్యరంగానికి హోటల్ నిర్వహణ వంటి సలహాలపై చర్చించారు. ప్రజాభిప్రాయాలు కోరుతూప్రకటన ఇవ్వాలని నిర్ణయించారు. ప్రజల నుంచి మరింత విస్తృతంగా సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. రుషికొండ భవనాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చేసే అంశంపై కసరత్తు చేశారు. ఈ సబ్‌కమిటీ త్వరలో ప్యాలెస్ వినియోగంపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది.






## కల్తీ మద్యం కేసు జనార్దన్ అరెస్టు

**విజయవాడ,అక్టోబరు 10,ప్రభాతవార్త పతినిధి:** కల్తీ మద్యం కేసులోకీలక నిందితునిగా అనుమానిస్తున్న జనార్ధన్‌రావును పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. తనకు నకిలీ మద్యం కేసులో ఎలాంటి సంబంధం లేదని, కావాలనే తనను ఇరికించారంటు ఇటీవల సెల్ఫీ వీడియోలు జనార్ధన్ రావు విడుదల చేసారు. ఈ క్రమంలోఒ సౌతాఫ్రికా నుంచి విజయవాడకు వచ్చిన జనార్ధన్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతను గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి బయటకు వచ్చే క్రమంలో పోలీసులకు చిక్కాడంటున్నారు. ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఏ1 ముద్దాయిగా జనార్ధన్‌రావు ఉన్నారు.



## రామచంద్ర యాదవ్ పర్యటనకు హై కోర్టు అనుమతి

రేపు మత్స్యకారులు, రైతులు, గ్రామస్తులతో సమావేశం

**ప్రభాతవార్త ప్రతినిధి పుంగనూరు అక్టోబర్ 10:** అనకాపల్లిజిల్లా రాజయ్యపేటలో బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ పర్యటనకు హైకోర్టు అనుమతి >>2

# బిసి హాస్టల్‌లో కలుషిత నీరు తాగిన విద్యార్థులు!

## 54 మందికి అస్వస్థత ఆసుపత్రిలో చేరిక



2లో

పెదనందిపాడు ఆరోగ్య కేంద్రం వద్ద విద్యార్థుల వివరాలు తెలుసుకుంటున్న వైద్యాధికారులు

## 11,639 ఖాళీల భర్తీకి అనుమతించండి



ప్రభుత్వానికి డిజిపి హరీష్ కుమార్ గుప్తా లేఖ

**విజయవాడ, అక్టోబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న 11,639 పోస్టులను వెంటనే భర్తీకి అనుమతినివ్వాలని ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ప్రభుత్వానికి లేఖను రాసారు. రాష్ట్రంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, సోషల్ మీడియా సవాళ్లను డీజీపీ లేఖలో ప్రస్తావిం >>2

11-10Pg2exHMNWJQE 2_11-10Pg2exHMNWJQE.qxd 10/11/2025 12:27 AM Page 1



# ఐటి హబ్‌గా విశాఖ

>> విశాఖలో 2028 నాటికి వేలాది ఐటీ ఉద్యోగాలు వస్తాయి. భవిష్యత్తులో విశాఖ ప్రత్యేక నగరంగా అభివృద్ధి చెందుతోంది. పశ్చిమలో ముంబై ఎలాంటి మహానగరమో తూర్పులో విశాఖ అంతటి మహా నగరంగా అభివృద్ధి చెందుతుంది. వచ్చే 15 ఏళ్ళలో విశాఖ మహా నగరాల్లో ఒకటిఆ గుర్తింపు పొందుతుంది. వర్క్ ఫ్రం హోంలో భాగంగా ప్రస్తుతం 4.7 లక్షల మందాఇ ఉన్నారు. ఈ సంఖ్యను 10 లక్షలకు పెంచాలి. ఏపీలో 15 నెలల్లో వచ్చిన పెట్టుబడులు గతంలో ఎప్పుడూ రాలేదు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడటంతో పాటు రైల్వే జోన్ సాధన వంటిఅంశాలు ప్రజల్లోకి తీసుకెళ్ళాలని సీఎం చంద్ర బాబు అన్నారు. 15 నెలల్లో వేగంగా ఏపీ అభివృద్ధి చెంది గూగుల్ డేటా సెంటర్ విశాఖకు రావటాన్ని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రశంసించారు. పంచాయితీల పేర్ల మార్పు,స్టాఫ్ పాటర్న్ మార్చాలన్న సిఎం అభిప్రాయాలకు పవన్ మద్దతు తెలిపారు. 15 ఏళ్ళు తాను ముఖ్యమంత్రిగా పనిచేసినా,గత 15 నెలల్లో వేగంగా సాధించినన్ని పెట్టుబడులు గతంలో రాలేదని ఈ సందర్భంగా చంద్రబాబు వ్యాఖ్యానించారు.ఇక అంతకు ముందు మంత్రి మండలి సమావేశంలో విజయనగరంలో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు,ఒర్వకల్లులో రిలయన్స్ కన్స్యూమర్ ప్రాజెక్టుకు, పర్యాటక ప్రాంతాల్లో స్టార్ హోటళ్ళ నిర్మాణ ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించింది. శ్రీశైలం ఆలయాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. పలు సంస్థలకు భూ కేటాయింపులు,సబ్సిడీలకు కేబినెట్ ఆమోదం తెలిపింది.ఈ సమావేశంలో 1,27,181 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు మరియు 78,771 ఉద్యోగాలకు ఆమోదం లభించింది. అనకాపల్లి జిల్లాలో అధునాతన కార్బన్ కాంప్లెక్స్ తయారీ, పలనాడు జిల్లాలో సిమెంట్ ప్లాంట్ మరియు గుడిపల్లి మరియు టేకులోడు (అనంతపురం జిల్లా)లో ఏరోస్పేస్ ఆటోమోటివ్ కాంపోనెంట్ తయారీ పరిశ్రమల స్థాపనకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టులు మొత్తం 5,800 కోట్ల రూపాయల పెట్టుబడి లక్ష్యం గా 6,646 మందికి ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి.ప్రకాశం జిల్లాలో ప్రొపెల్లెంట్ ప్లాంట్ కు, కర్నూలు జిల్లాలో పారిశ్రామిక ఎస్టేట్ అభివృద్ధికి, విశాఖపట్నం జిల్లాలో పారిశ్రామిక లాజిస్టిక్స్ హబ్‌కు, కర్నూలు జిల్లాలో ఇన్నోవేషన్ సెంటర్ కు, విజయనగరం జిల్లాలో ప్రైవేట్ మెగా పార్క్‌కు భూమి కేటాయింపుకు అను మతులు ఇవ్వబడ్డాయి.56,353 ఉద్యోగఅవకాశాల కల్పన లక్ష్యంగా 8,186 కోట్ల రూపాయల పెట్టుబడులను అవకాశం కల్పిస్తూ ఈ కేటాయింపులు జరిగాయి.
ఇతర ముఖ్యమైన ప్రాజెక్టులలో విశాఖపట్నంలో డేటా సెంటర్ మరియు ఐటీ క్యాంపస్‌ను ఏర్పాటు చేయడానికి ఆమోదం లభించింది. అమరావతిలో 4స్టార్ హోటళ్లు, విశాఖపట్నం జిల్లా అరకు వ్యాలీలో ఒక లగ్జరీ రిసార్ట్, శ్రీశైలం (నంద్యాల జిల్లా)లో 3స్టార్ హోటల్ మరియు కాకినాడ జిల్లాలో ఒక కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదం లభించింది. సౌర విద్యుత్ మరియు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు అనంతపురం, విజయనగరం, కర్నూలు మరియు నంద్యాల జిల్లాల్లోను, కర్నూలు, ఏలూరు మరియు చిత్తూరు జిల్లాల్లో ఆహార ప్రాసెసింగ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆమోదం లభించింది. జూన్ 2024లో ఈ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రాష్ట్ర మంత్రివర్గం 149 ప్రతిపాదనలను ఆమోదించి ,విళి 7.37 లక్షల కోట్ల పెట్టుబడులకు మరియు 6.97 లక్షల ఉపాధి కల్పనకు అవకాశం కల్పించడం జరిగింది. గూగుల్ అనుబంధ సంస్థ అయిన రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ. 87,520 కోట్ల భారీ పెట్టుబడితో నాలుగు వందల ఎనభై ఎకరాల్లో విస్తరించి ఉన్న అత్యాధునిక డేటా సెంటర్ సౌకర్యాలను స్థాపించనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా రెండు వందల ప్రత్యక్ష ఉద్యోగాలతో పాటు వేలాది పరోక్ష ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయి. నెదర్లాండ్స్, వర్జీనియా మరియు తైవాన్ వంటి ప్రాంతాలలో గూగుల్ డేటా సెంటర్ పెట్టుబడులు స్థిరంగా పరివర్తన ప్రయోజనాలను అందించిన నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ కూడా ఇలాంటి అభివృద్ధి లాభాలను అనుభవించడానికి సిద్ధంగా ఉంది.ఈ డేటా సెం టర్ సౌకర్యాలు నిర్మాణం, తయారీ మరియు IT సేవలు వంటి రంగాలలో అధిక నాణ్యత గల ఉపాధిని సృష్టిస్తాయి. అదే సమయంలో రాష్ట్ర డిజిటల్ మౌలిక సదుపాయాలను గణనీయంగా పెంచుతాయి. అధునాతన సాంకేతికతలు మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ ఆధారిత సామర్థ్యాల ఉనికి ఆవిష్కరణలను వేగవంతం చేస్తుంది, మరింత పెట్టుబడులను ఆకర్షిస్తుంది మరియు స్థానిక సంస్థలకు సాంకేతిక శక్తిని అందిస్తుంది. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. వాటికి కావలసిన ప్రోత్సాహకాలను అందజేయటం, భూములను తక్కువ ధరలకే కేటాయించడం ద్వారా ఈ రంగ అభివృద్ధికి దోహదపడుతున్నది. నేడు జరిగిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో ఏడు పర్యాటక ప్రాజెక్టులకు రాష్ట్రమంత్రి మండల ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో దాదాపు రూ.1,628.8 కోట్ల పెట్టుబడులకు అవకాశం కలిగింది. తద్వారా 4,398 మందికి ప్రత్యక్షంగా ను మరికొన్ని వేల మందికి పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. ఇక కేబినెట్ భేటీకి ముందు మంత్రి లోకేష్‌తో మంత్రులు సమావేశమయ్యారు. కుల,మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు వైఎస్సార్సీపీ ప్రయత్నిస్తోందని లోకేష్ మండిపడ్డారు. వైఎస్సార్సీపీ కుట్రలపట్ల అప్రమత్తంగా ఉండాలని మంత్రులకు లోకేష్ సూచించారు.వారి కుట్రలను బలంగా తిప్పికొట్టాలన్నారు. చిత్తూరులో అంబేద్కర్ విగ్రహానికి వైఎస్సార్సీపీ నేతలు నిప్పు పెట్టారని తెలిపారు. విగ్రహానికి నిప్పు పెట్టి ప్రభుత్వంపై నెపం వేయాలని చూశారని మండిపడ్డారు.చిత్తూరు ఘటనపై క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లాలని మంత్రి అనితకు లోకేష్ సూచించారు. నకిలీ మద్యం విషయం లోనూ వైఎస్సార్సీపీ తప్పులు చేసి మనపై రుద్దాలని చూశారని లోకేష్ తెలిపారు.



బార్బడోస్ స్పీకర్‌కు ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు ధన్యవాదాలు తెలుపుతున్న దృశ్యం

## బార్బడోస్ స్పీకర్‌తో సమావేశమైన ఏపి స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**విజయవాడ,అక్టోబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు , బార్బడోస్ జాతీయ శాసనసభ స్పీకర్ ఆర్థర్ హోల్డర్ తో సమావేశమయ్యారు. 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సుకు ఆతిథ్యం ఇచ్చినందుకు అయ్యన్నపాత్రుడు ఆయనకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ అంతర్జాతీయ కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించినందుకు హోల్డర్‌ను ఆయన అభినందించారు. ఈ సదస్సు కామన్వెల్త్ దేశాల మధ్య శాసన పరమైన అంశాలపై ఫలవంతమైన చర్చలకు వేదికగా నిలిచిందని అయ్యన్నపాత్రుడు కొనియాడారు. బార్బడోస్‌లో లభించిన ఆత్మీయ ఆతిథ్యానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# మరియాకు నోబెల్ శాంతి

>> శాంతియుత ప్రజాస్వామ్య మార్పు సాధనకై ఆమె చేసిన నిరంతర కృషి, సాగించిన పోరాటమే ఈ పురస్కారానికి అర్హురాలుగా నిలిచింది. నోబెల్ కమిటీ తమ ప్రకటనలో, మచాడో పోరాటం లాటిన్ అమెరికాలో ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న వారికి ఒక గొప్ప ప్రేరణ అని, ఆమె ధైర్య సాహసాలు ప్రపంచవ్యాప్తంగా నిరంకుశత్వానికి వ్యతిరేకంగా మద్దతును కూడగట్టాయని పేర్కొంది. నోబెల్ శాంతి పురస్కారానికి ఈ ఏడాది 244 మంది వ్యక్తులు, 94 సంస్థలు సహా మొత్తం 338 మంది అభ్యర్థుల పేర్లు ఈ అవార్డు పరిశీలనకు వచ్చాయని తెలిపింది. ఈ పురస్కార అభ్యర్థుల జాబితాలో అత్యధికంగా చర్చనీయాంశమైన పేరు అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ది. తన హయాంలో భారత్-పాకిస్తాన్ సహా ఏడు యుద్ధాలను ఆపడంలో ముఖ్య పాత్ర పోషించినందున, తనకు నోబెల్ బహుమతి దక్కాల్సిందేనని ట్రంప్ పలుమార్లు బహిరంగంగా ప్రకటించారు. అయితే, ఈసారి ట్రంప్ గెలుపు అవకాశాలు తక్కువని నిపుణులు ముందుగానే అంచనా వేశారు. ఈ జాబితాలో పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్, టెస్లా సిఇఒ ఎలన్ మస్క్, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, ఏప్రిల్‌లో మరణించిన పోప్ ఫ్రాన్సిస్ వంటి ముఖ్యమైన వ్యక్తులు సైతం ఉన్నారు. అయినప్పటికీ, వెనెజువెలాలో స్వేచ్ఛ స్థాపన కోసం పోరాడుతున్న మారియా కోరినా మచాడో వైపు నోబెల్ కమిటీ సభ్యులు మొగ్గుచూపారు. ప్రపంచ వ్యాప్తంగా నియంతృత్వానికి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాలకు మచాడో సాధించిన ఈ గౌరవం ఒక పెద్ద ప్రేరణగా నిలుస్తుందని నోబెల్ కమిటీ అభిప్రాయపడింది.

### బిసి హాస్టల్‌లో కలుషిత నీరు తాగిన విద్యార్థులు

# 54 మందికి అస్వస్థత, ఆసుపత్రిలో చేరిక

**పెదనందిపాడు అక్టోబరు 10, ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం అన్నపర్రు లోని బీసీ బాలుర హాస్టల్ లో కలుషిత ఆహారం నీరు త్రాగిన 54 మంది విద్యార్థు లు వాంతులు విరోచనాలు జ్వరం తదితరు కారణాలతో శుక్రవారం ఉదయం పెదనందిపాడు మండల ఆరోగ్య కేంద్రం కు ఆటోలలో చేరుకున్నారు .బాధితులకు మండల ప్రాథమిక కేంద్రంలోనూ. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపం లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలోను. వైద్య బృందం చికిత్సలు నిర్వహిస్తున్నారు. కలుషిత నీరు ఆహారం తీసుకోవడం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల విషయం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె విజయలక్ష్మి వెంటనే పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకొని బాధిత విద్యార్థులకు దగ్గరుండి వైద్య చికిత్సలు చేయించారు. జిల్లా కలెక్టర్ తమీ మ్ అన్సా రియా తోపాటు అధికార యంత్రాంగం మొత్తం పెదనందిపాడు చేరుకున్నారు. మండల ప్రాథమిక కేంద్రంలోనూ. కళ్యాణ మండపంలోనూ ఏర్పాటు చేసిన శిబిరంలో చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థులను కలెక్టర్ వివరాలుఅడిగి తెలుసుకున్నారు. చికిత్స శిబిరాలను పత్తిపాడు శాసనసభ్యులు రామాంజనేయులు సందర్శించి బాధితులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జరిగిన సంఘటన దురదృష్టకరమైనప్పటికీ విద్యార్థులందరూ క్షేమంగా ఉన్నారని. బాధిత విద్యార్థుల 54 మందిలో 16 మంది విద్యార్థులకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా వైద్యశాలకు తరలించామన్నారు. 21 మంది విద్యార్థులను వైద్యులు చికిత్సతో కోలుకున్న వెంటనే అన్నపర్రు హాస్టల్ కు తరలించామన్నారు. మరో 17 మంది విద్యార్థులను శిబిరంలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్సలు అందజేస్తున్నామన్నారు. విద్యార్థులు ఆసుపత్రి పాలవటానికి కారణాలను విలేకరులు అడిగినప్పుడు. వారు తీసుకున్న ఆహారాన్ని పరీక్షల నిమిత్తం ల్యాబ్ లకు పంపించామని అక్కడ నుండి వచ్చిన రిపోర్టు అనంతరం సంబంధించిన వారిపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. శాసనసభ్యులు రామాంజనేయులు మాట్లాడుతూ బాధిత విద్యార్థులందరికీ వైద్య చికిత్సలు జరుగుతున్నాయని జిల్లావ్యాప్తంగా హాస్టల్లోని సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వ పరంగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పెదనందిపాడు లోని 24 గంటల ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్ పోస్టులు భర్తీ చేస్తామని నూతన భవనం నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి తో పాటు జిల్లా వ్యాధి నిరోధక టీకాలాధికారి ఏ శ్రావణ బాబు. బీసీ సంక్షేమ శాఖ అధికారి కే మయూరి. ఆర్డీవో శ్రీనివాసరావు. తహసిల్దార్ హేనా ప్రియ. డిప్యూటీ తహసిల్దార్ షేక్ కరీముల్లా. మండల రెవెన్యూ సిబ్బంది. ఇన్చార్జి ఎంపీడీవో స్వామి రెడ్డి. ఇన్చార్జి డిప్యూటీ ఎంపీడీవో నాగయ్య. ఈవో శ్వేత. మండల ఆరోగ్య కేంద్రం డాక్టర్ నందకుమార్. డాక్టర్ ప్రియంవధ. ప్రసాద్ స్వామి. చెన్నయ్య. కాకుమాను. పాంద్రపాడు ఆరోగ్య కేంద్రాల డాక్టర్స్. ఎం ఎల్ హెచ్ ఎం పి లు. ఏ ఎన్ ఎం లు పాల్గొని బాధితులకు చికిత్సలు అందజేస్తున్నారు. అశోక పాఠశాల సెక్రెటరీ రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ పోపూరి లక్ష్మీనారాయణ తమ పాఠశాల బస్సుల ద్వారా బాధితవిద్యార్థులను వైద్య శిబిరాలకు తరలిస్తూ సేవలందించి పలువురు మన్ననలు పొందారు. వైద్య శిబిరాలను కూటమి నాయకులు నర్రా బాలకృష్ణ .టిడిపి మండల పార్టీ అధ్యక్షులు రాంబాబు. ఆర్ శివరామకృష్ణయ్య. డి నాగరాజు. హరి ప్రసాద్ తదితరు పాల్గొని విద్యార్థులకు జరుగుతున్న వైద్య సేవలను పరిశీలించారు.



బాధిత విద్యార్థుల నుండి వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా వైద్యాధికారులు

# గ్రామ పంచాయతీల్లో క్లస్టర్ వ్యవస్థ రద్దు

### 10వేలు జనాభా దాటితే రూరల్ పంచాయతీలుగా గుర్తింపు

### గ్రామ కార్యదర్శిపేరు పంచాయతీ అభివృద్ధి అధికారిగా మార్పు

### పంచాయతీరాజ్‌లో ప్రత్యేక ఐటి విభాగం: డిసిఎం పవన్

**విజయవాడ.డిసెంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** పంచాయతీరాజ్ పరిపాలన సంస్కరణలపై ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిత్వశాఖను చూస్తున్న పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి. పెట్టారు.ఆయన చేసిన పలు సంస్కరణలు,సూచనలకు శుక్రవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించింది.ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో గ్రామ పంచాయతీల్లో పారదర్శకతతో కూడిన పాలన అందించేందుకు ఈ నూతన విధానాలకు రూపకల్పన చేశారు. మాజీ రాష్ట్రపతి డా.అబ్దుల్ కలాం గారు˘పల్లెల్లో మౌలిక వసతులు మెరుగుపరచడానికి, పౌర సేవలు సక్రమంగా అందేలా పాలన వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాల్సని చెప్పారు. ఆ స్ఫూర్తిని ఆచరణలోకి తీసుకువచ్చేలా సంస్కరణలకు పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారు పంచాయతీరాజ్ పరిపాలన సంస్కరణలపై ఆయన ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఈ శాఖల ఉన్నతాధికారులు, పంచాయతీరాజ్ వ్యవస్థపై అధ్యయనం చేసిన నిపుణులతో నాలుగు నెలలపాటు పలు దఫాలు చర్చలు చేశారు.10 వేలు జనాభా దాటిన పంచాయతీలను ఇకపై రూర్బన్ పంచాయతీలుగా గుర్తిస్తారు. పట్టణ స్థాయి మౌలిక సదుపాయాలను రూర్బన్ పంచాయతీలలో కల్పిస్తారు. వీటి పరిధిలో 359 పంచాయతీలు వస్తాయి. నూతన విధానంలో గతంలో ఉన్న క్లస్టర్ విధానం రద్దు చేసి పంచాయతీలను నాలుగు గ్రేడ్లుగా వర్గీకరించనున్నారు. పంచాయతీ కార్యదర్శి పేరును పంచాయతీ అభివృద్ధి అధికారి (పి.డి.ఓ.)గా మార్పు చేశారు.స్వతంత్ర యూనిట్లుగా 13,351 గ్రామ పంచాయతీలు ఉంటాయి.ఈ గ్రామ పంచాయతీల్లో పరిపాలనా సంస్కరణల్లో భాగంగా ప్రస్తుతం అమలులో ఉన్న క్లస్టర్ వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసింది. 7,244 క్లస్టర్ల స్థానంలో 13,351 గ్రామ పంచాయతీలను ఇక మీదట స్వతంత్ర పరిపాలనా యూనిట్లుగా పరిగణిస్తారు. పరిపాలనా సౌలభ్యం కోసం మొత్తం పంచాయతీలను నాలుగు గ్రేడ్లుగా పునర్ వర్గీకరించింది.
మరో మూడు గ్రేడ్లుగా గ్రామ పంచాయతీలను వర్గీకరిస్తూ నిర్ణయం తీసుకుంది. గ్రేడ్ 1 పంచాయతీల్లో పని చేస్తున్న 359 మంది కార్యదర్శుల వేతన శ్రేణి పెంపుతోపాటు డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (డెప్యూటీ ఎం.పి.డి.ఓ.) కేడర్ కు వారికి పదోన్నతి కల్పిస్తారు. వీరిని 359 రూర్బన్ పంచాయతీల్లో నియమిస్తారు.
ప్రస్తుతం అమలులో ఉన్న ఐదు గ్రేడ్ల పంచాయతీ కార్యదర్శులను మూడు గ్రేడ్లుగా సమీకరిస్తారు. వీరితోపాటు 359 మంది జూనియర్ అసిస్టెంట్/జూనియర్ అసిస్టెంట్‌కమ్‌బిల్ కలెక్టర్ల వేతన శ్రేణి పెంపుతోపాటు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తారు. మెరుగైన పరిపాలన అందించేందుకు వీలుగా వీరిని రూర్బన్ గ్రేడ్ గ్రామ పంచాయతీల్లో నియమిస్తారు. నూతన విధానంలో గ్రామ పంచాయతీల్లో పని చేసే సిబ్బంది కూర్పులోనూ మార్పులు చేశారు. మున్సిపాలిటీల్లో ఉన్న విధంగా ప్లానింగ్, పారుశుధ్యం, మంచి నీటి సరఫరా మరియు ఆఫీస్ సిబ్బంది విభాగాలు ఏర్పాటు చేస్తారు. ఇందులో భాగంగా అవుట్ సోర్సింగ్/కాంట్రాక్ట్ సిబ్బంది జీతభత్యాలు గ్రామ పంచాయతీ జనరల్ ఫండ్ నుంచి ఇస్తారు. అవసరాన్ని బట్టి ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్ల సేవలకు వీరిని వినియోగించుకునేందుకు ప్రభుత్వం అమోదం తెలిపింది. వీరిని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అసిస్టెంట్లుగా కూడా ఉపయోగిస్తారు. గ్రామ సచివాలయం బాధ్యతలతోపాటు భవనాలు, లే అవుట్ల నిబంధనలు వంటి సేవలనూ వీరు అందిస్తారు.
**ఇంటర్ కేడర్ ప్రమోషన్లకు వెసులుబాటు:** మినిస్టీరియల్ మరియు క్షేత్ర స్థాయి పోస్టుల మధ్య పరస్పర ప్రమోషన్లకు అవకాశం కల్పించారు. అందుకు సంబంధించిన సర్వీస్ రూల్స్ కి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇంటర్ కేడర్ ప్రమోషన్ల కోసం సిబ్బందికి రెండు వారాలపాటు శిక్షణ ఇస్తారు. ఆ తర్వాత ఏడాదిపాటు ఆన్ జాబ్ శిక్షణ ఉంటుంది. వీరికి క్షేత్ర స్థాయి అనుభవం, ఎగ్జిక్యూటివ్ సిబ్బందికి పరిపాలన అనుభవం లభిస్తుంది. ప్రస్తుతం ఉన్న వేతన శ్రేణిలోనే ఇంటర్ కేడర్ ప్రమోషన్లు అమలవుతాయి. దీంతోపాటు డిప్యూటీ ఎంపీడీఓ పోస్టింగ్ లకు విధివిధానాలు రూపొందించింది. నేరుగా డిప్యూటీ ఎంపీడీఓలుగా నియమితులైన వారు కనీసం మూడు సంవత్సరాల పాటు ప్రాథమిక శిక్షణ పూర్తి చేసి స్పెషల్ గ్రేడ్ పంచాయతీల్లో పంచాయతీ అభివృద్ధి అధికారులుగా పని చేయాలి. సంస్కరణల్లో భాగంగా పంచాయతీ రాజ్ శాఖలో ప్రత్యేక ఐటీ విభాగం ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ విభాగంలో అర్హులైన డిజిటల్ అసిస్టెంట్ల సేవలు వినియోగించుకుంటూ గ్రామ పంచాయతీల్లో రికార్డులు, ఆన్ లైన్ ద్వారా పరిపాలనను పర్యవేక్షి స్తారు.

## వారం - వర్జ్యం

11-10-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
పంచమి సా.4.48
రోహిణి మ.3.24
వర్జ్యం : రా.8.36-10.05
దు.ఉ.6.00-7.34
శుభసమయం : ఉ.8.15-8.50
రాహుకాలం - ఉ.9.00-10.30

## వారాఫలం

**మేషం :** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**వృషభం :** చాకచక్యంగా వ్యవహరించి పనులు పూర్తి చేసుకుంటారు.

**మిథునం:** కొత్త కాంట్రాక్టులు లాభిస్తాయి. ఉద్యోగావకాశాలు అనుకూలిస్తాయి.

**కర్కాటకం :** కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు.

**సింహం:** మీరు చేపట్టిన కార్యక్రమాలు సమర్థవంతంగా పూర్తి చేయగలుగుతారు.

**కన్య :** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ఆర్థికలాభాలు.

**తుల :** పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

**వృశ్చికం:** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఉద్యోగులకు స్థానచలనం.

**ధనుస్సు:** సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. ప్రయాణాలు.

**మకరం:** గృహోపకరణాలను, సౌందర్య సాధక సామాగ్రికి అధికంగా ఖర్చు చేస్తారు.

**కుంభం:** మనస్సు మారు మూలలోని ఆశ నెరవేరేటట్లు తోస్తుంది.

**మీనం :** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వివాహ యత్నాలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## డిఎస్సీ నోటిఫికేషన్

>> భాగంగా విశాఖపట్నం, అనంతపురం, చిత్తూరు జిల్లాలను ప్రధాన హబ్‌లుగా అభివృద్ధి చేస్తారు. ఈ హబ్‌లకు అనుబంధంగా 13 స్పోక్స్ సెంటర్లు ఏర్పాటు చేసి, రాష్ట్రవ్యాప్తంగా ఐటీఐలను నైపుణ్య శిక్షణ కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ఆర్సెలర్ మిట్టల్ అండ్ నిప్పాన్ స్టీల్స్ అనుబంధ సంస్థ నామ్ టెక్ రాష్ట్రంలో నైపుణ్య శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిందని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఈ భాగస్వామ్యం ద్వారా రాష్ట్ర యువతకు అంతర్జాతీయ ప్రమాణాల నైపుణ్య శిక్షణ లభించే అవకాశం ఉందన్నారు. ఇక ఉపాధ్యాయ ఖాళీల భర్తీకోసం జనవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. మార్చిలో స్పెషల్ డీఎస్సీ పరీక్షలు నిర్వహించి స్కూళ్ల ప్రారంభం అయ్యే నాటికి కొత్త టీచర్లను రిక్రూట్ చేస్తామని తెలిపారు. స్పెషల్ డీఎస్సీలో భాగంగా ఆర్థికశాఖ 2,260 పోస్టులకు ఆమోదం తెలిపింది. డీఎస్సీకి ముందు నవంబర్లో టెట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

## హై కోర్టు అనుమతి

>> ఇచ్చింది. బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో మత్స్యకారులు, రైతులు, గ్రామస్తులకు ఇచ్చిన మాట ప్రకారం రామచంద్రయాదవ్ ఈనెల 12న రాజయ్యపేటలో పర్యటించబోతున్నారు. ఈనెల 5న రాజయ్యపేట పర్యటనకు వెళుతున్న రామచంద్ర యాదవ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ఆయన రాజమండ్రిలో బస చేసిన హోటల్ వద్దకు పోలీసులు చేరుకొని నానా హంగామా చేశారు. హోటల్ గదిలో నుంచి బయటికి రానీయకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. హైకోర్టు అనుమతితోనే రాజయ్యపేటకు వస్తానని అదే రోజు ప్రకటించారు. ఆయన ఇచ్చిన మాట ప్రకారం వారం రోజుల్లోపేహైకోర్టు అనుమతితో రాజయ్యపేటలో పర్యటించబోతున్నారు. కాగా రామచంద్రయాదవ్ రాక కోసం మత్స్యకారులు, రైతులు, రాజయ్యపేట గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు.
సోమవారం ఆయన రాజయ్య పేటకు చేరుకుని బాధితులతో సమావేశమ వుతారు. అనంతరం బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీ వ్యతిరేక ఉద్యమంలో ఆయన పాల్గొంటారు. రామచంద్రయాదవ్ పర్యటనకు బిసివై పార్టీ శ్రేణులు ఏర్పాట్లను ప్రారంభించారు.

# భవిష్యత్తులో భారత్ అగ్రగామి

## పి4 తో పేదరిక నిర్మూలన: సిఎం చంద్రబాబు



నంద గోకులం ప్రారంభించి విద్యార్థులతో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**వెంకటాచలం (నెల్లూరు), అక్టోబరు 10, ప్రభాతవార్త :** భారతదేశం 2047 కల్లా ప్రపంచంలో అభివృద్ధి పరంగా ప్రథమ స్థానంలో నిలుస్తుందని,అదే తరహా లో మన రాష్ట్రం కూడా దేశంలో అగ్రగామిగా నిలుస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం ఈదగాలి గ్రామంలో ఏర్పాటు చేసిన మూడు ప్రాజెక్టులు 1) నంద గోకులం హైస్కూల్ 2) గోశాల 3)విశ్వసముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంటను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగ ప్రారంభించారు.ముందుగా నంద గోకులం లో లైఫ్ స్కూల్ను పరిశీలించి విద్యార్థులతో కొంత సేపు ముకాముఖిగా మాట్లాడారు.అక్కడ నుంచి గోశాలకు చేరుకొని అక్కడ చేపడుతున్న ఎద్దులతో గొలుసుతో కరెంటు ఉత్పత్తి చేయడం మొదటగా చూస్తున్నాను అని అన్నారు.ఈ కరెంటు ఉత్పత్తి వల్ల 5 యూనిట్లు కరెంటు ఆదా అవుతుందన్నారు.విశ్వసముద్ర ఫౌండేషన్ చైర్మన్ చింత శశిదర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు ప్రాజెక్టులు పేద విద్యార్థులు,రైతులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.దేశంలో ధనికులు ఉన్న ఇలాంటి ఆలోచనలు కొంత మందేకే వస్తాయిన్నారు.4 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన విశ్వసముద్ర బయో ఎనర్జీ ఎథనాల్ ప్లాంట్ రోజుకు 200 కిలోలీటర్ల ఇథనాల్ ను ఉత్పత్తి చేస్తుందన్నారు.దీని కోసం 15 వేల టన్నులకు పైగా పాడైన బియ్యం, నూకలు, పంట వ్యర్థాల కొనుగోలు ద్వారా రైతులకు మేలు జరుగుతోందన్నారు.రైతుల సంక్షేమంతో పాటు ఇథనాల్ తయారు చేస్తూ దేశ ప్రగతికి తోడ్పడుతున్నారు.సమాజానికి తిరిగి ఇవ్వటం అనే కాన్సెప్టులో భాగమే పీ4, డబ్బులు ఇవ్వటం ఒక్కటే కాదు, చేయూత ఇవ్వడమూ ముఖ్యమన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జీరో పావర్టీ పీ4 లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లటం అందరు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి రజ్యసభ సభ్యులు బీదా మస్తాన్ రావ్,ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి,కురుగుండ్ల రామకృష్ణ,నాగేశ్వర్ రావ్,విజయశ్రీ ,కోట్టమరెడ్డి శ్రీధర్ రెడ్డి,కలెక్టర్ హిమాన్షు శుక్లా,ఎస్పి అజిత,కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 11,639 ఖాళీల భర్తీకి అనుమతించండి

>> చారు.ఈ క్రమంలో రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వివిధ స్థాయి పోలీసు ఉద్యోగాల వివరాలు ప్రభుత్వానికి అందించారు. సివిల్ విభాగంలో 315 ఎస్సై, 3,580 కానిస్టేబుల్ ఖాళీలు ప్రభుత్వం ఆమోదిస్తే త్వరలోనే కొత్త నోటిఫికేషన్ జారీ చేస్తామని వివరించారు. ఇటీవలే 6,100 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం ఏపీలో నిరుద్యోగులకు త్వరలోనే శుభవార్త అందే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్ర పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న 11,639 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గత నెల 29న రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్‌కు ఆయన ఒక లేఖ రాశారు. ప్రభుత్వ అనుమతి లభించిన వెంటనే భారీస్థాయిలో పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రస్తుతం ఉన్న సిబ్బంది సరిపోవడం లేదని డీజీపీ తన లేఖలో పేర్కొన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాలు పెరిగిపోవడం, సోషల్ మీడియా ద్వారా కొందరు అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తుండటం పోలీసులకు సవాలుగా మారుతోందని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో పోలీసు శాఖలో సిబ్బంది కొరతను అధిగమించాల్సిన అవసరం ఉందని, వెంటనే నియామకాలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పోలీసు శాఖలోని సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్), ఏపీఎస్పీ, కమ్యూనికేషన్స్ వంటి వివిధ విభాగాల్లో ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి మొత్తం 11,639 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు డీజీపీ తన నివేదికలో తెలిపారు.

# వైద్య కళాశాల నిర్మాణం జరుగుతున్నట్లు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం

### లేకుంటే ముక్కునేలకు రుద్ది జగన్ క్షమాపణలు చెప్పాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ డిమాండ్

**విశాఖపట్నం, అక్టోబరు 10 ప్రభాతవార్త:** గురువారం తన నర్సీపట్నం పర్యటన సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వైద్యారోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర ఆక్షేపణ తెలిపారు. నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాలకు సంబంధించి తన సహజ లక్షణమైన అసత్యాలను వల్లెవేసి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి జగన్‌రెడ్డి విఫలమైన కృషి చేశారని మంత్రి వ్యాఖ్యానించారు. భూసేకరణే జరగలేదు, నిర్మాణ పనులెక్కడ?పార్వతీపురం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నట్లు, అందుకు సంబంధించిన ఫోటోలను పరిశీలిస్తే ఈ విషయం వెల్లడవుతుందని మాజీ సిఎం వ్యాఖ్యానించడాన్ని మంత్రి తీవ్రంగా ఖండించారు. ఈ కాలేజీకి సంబంధించి అధికారంలో నుండి వైదొలగే దాకా జగన్‌రెడ్డి కనీసం భూసేకరణ కూడా చేయలేదని ఈ వాస్తవాన్ని విస్మరించి ఆ కాలేజీ నిర్మాణంలో ఉన్నట్లు పట్టపగలు, బహిరంగంగా అబద్ధాలు చెప్పడం జగన్‌కే సాధ్యమని మంత్రి నేడొక ప్రకటనలో ఎద్దేవా చేశారు. నేను రాజీనామాకు సిద్ధం...నీవు క్షమాపణలు చెప్పగలవా?పార్వతీపురం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి సంబంధించి వాస్తవాల్ని వెలుగులోకి తేవడానికి మాజీ సిఎం తనకు ఇష్టమైన వారితో నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. ఆ కమిటీ వాస్తవాల్ని పరిశీలించి భూసేకరణ జరిగి, నిర్మాణ పనులు జరుగుతున్నాయని నిర్ధారిస్తే తాను వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని,లేకుంటే జగన్‌రెడ్డి తన ముక్కును నేలకు రుద్ది క్షమాపణలు తెలపాలని మంత్రిసూచించారు.ఈ సవాల్‌ను స్వీకరించే నిజాయితీ, ధైర్యముంటే జగన్ వెంటనే స్పందించాలని మంత్రి డిమాండ్ చేశారు.

# 2047కు భారత్ నంబర్ 1

## రాష్ట్రాన్ని నంబర్ 1గా చేయడమే లక్ష్యం

### ముఖ్యమంత్రి చంద్రబాబు

**వెంకటాచలం (నెల్లూరు), అక్టోబర్ 10, ప్రభాతవార్త :** 2047కి భారత్ నెంబర్ 1 ఆర్థిక వ్యవస్థగా తయారవుతుందని . ఏపీ దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా ఉంటుందిని నిరంతరం కృషి చేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం సర్వేపల్లి గ్రామంలోనే శుక్రవారం మూడు ప్రాజెక్టులను ముఖ్యమంత్రి ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కోసం కేబినెట్ లో నిర్ణయం తీసుకున్నామన్నారు.రూ.88 వేల కోట్లతో దేశ చరిత్రలోనే అతిపెద్ద పెట్టుబడిగా విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు కాబోతోందన్నారు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కు ఆల్గారిథమ్స్ కూడా రాసేలా మన పిల్లలు సిద్ధం అవుతున్నారు. ఇథనాల్ ప్లాంట్ ద్వారా పర్యావరణానికి మేలు కలగటంతో పాటు రైతులకూ ఆదాయం కలుగుతుందన్నారు. నెల్లూరు జిల్లాలో సోమశిల, కండలేరు లాంటి మంచి ప్రాజెక్టులు ఉన్నాయి. 150 టీఎంసీల నీళ్ల ఈ రెండు ప్రాజెక్టుల్లో ఉంటాయిన్నారు . భవిష్యత్తులో నీటి కొరత లేకుండా ఈ ప్రాజెక్టుల్లో నీటి నిల్వ ఉంచుతామన్నారు. కృష్ణపట్నం పోర్టు, రామాయపట్నం పోర్టు, దుగరాజపట్నం పోర్టులు కూడా జిల్లా అభివృద్ధికి కీలకంగా మారతాయి.దగదర్తి విమానాశ్రయం కూడా త్వరలోనే వస్తుంది. బీపీసీఎల్ గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీ , క్రిబ్ కో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ కూడా రాబోతోంది.తధ్వర జిల్లాకు మరింత ఆదాయం తో పటు ఉపాధి అవకాశాలు మెండు గా ఉంటాయి అన్నారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి రజ్యసభ సభ్యులు బీదా మస్తాన్ రావ్,ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి,కురుగుండ్ల రామకృష్ణ, నాగేశ్వర్ రావ్,విజయశ్రీ ,కోట్టమరెడ్డి శ్రీధర్ రెడ్డి,కలెక్టర్ హిమాన్షు శుక్లా,ఎస్పి అజిత,కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఇంధనం కర్మాగారం ప్రారంభిస్తు సింఎం

# పలు పోస్టుల ఫలితాలు విడుదల చేసిన ఎపిపిఎస్సీ

**విజయవాడ,అక్టోబరు 10,పభాతవార్త** ప్రతినిధి వైద్యా రోగ్య శాఖలో లైబ్రేరియన్,ఏపీ గ్రౌండ్ వాటర్ సర్వీసులో అసిస్టెంట్ కెమిస్ట్,అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్,ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్,ఉదో ్యగ నియామక పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఏపీపీఎస్సీ ప్రకటించింది. ప్రాథమిక ఎంపిక జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపింది. అటవీ శాఖ సెక్షన్ అధికారి, బీట్,సహాయ బీట్ అధికారి పోస్టులకు నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షా ఫలితాలను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. ప్రధాన పరీక్షకు ఎంపికైన అభ్యర్థుల జాజాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపింది.

# జాతీయ సాంస్కృతిక ఉత్సవాలతో బెజవాడ పులకించి పోవాలి: మంత్రి సత్యకుమార్‌యాదవ్



జాతీయ సాంస్కృతిక ఉత్సవాల గురించి మంత్రి సత్యకుమార్‌కు వివరిస్తున్న కలెక్టర్

**విజయవాడ.అక్టోబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ సాంస్కృతిక ఉత్సవాలతో బెజవాడ పులకించి పోవాలని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, విద్యా వైద్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు., శుక్రవారం ఉదయం విజయ వాడ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో జరిగిన ఒక సదస్సు కు సత్య కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ కార్యక్రమం అనంతరం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీ శ ఆదేశం మేరకు నవం బరు 22, 23 తేదీల్లో విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో రెండు రోజులపాటు జరుగనున్న జాతీయ సాంస్కృతిక ఉత్సవాల నిర్వహణ గురించి, కార్యక్రమాల వివరాలను కలెక్టర్ డా. జి. లక్ష్మీ శ సమక్షంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ కు ఉత్సవాల నిర్వహణ కమిటీ కన్వీనర్ కలిమిశ్రీ వివరించారు.రచయితలు, కళాకారులే కాకుండా కార్టూనిస్టులూ కలవడం గుర్తుండిపోయే సన్నివేశం. ఈ ఉత్సవాలు సమాజాన్ని గొప్పగా ప్రభావితం చేసేవిగా వుండాలి. ఆహ్లాదంగా జరగాలి...బెజవాడ పులకించి పోవాలి. నిర్వహణ ఆ విధంగా ప్లాన్ చేసుకోండిఖి అంటూ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెన్నుతట్టారు.ఇటువంటి సదస్సులే తాను అన్ని విధాలుగా రాటుదేలటానికి వీలు కల్పించాయని మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యానించారు.ఓ మంచి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అండగా నిలుస్తారు.

# ముఖ్యమంత్రిగా 15 యేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసిన సిఎంకి శుభాకాంక్షలు :

## హోంమంత్రి అనిత

**విజయవాడ,అక్టోబరు 10,పభాతవార్త ప్రతినిధి:** విజన్ 2020 లాంటి కష్టసాధ్యమైన లక్ష్యాలను సునాయాసంగా చేరుకున్న మీ ప్రయాణం ఎందరికో ఆదర్శం.అదే స్ఫూర్తితో విజన్ 2047 లక్ష్యాలను చేరేందుకు మీ ప్రతి అడుగులో మీ వెంట ఉండటం మాకు గర్వకారణంఅకుంఠిత దీక్ష సంకల్పంబలంతోనే ఇంతటి విజయం సాధ్యం మీరు చూపిన మార్గం మీరు అందించే స్ఫూర్తితో ప్రజలకు సేవ చేసే అవకాశం దొరకడం నా అదృష్టంసామాన్య స్థాయి నుంచి అసామాన్య స్థాయికి ఎదిగిన మీ ప్రయాణంలో ఇలాంటి మైలురాళ్ళు ఎన్నో దాటాలని ఆకాంక్షిస్తూ అభివందనం' హోంమంత్రి వంగలపూడి అనితపేర్కొన్నారు.

# తిరుమల సమాచారం

## ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం



**తిరుమల,అక్టోబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా, శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న ఎస్వీఅన్నప్రసాద్ ట్రస్ట్‌కు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. టిటిడి బోర్డుసభ్యుడు దర్శన్ 10లక్షలు రూపాయలు డిడిని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి ఆయన బంగ్లాలో కలసి అందజేశారు. బోర్డు సభ్యుడిగా, స్వామివారి సేవకుడిగా తనవంతుగా విరాళాలివ్వడం ఆనందంగా ఉందన్నారు.

## అందరూ సంతోషంగా ఉండాలని వేడుకున్నాం



**తిరుమల,అక్టోబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే అందరికీ మంచి జరుగుతుందని ,ప్రజలు సుఖసంతోషాలతోఉండాలని వేడుకున్నట్లు న్యాయమూర్తులు తెలిపారు.శుక్రవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి. కృష్ణమోహన్, జస్టిస్ రవి చెమలపాటి కుటుంబంతో కలసి విఐపి బ్రేక్ దర్శనాల ప్రారంభసమయంలో ఆలయం వద్దకు చేరుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు



**తిరుమల,అక్టోబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం రాష్ట్ర ఆర్టీసి ఎండి ద్వారకా తిరుమలరావు, కర్నాటకమంత్రి కెహెచ్ మునియప్ప దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకుని దేవదేవుని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# గ్యాంగ్ రేప్ కేసులో ఇద్దరికి జీవితఖైదు

**సూళ్లూరుపేట, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** సూళ్లూరుపేటలో 2019వ సంవత్సరం ఫిబ్రవరి 3వ తేదీన జరిగిన గ్యాంగ్ రేప్‌కు సంబంధించి ముద్దాయిలైన తిరువళ్లూరు నవీన్‌కుమార్ (26), కేకుల దేవాలకు జీవితఖైదుతో పాటు నగదు దోపిడీకి సంబంధించి పదేళ్ల కఠిన కారాగార శిక్ష రూ.2 వేలు జరిమానా విధిస్తూ నెల్లూరు 8వ ఎడిజె కోర్టు జడ్జి శుక్రవారం తీర్పునిచ్చారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు ముద్దాయిలకు కఠిన శిక్ష పడేలా విశేష కృషి చేస్తున్న తిరుపతి జిల్లా పోలీసులను అభినందించారు. ముఖ్యంగా సూళ్లూరుపేటలో 2019 ఫిబ్రవరి 3వ తేదీన జరిగిన గ్యాంగ్ రేప్‌కు సంబంధించిన వివరాలను సీఐ మురళీకృష్ణ వెల్లడించారు. బాధితురాలు, ఆమె స్నేహితుడు ఇద్దరూ రైల్వేస్టేషన్‌లో బెంచ్‌పై కూర్చొని తమ వివాహం గురించి చర్చించుకుంటుండగా, బాధితురాలిని నవీన్‌కుమార్, దేవాలు బెదిరించారు. ఆమె స్నేహితుడిని కొట్టి అతని వద్ద ఉన్న డబ్బులు తీసుకుని పారిపోయారన్నారు. అనంతరం యువతిపై లైంగికదాడి చేసి అక్కంపేట రైల్వేస్టేషన్‌లో వదిలేసి వెళ్లిపోయారని తెలిపారు. ఈ విషయమై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో అప్పటి సిఐ కిషోర్‌బాబు కేసు దర్యాప్తు చేసి ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేశారని తెలిపారు.

# ఖ అధిక ధర ఆశ చూపి సీసాల కొనుగోలు, సూరంపల్లిలో తయారుచేసి ములకలచెరువుకు రవాణా

## శ్రీనివాసరెడ్డి, కళ్యాణ్‌ల రిమాండ్ రిపోర్టులో ఎక్సైజ్ శాఖ

**విజయవాడ,అక్టోబరు 10,పభాతవార్త ప్రతినిధి:**తనకు సీసాలు సరఫరా చేస్తే అధిక లాభాలు ఇస్తానని ఆశపెట్టి నిందితుడు అద్దేపల్లి జగన్మోహన్‌రావు కొనుగోలు చేశాడు. సాధారణంగా ఇచ్చే ధర కంటే ఒక్కో సీసాకు 30 పైసలు అదనంగా ఇచ్చి మరీ తీసుకున్నాడు. నకిలీ మద్యం కోసం కొన్నట్లు తెలిసినా శ్రీనివాస పెట్‌బాటిల్స్ యజమాని...నిందితుడితో కుమ్మక్కై సరుకును మూడు విడతలుగా అందచేసినట్లు శ్రీనివాసరెడ్డి,కళ్యాణ్‌ల రిమాండ్ రిపోర్టులో ఎక్సైజ్ శాఖ పేర్కొంది..కృష్ణాజిల్లా గన్నవరం మండలం సూరంపల్లి పారిశ్రామికవాడలో ఉన్న శ్రీనివాస పెట్‌బాటిల్స్ యజమాని శ్రీనివాసరెడ్డిని...జగన్మోహన్‌రావు సంప్రదించాడు.తనకు 180 ఎంఎల్,200 ఎంఎల్.,పరిమాణం గల సీసాలను తయారుచేసి ఇవ్వాలని కోరాడు. దేనికని శ్రీనివాసరెడ్డి అడిగితే...నకిలీ మద్యం గురించి వివరించాడు. సాధారణంగా ఇచ్చే ధర కంటే ఎక్కువే ఇస్తానని ఆశ చూపించాడు. దీంతో సీసాల సరఫరాకు శ్రీనివాసరెడ్డి అంగీకరించాడు. ఒక్కో సీసాకు రూ.1.30 తీసుకుంటాడు. రూ.1.60 చొప్పున సరఫరా చేసేందుకు అంగీకరించాడు. జీఎస్టీ నంబరు కావాలని పరిశ్రమ యజమాని అడగటంతో ...ధరఖాస్తు చేశారనని త్వరలో వస్తుందని నిందితుడు చెప్పాడు. ఒప్పందం మేరకు మూడు విడతలుగా 1.31 లక్షల సీసాలను తయారుచేసి ములకలచెరువు మండలం నాయునిచెరువుపల్లికి మంత్రి శివప్రసాదరెడ్డి పేరుతో రవాణా చేశాడు.

# ప్రజల సంక్షేమం కోసం జీవితాన్ని అంకితం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు: మంత్రి అచ్చెన్నాయుడు

విజయవాడ,అక్టోబరు 10,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా 15 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానం పూర్తయిన సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు గారు కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదు, ఆయన ఒక విజనరీ స్టేట్స్‌మన్, ఒక ప్రతిభావంతుడు శిల్పి. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును ముందుగానే ఊహించి, ఆధునిక సాంకేతికతతో, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి విధానాలతో రాష్ట్రానికి దిశానిర్దేశం చేసిన గొప్ప నాయకుడు ఆయన. ఐటి రంగం ద్వారా హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలిపిన దార్శనికుడు, రైతుకు సాంకేతికతను చేరువ చేసిన సంస్కర్త, యువతకు అవకాశాల ద్వారాలు తెరిచిన మార్గదర్శి చంద్రబాబు గారు అని అన్నారు. ఏ రంగంలో చూసినా ఆయన దూరదృష్టి, కష్టపడే తీరు, పారదర్శక పాలనకు నిదర్శనం. స్మార్ట్ ఆంధ్రప్రదేశ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్, ఈ గవర్నెన్స్, వాటర్ మేనేజ్‌మెంట్, ఫార్మ్ టు మార్కెట్ లింకేజెస్ వంటి అంశాలను అమలుచేసి రాష్ట్రాన్ని ఆధునిక దిశగా నడిపించారు. ఆయన కలల అమరావతి రాజధాని ఆలోచన,

గ్రామ సచివాలయాల భావన, రైతుల అభివృద్ధి కోసం తీసుకొచ్చిన పథకాలు, ప్రజా కేంద్రిత ఆలోచనలకు ప్రతీకలు అని మంత్రి అభిప్రాయపడ్డారు.

## తిరుపతి గరుడవారధిపై ప్రమాదం - ఇద్దరు యువకులు దుర్మరణం

**తిరుపతి,అక్టోబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతినగరంలో గరుడవారధిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణంపాలయ్యారు. వారధిపై నుండి 50అడుగుల క్రిందపడటంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తిరుచానూరు మార్గంలోని మార్కెట్‌యార్డు వద్దనుండి తిరుపతి కపిలతీర్థం సమీపం వరకు ఉన్న గరుడవారధిపై ఇటీవల వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం చంద్రగిరి కందులవారిపల్లికి చెందిన కనిష్క్(22),కొట్టాలకు చెందిన వాస్తవ్‌కామినేని(22)ఇద్దరూ బుల్లెట్ ద్విచక్రవాహనంపై వారదిపై వస్తుండగా లక్ష్మీపురంకూడలి వద్ద మలుపువద్ద అతివేగంగా రావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో క్రిందపడ్డారు. ఈ ప్రమాదంలో వారధిపై నుండి పడటంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు.

# భవిష్యత్తులో భారతదేశం అంతరిక్షంలో నంబర్ వన్‌గా ఉండాలి

## - సతీష్ ధావన్ మూడవ లాంచ్ డైరెక్టర్ పి.శ్రీనివాస్

**బొబ్బిలి (విజయనగరం జిల్లా) అక్టోబర్ 10 ప్రభాతవార్త:** భవిష్యత్తులో భారతదేశం అంతరిక్షంలో ప్రపంచ పటాలలో నెంబర్ వన్‌గా ఎదగడానికి వడివడిగా అడుగులు వేస్తున్నామని శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ మూడవ లాంచ్ డైరెక్టర్ పి.శ్రీనివాస్ అన్నారు. విజయనగరం జిల్లా బొబ్బిలి రాజా కళాశాలలో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ ఆధ్వర్యంలో అంతరిక్ష వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూమికి అతీతంగా జీవించగలిగే మనిషి అంతరిక్షంలో కూడా జీవించడానికి భవిష్యత్తును ఉత్తేజపరిచే కార్యక్రమాలపై మన సైంటిస్టులు పరిశోధనలు జరుపుతున్నారని అన్నారు. దేశానికి యువశక్తి కృషి ఎంతైనా ఉందని శాస్త్ర పరిశోధనా రంగాలలో మరింత లోతైన అధ్యయనం సాధించే విధంగా విద్యార్థులు ఇప్పటి నుంచే భవిష్యత్ ప్రణాళికలు వేసుకొని అంతరిక్షంలో మనిషి జీవన విధానం పూర్తిస్థాయి అధ్యయనం సాగించిన నాడే ప్రపంచ పటంలో మన దేశం అత్యున్నతంగా నిలబడే రోజులు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. శాస్త్ర సాంకేతిక రంగానికి మన వంతు కృషి చేసినప్పుడే అంతరిక్షాన్ని శోధించడం అంత కష్టమేమి కాదని అన్నారు. నాడు ఆకాశం పైకి వెళ్ళడానికి సాహసించాం నేడు దాని వెనుక ఏముందో శోధిస్తున్నామని అన్నారు. మనిషి జీవనానికి ఇక్కడ యోగ్యత ఉందా లేదా అన్న అంశంపై కృషి చేస్తున్నామని అన్నారు. చంద్రయాన్ మంగళయాన్ మిషన్ ద్వారా రెడ్ ప్లానెట్‌కు చేరి భారత్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఆదిత్య ఎల్ వన్ సూర్యుడిని పరిశోధించి భూమిని రక్షించడానికి దోహద పడిందన్నారు. ఈ నెలాఖరకు గగనయాన్ ప్రయోగం జరుగుతుందని దానికి ముమ్మర పనులు సాగుతున్నాయని దీనిద్వారా దేశానికి మంచి గుర్తింపు వస్తుందన్నారు. భారతీయ అంతరిక్ష పరిశోధనలు ప్రపంచానికి తెలిసే విధంగా సాగుతున్నాయన్నారు.

# అక్రమ బాణాసంచా నిల్వపై దాడులు

## - భారీగా సీజ్ చేసిన పోలీసులు

**తిరుపతి,అక్టోబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** దీపావళిపండుగ సందర్భంగా తిరుపతినగరంలో అక్రమంగా పటాసులు, బాణాసంచా నిల్వచేసే ప్రాంతాలు ఎక్కువవుతున్నాయి. అక్రమ బాణాసంచా నిల్వవల్ల ప్రమాదాలు జరగవచ్చనే ముందు హెచ్చరికలతో పోలీసులకు సమాచారం అందింది. దీంతో నగరంలోని అలిపిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక కంటైనర్, రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక లారీలో అక్రమంగా భారీమొత్తంలో పటాసులు రవాణా చేస్తున్నట్లు పోలీసులు వాటిని సీజ్ చేశారు.

ఈ ప్రాంతాలపై పోలీసులు దాడులు చేసి భారీ మొత్తంలో వాహనాలతోబాటు బాణాసంచా స్వాధీనం చేసుకున్నారు. కాగా అక్రమరవాణాకు సంబంధించి బాధ్యులైన వ్యక్తులపై ఎక్స్‌ప్లోజివ్స్ చట్టం 1884 ఎక్స్‌ప్లోజివ్స్ రూల్స్ 2008 బిఎన్ఎస్ఎస్ ఇతర చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసినట్లు తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు.

# భక్తుల అభిప్రాయాలతోనే సంతృప్తిగా సౌకర్యాలు: టిటిడి

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం రోజుకు లక్షమందివరకు వస్తున్న భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పన వెనుక భక్తుల అభిప్రాయాలతోనే సాధ్యమవుతోందనేది టిటిడి అధికారుల మాట. ఇదే నిజంచేస్తూ ఇటీవల ముగిసిన తొమ్మిదిరోజుల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు విజయవంతం వెనుక భక్తులు ఇచ్చిన సూచనలతోనేనదే అధికారుల వాదన కూడా. ఇకపై రానున్న రోజుల్లోనూ లక్షమందికిపైగా భక్తులు వచ్చినా సాఫీగా, ప్రశాంతంగా సకల సౌకర్యాలు సంతృప్తికరంగా కల్పించడమే లక్ష్యంగా కార్యాచరణ అమలుచేసేలా చూస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో రోజువారీగా లక్షమందివరకు భక్తులు మాఢవీధుల్లో స్వామివారి వాహనసేవలు వీక్షించగా 70వేలమంది వరకు భక్తులు మూలవిరాట్టును దర్శించుకుని సంతృప్తి చెందడం టిటిడి పనితీరుకు నిదర్శనం. భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్న వేళ ,ఏరోజుకారోజు పరిస్థితులకు అనుగుణంగా తిరుమల తిరుపతిదేవస్థానం సామాన్యభక్తులకు శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతోబాటు వసతి కల్పనలో మరింత మెరుగైన మార్పులు తీసుకురావడానికి అభిప్రాయసేకరణ తీసుకుంటున్నారు. ఇందుకుసాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నారు. తిరుమలలో జరిగే పొరబాట్లు, తప్పులు,వసతి సౌకర్యం ఎలా ఉంది...స్వామివారి దర్శనం బాగా జరిగిందా అనే ప్రశ్నలతో భక్తులనుండి సమాధానాలు తీసుకుంటున్నారు. ఈ ఫీడ్‌బ్యాక్‌ను టిటిడి ఐటి విభాగానికి చేరవేస్తే ఏదేని తీవ్ర సమస్యలు ఉంటే అక్కడ నుండి టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్‌కు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణకు అందుతుంది. క్షేత్రస్థాయిలో ఇఒ,అదనపు ఇఒ చేపట్టాల్సిన మార్పులు, మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఇదీ దోహదపడుతుంది. ఎలాంటి ప్లానింగ్ లేకుండా నేరుగా తిరుమలకు వచ్చిన భక్తులు తొలుత వసతి కోసం, ఆ తరువాత స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో నిరీక్షించే సమయంలో ఎదురయ్యే సమస్యలపై సూచనలు, అభిప్రాయాలు వస్తున్నాయి. భక్తులు నిర్మోహమాటంగా తమ అభిప్రాయాలు వెల్లడిస్తున్నారు. ఐవిఆర్ఎస్, వాట్సాప్(9399399399), ఈ సర్వే ,శ్రీవారిసేవకులద్వారా అభిప్రాయ సేకరణ తీసుకోవడమేగాక 16అంశాలపై భక్తులు తమ అభిప్రాయాలు చెప్పడానికి వీలుగా క్యూఆర్ కోడ్ స్కానింగ్ యాప్‌ను అందుబాటులో ఉంది. ఈ కోడ్‌యాప్‌ను తిరుమలకొండపై ప్రధాన కూడళ్లలో, వసతికల్పన విచారణ కార్యాలయాల వద్ద ఏర్పాటుచేశారు. భక్తులు ఈ విధానంలో అభిప్రాయాలు, ఫిర్యాదులు,సలహాలు ఇస్తే టిటిడి ఉద్యోగులు, అధికారుల్లో బాధ్యతను పెంపొందించే విధంగా మారింది.రోజువారీగా 80వేలమంది వరకు యాత్రికులు శ్రీవారిని దర్శించుకుంటున్నారు.వారాంతం శని,ఆదివారాల్లో ఈ రద్దీ మరింతగా పెరిగి 1.20లక్షలమంది వరకు చేరుకుంటున్నారు. సాధారణరోజుల్లోకూడా తిరమలేశుని దర్శనానికి పదిగంటలు సమయం వేచివుండాల్సిన పరిస్థితి ఉంది.

# భక్తుల ఇబ్బందులపై రియల్ టైం ఫీడ్‌బ్యాక్

## - సిఎం సూచనలు, సమష్టి సహకారంతో బ్రహ్మోత్సవాలు విజయవంతం:టిటిడి ఇఒ సింఘాల్



**తిరుమల,అక్టోబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి ఇటీవల ముగిసిన సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలు, అధికారుల సమష్టి సహకారంతో విజయవంతంగా నిర్వహించగలిగామని టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రణాళికా బద్ధంగా ప్రతి ఒక్కరూ భగవంతునిసేవగా భావించి ప్రతి భక్తుడికి అన్నప్రసాదాలు, తా గ ం నీ ం , ఇ త ం ్రతా సేవలందించారన్నారు.రానున్న ఏడాది 2026 బ్రహ్మోత్సవాలకు సిసికెమెరాలను అనుసంధానం చేసి కమాండ్ కంట్రోల్ కేంద్రం, రియల్ టైం ఫీడ్‌బ్యాక్‌తీసుకుని భక్తుల ఇబ్బందులను అంచనావేసి, అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని ఇఒ తెలిపారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు విజయవంతం వెనుక ఉన్న సహకారం, కృషిపై పోలీస్, టిటిడి విజిలెన్స్, జిల్లా యంత్రాంగం, మీడియాప్రతినిధులతో కలసి తిరుపతి మహతి ఆడిటోరియంలో శుక్రవారం మధ్యాహ్నం సూచనలు,సలహాలతో బాటు సమీక్ష నిర్వహించారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,జెఈఒ వీరబ్రహ్మం, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా టిటిడి ఇఒ అనిల్‌కుమార్ మాట్లాడుతూ తిరుమలేశుని బ్రహ్మోత్సవాలు దిగ్విజయం అయిన నేపథ్యంలో అదే స్ఫూర్తితో తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి బ్రహ్మోత్సవాలను, వైకుంఠ ఏకాదశి, రథసప్తమి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. బ్రహ్మోత్సవాల్లో ఈ సారి ఎటుచూసినా సానుకూల వాతావరణం కనిపించిందని అన్నారు. టిటిడి కల్పించిన సౌకర్యాలపై భక్తులు, గ్యాలరీల్లోని,క్యూలైన్లలో భక్తులు వందశాతం సంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హమన్నారు. సిఎం చేసిన పలు సూచనలతో, జిల్లా యంత్రాంగం, టిటిడి వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు ,భక్తులు, మీడియా సమష్టిసహకారంతో విజయవంతం అయ్యాయన్నారు.



వార్త

ఏదైనా తీసుకోవడంలో గొప్ప ఏముంది, ఇవ్వడంలోనే గొప్పతనం అంతా ఉంది.

-బార్లెన్

# వీస్తున్న శాంతి పవనాలు !

ఏమయితేనేం గాజాలో శాంతికపోతాలు ఎగురనున్నాయి. ఎన్నో సంక్షుభిత సమయాలను ఎదుర్కొన్న గాజా ప్రజలకు ఊపిరిపీల్చుకునే సమయం చిక్కింది. గాజా,ఇజ్రాయెల్‌ల మధ్య సయోధ్య కోసం శ్వేతసౌధాధినేత డొనాల్డ్‌ట్రంప్ 20 సూత్రాల శాంతి ప్రణాళిక ప్రవచించారు. ట్రంప్ చెప్పారంటే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుఅయినా హమాస్ సంస్థ అయినా చెప్పినట్లు వినాల్సిందే. కాస్త అటూ ఇటూ నసుగుడు కార్యక్రమం ఉన్నా అదే ఫైనల్. అన్నీ అనుకున్నట్లు శాంతియుత మార్గంలో జరిగితే 'పాలస్తీనా' సమస్య ఓ కొలిక్కి వచ్చినట్లే. ఆ దేశాన్ని స్వతంత్ర దేశంగా గుర్తించే అవకాశం లేకపోలేదు. ఇక ఇక్కడ సమస్య అంతా ఏది ముందు ఏది తర్వాత అనే అంశాల చిక్కుముడి కూడా వీడాలి. ఒకవేళ తన మాట పెడచెవిన పెడితే హమాస్ ఇక నిద్రలేని రాత్రుళ్లు చూడాల్సిందే. 'నరకం' చూపిస్తామని ట్రంప్ ఏకపక్షంగానే హమాస్‌ను హెచ్చరించడంతో చివరాఖరి ప్రయత్నంలో హమాస్ దిగివచ్చింది. ట్రంప్ జోక్యం చేసుకున్న సమయంలోనూ ఆ తర్వాత గాజాపై ఇజ్రాయెల్ దుర్మార్గపు దాడులకు తెగపడింది. ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో 31 మంది పాలస్తీనియున్లు చనిపోయారు. నెటి జరిమ్ కారిడార్ వద్ద ఆహార పంపిణీ కేంద్రానికి చేరుకున్న 17 మందిపై ఇజ్రాయెల్ దాడులు చేసి చంపేసింది. గాజా విషయంలో ట్రంప్ ఒత్తిడి కారణంగానే హమాస్ లొంగినట్లయింది. ఈ అక్టోబరు 7నాటికి రెండేళ్లు నిండిన గాజా-ఇజ్రాయెల్ యుద్ధానికి ఎలాగైనా ముగింపు పలకాలన్న అంశం మంచిదే అయినా ట్రంప్ ప్రతిపాదనలు తొలుత పాలస్తీనా ప్రజల్లో అనుమానాలు రేకెత్తాయి. అది శాంతి ప్రణాళిక కాదు. కేవలం లొంగుబాటుకు ఎత్తుగడలేనని భావించారు. పాలస్తీనాకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించేందుకు నెతాన్యాహు ఏ పరిస్థితుల్లోనూ అంగీకరించరని వారి సంపూర్ణ విశ్వాసం. కాగా ఈ ప్రతిపాదనలను ఈజిప్ట్, జోర్డాన్, ఇండోనేషియా, పాకిస్థాన్, తుర్కియే, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, చైనా, రష్యా, భారత్‌తోపాటు యూరప్ దేశాలు కూడా సమర్థించాయి. హమాస్ అంతమే లక్ష్యంగా ఇజ్రాయెల్ చేస్తున్న దాడులు ఇకపై ఆపివేసేందుకు నెతాన్యాహు, సహకరిస్తారని స్పష్టంగా చెప్పడంతో హమాస్ తన వద్దనున్న బందీలందరినీ విడుదల చేసేందుకు ఒప్పుకుంది. గాజాలో అధికారాన్ని స్వతంత్ర పాలస్తీనా గ్రూపులకు అప్పగించే విషయంలో కూడా సానుకూలంగా స్పందించింది. కాగా హమాస్ ప్రకటనలో 'ఆయుధాల అప్పగింత' అంశం పేర్కొనలేదు. అలాగే గాజా నుంచి బలగాల ఉపసంహరణకు ఇజ్రాయెల్ కూడా అంగీకరించినట్లు లేదు. అంటే ఇన్నాళ్లూ ఉప్పునిప్పులా ఉన్న రెండు వర్గాల మధ్య ఇలాంటి అనుమానాలు తలెత్తకతప్పదు. కాల్పుల విరమణ, బందీల విడుదల ప్రధాన లక్ష్యంగా గాజా యుద్ధ పరిసమాప్తి కోసం హమాస్, ఇజ్రాయెల్ మధ్య చర్చలు జరిగాయి. ఒకపక్క ట్రంప్ శాంతి ప్రతిపాదనలు, ఉభయ పక్షాల మధ్యవర్తిత్వం వంటి ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలోనూ ఇజ్రాయెల్ గాజా మీద దాడులుఆపలేదు. ఈ సందర్భంగా ఈ వారంలో కనీసం 65మంది పాలస్తీనియన్లు హతమయ్యారు. వారి మృతికి నిరసనగా తుర్కియేలోని అంకారా, ఇస్తాంబుల్,నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డామ్‌లోనూ భారీస్థాయిలో ప్రదర్శనలు జరిగాయి. ఒకానొకప్పుడు గాజా సర్వనాశనానికి అమెరికాయే ఆయుధ సంపత్తినందించింది. ఇప్పుడదే సందర్భంలో శాంతి సందేశాలు శాంతిప్రణాళికలు రూపొందిస్తున్న ట్రంప్‌లో తానొక శాంతి పరిరక్షకుడన్న కీర్తి సాధించుకోవాలన్న తపన కనపడుతోంది. నిజానికి అమెరికా అండలేకుంటే 'గాజా'పై ఇజ్రాయెల్ తలపడేదే కాదు. కానీ ఇప్పుడు మరోలా అయితే అది సంధికోసమే కనుక స్వాగతించాల్సిందే. గాజా యుద్ధంలో ఇంతవరకు 67వేల మంది పాలస్తీనీయులు ఇజ్రాయెల్ యుద్ధకాంక్షకు బలైపోయారు. దాదాపు 1.70 లక్షల మంది క్షతగాత్రులుగా మిగిలారు. యుద్ధ విమానాల ధాటికి గాజాలో ఇళ్లు భవన నిర్మాణాలు దెబ్బతిన్నాయి. 20 లక్షల మంది నిర్వాసితులయ్యారు. గాజాలో ఆకలి దప్పులతో అలమటిస్తున్న బాధితులకు ఏ 'మాగ్నాకార్టా'లు గ్యారంటీలు ఇవ్వలేకపోయాయి. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే పశ్చిమాసియాలో కమ్ముకున్న యుద్ధమేఘాలు పటాపంచలౌతాయి. ఒకవేళ ఇప్పటికిప్పుడు పాలస్తీనాను ప్రత్యేక దేశంగా ప్రకటించినా దాని పునర్నిర్మాణానికి ఖర్చెంతో ఎవరూ లెక్క కట్టలేదు. ఇవన్నీ బేరీజు చేసుకునే కాబోలు ఒకరిపై ఒకరు ఆగ్రహావేశాలు వ్యక్తం చేసుకునే రెండు దేశాలు ఇప్పుడు శాంతి మంత్రం పఠిస్తున్నాయి. శాంతిఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈజిప్టులోని షార్మ్‌ఎల్. షేక్ బీచ్ రిసార్టులో ముఖాముఖీ చర్చలు ఫలప్రదమయ్యాయి. వీరిరువురూ ఒప్పందం సంతకాలైన విషయాన్ని ట్రంప్ తన సోషల్‌మీడియా 'ట్రూత్'లో వెల్లడించారు. దీర్ఘకాలిక శాంతి సాధించే క్రమంలో ఇది తొలి అడుగని ట్రంప్ అభివర్ణించారు. ఇజ్రాయెల్‌కిది దౌత్యపరమైన విజయమని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించారు. ఈ ఒప్పందంలో పాలుపంచుకున్న వారిని భారత ప్రధాని నరేంద్ర మోడీ అభినందించారు. తాను 'శాంతి' చేకూర్చిన ఎనిమిదో యుద్ధ విరమణ ఒప్పందమని ట్రంప్ స్పష్టం చేశారు. ఆయన దృష్టి మాత్రం నోబెల్ బహుమతి మీదనే ఉందనుటలో సందేహంలేదు. ఈసారి కాకుండా వచ్చే ఏడాదైనా వస్తుందన్న ఆశాభావంతో ఉన్నారు. పరస్పర బందీల విడుదల, గాజాకు మానవతా సాయం అందించే విషయంలో ఎలాంటి తకరారుకు ఆస్కారమివ్వకుండా సహకరించుకోగలిగితే ఆయా దేశాలు సుభిక్షంగా వర్ధిల్లుతాయి.

> ఇతరులు తినేందుకు బతుకుతారు, కానీ నేను బతికేందుకు మాత్రమే తింటాను.
>
> సోక్రటీస్



> ఇతరుల్ని కష్టపెడుతూ నువ్వు కష్టపడకపోవచ్చు. కానీ సంతోష పెట్టేటప్పుడు మాత్రం నువ్వు తప్పక సంతోషంగా ఉంటావు.
>
> సిసిరో



# విద్యాదీపాలను ఆర్పుతున్నదెవరు?

**ప్రధానంగా తలతాకట్టు పెట్టి,కడుపు కట్టుకొని, అప్పో సొప్పో చేసి లక్షలాదిరూపాయలు తల్లిదండ్రులు తమభవిష్యత్‌కోసం ఫీజుల రూపంలో చెల్లించడంతోపాటు వారు తీసుకుంటున్న శ్రద్ధాశక్తులు అన్నీ గమనిస్తూ వారు ఆశించిన మేరకు తాము చదవలేకపోవడం, చదివినా మనస్సు కెక్కకపోవడంతో మానసిక సంఘర్షణకు గురై అటు తల్లిదండ్రులకు తాము ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులను చెప్పి ఒప్పించలేక ఇటు బోధన చేసిన అధ్యాపకులతో మనసు విప్పి తమ బాధలను వివరించలేక ఒత్తిడిని తట్టుకోలేక తనువు చాలిస్తున్నారు. ఈ విషయం కొందరు అధ్యాపకులకు కొన్ని సందర్భాల్లో అర్థ మైనా యజమాన్యాల వ్యాపార కాంక్షకు వెరసి పెదవి విప్పలేకపోతున్నారు. ఇలా బట్టీపెట్టి ర్యాంకులు సంపాదించిన వారిలో కొందరికి ఐఐటి లాంటి సంస్థల్లో ప్రవేశం దొరికినా అక్కడ బోధనా పరిస్థితులు, విధానాలలో ఇమడలేకపోతున్నారు. ఈ చావులకు ఇలాంటి కారణాలు ఎన్నో ఉన్నాయి.**

దామెర్ల సాయిబాబ

మేధస్సును పంచేవారు మనిషి, మనస్సును పంచేవారు మహర్షి అన్నారు పెద్దలు. మన విద్యాలయాల్లో అంతోఇంతో మేధస్సును అందిస్తున్నారు. కానీ మనస్సును పంచేవారు కరవైపోతున్నారేమోననిపిస్తున్నది. అందుకే పరిస్థితులు వికటించి భావి భారత పౌరులుగా ఎదిగి ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థుల జీవితాల్లో అంధకారం అల్లుకొని అర్థాంతరంగా బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. విద్య ఒక వ్యాపారంగా రూపాంతరం చెందినప్పటి నుండి ఈ దురదృష్ట పరిస్థితులు దాపురిస్తున్నాయి. విద్యార్థి దశలోనే అర్థాంతరంగా తనువు చాలిస్తున్న భావిభారత పౌరులను చూసి భారతావని నివ్వెరపోతున్నది. తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చి కుటుంబంలో కాంతులు వెదజల్లే దీపాల్లాంటివారు, భవిష్యత్తులో దేశాభివృద్ధికి భాగస్వాములు కావాల్సిన దివ్వెలు అర్థాంతరంగా ఆకస్మికంగా ఆరిపోతున్నాయి. కని,పెంచిన వారి ఆశలను చిదిమేస్తూ కుటుంబాల్లో కోలుకోలేని విషాదాన్ని నింపుతూ కనుమరగవుతున్న ఈ విద్యాదీపాల వెనుక ఎన్నో కారణాలు పైకి కన్పిస్తున్నా విద్యావిధానం, ఒత్తిడిని తట్టుకోలేకపోవడమే ప్రధాన కారణమనేది కాదనలేని వాస్తవం. కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులు ఈ గర్భశోకాన్ని భరించలేక అనారోగ్యం పాలై తనువు చాలిస్తుంటే మరికొందరు బలవంతపు చావులకు కూడా వెనుకాడడం లేదు. ఇదంతా పాలకులకు తెలియందికాదు. ఈ చావులను ఆపేందుకు ప్రభుత్వాలు కూడా ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈ విషయంలో స్వయంగా స్పందించి ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో వివరిస్తూ 'ఎగ్జామ్స్ వారియర్స్' అనే పుస్తకాన్ని రాసారు. మార్కుల కన్నా తమకు సహజంగా ఉండే నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని విశ్లేషించారు. ఇలా ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా ఇవి యేడాదియేడాదికి పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. వ్యవసాయరంగంలో ఏర్పడిన సంక్షోభం కారణంగా జరుగుతున్న రైతులు, రైతు కూలీల బలవన్మరణాల కంటే ఈ భావిభారత పౌరుల మరణాలే అధికంగా ఉండడం అందరిని కలచివేస్తున్నది. తాజాగా జాతీయ నేర గణాంకాల విభాగం ఎన్‌సిఆర్‌బి విడుదల చేసిన లెక్కల ప్రకారమే దేశంలో 2023లో దేశవ్యాప్తంగా పదమూడువేల ఎనిమిదివందల తొంభైరెండు మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడగా ఇందులో బాలురు ఏడువేల మూడువందల ముప్పై మంది, బాలికలు ఆరువేల ఐదువందల యాభైతొమ్మిది, మరో ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఇది రైతులు, రైతుకూలీల ఆత్మహత్యల కంటే దాదాపు 29 శాతం అధికంగా ఉన్నట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. రైతుల ఆత్మహత్యలు పదిహేడు రాష్ట్రాల్లో, ఐదు కేంద్రపాలిత ప్రాంతాలకే పరిమితం కాగా, విద్యార్థుల మరణాలు దేశమంతా విస్తరించాయి. మరొకపక్క పాలకులు తీసుకుంటున్న చర్యల ఫలితంగా ఎంతో కొంతమేరకు రైతుల ఆత్మహత్యలు తగ్గుముఖం పడుతుంటే విద్యార్థుల ఆత్మహత్యలు మాత్రంగణనీయంగా పెరిగిపోతున్నాయి. 2017-2023 వరకు ఏడేళ్ల కాలంలో తొమ్మిదివేల తొమ్మిదివందల ఐదు నుంచి పదమూడువేల ఎనిమిది వందల తొంభైరెండుకు పెరిగింది. ఇలా యేడాది యేడాదికి పెరుగుతూనే ఉన్నాయి. ఇవి ప్రభుత్వ అధికార లెక్కలు మాత్రమే. ప్రభుత్వ దృష్టికి రాకుండా జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలు చాలా ఉన్నాయి. అవి వెలుగుచూడకపోవడానికి కారణాలెన్నో ఉన్నాయి. శిక్షణా సంస్థల కేంద్రంగా పేరుగాంచిన రాజస్థాన్‌లోని 'కోటా'లో యేటాదాదాపు రెండులక్షల మంది కిపైగా విద్యార్థులు చేరుతున్నారు. అక్కడ ప్రతి యేడాది పదుల సంఖ్యలో బలవన్మరణాలు జరుగుతున్నాయి. విద్యార్థులు భవనాలపై నుంచి దూకి ఆత్మహత్యలు చేసుకోకుండా భవనాల చుట్టూ ఇనుప వలలు కట్టడం, బందోబస్తు ఏర్పాటు చేయడం ఒకవేళ దూకినా కిందపడి దెబ్బలుతగలకుండా వలలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నారే తప్ప మూలాల్లోకి వెళ్లడం లేదు. ఈ యేడాది ఇప్పటికే అక్కడ ఇరవైమందికిపైగా ఆత్మహత్యలు చేసుకున్నట్లు అనధికార వార్తలు చెబుతున్నాయి. పోని పది, ఇంటర్ పరీక్షల్లో మంచి మార్కులతో పాసై ర్యాంకులు సంపాదించి ప్రతిష్టాకరమైన ఐఐటిలో సీటు వచ్చిందని ఆనందంగా చేరుతున్న విద్యార్థుల్లో కూడా కొందరు ఆ తర్వాత అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారు. దేశంలో 2018-23 వరకు ఐఐటిలోచదువుతున్న మెరికల్లాంటి ముప్పైమూడు మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఎందుకు జరుగుతున్నది? ఈ మారణహోమం ఆగదా? ఆపలేరా? అనే ప్రశ్నలకు జవాబు దొరకడం లేదు. విద్యావిధానంలో ఉన్న లోపాల వల్లనే జరుగుతున్నాయనేది కొందరు విద్యారంగ నిపుణల వాదన. ప్రాచీన భారత విద్యావిధానంలో కళలకు చక్కటి స్థానం ఉండేది. ఆచరణాత్మక పరీక్షా విధానాలు అలవంబించేవారు నలంద, తక్షశిల తదితర విశ్వవిద్యాలయాల్లో పరీక్షల్లో పాల్గొనేందుకు విదేశాలనుంచి కూడా విద్యార్థులు వచ్చేవారు. అప్పటి తరగతి గదుల్లో తక్కువగా బోధించేవారు. ప్రయోగాత్మక విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చేవారు. మారుతున్న కాల,మాన పరిస్థితులకు అనుగుణంగా తల్లిదండ్రుల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకొని అవసరమైన విద్యను అందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ప్రైవేట్ విద్యపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనికితోడు పిల్లల చదువులకై తల్లిదండ్రుల ఆరాటం, ఆసక్తి, ఆత్రుత అంతకంతకు పెరిగివారిని చదివించుకోవడం ఒక్కటే జీవిత లక్ష్యంగామారింది. అందుకోసం తల్లిదండ్రుల త్యాగాలు చూస్తుంటే విస్తుపోవాల్సి వస్తుంది. పిల్లల చదువుల కోసమే కడుపుచేతపట్టుకొని పుట్టి పెరిగిన ఊరును, ఇంటిని వదిలి పట్టణాలకు, నగరాలకు వలస వచ్చి చిన్న, చితక ఉపాధితో అర్థాకలితో జీవనం గడుపుతున్నారు. మధ్యతరగతి కుటుంబాల పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. కేవలం కార్పొరేట్ కాలేజీల్లో చదివితేనే తాము కోరుకున్న విద్యాలయాల్లో కావాల్సిన కోర్సుల్లో సీటు దొరుకుతుందన్న ప్రచారం పెరిగిపోయింది. మరొకపక్క ఇంజినీరింగ్,ఐఐటి, మెడిసిన్ వంటి ఉన్నత విద్యను అభ్యసిస్తేనే పిల్లలకు వెంటనే ఉద్యోగాలు దొరకడమో, లేకవిదేశాల్లో జీవనోపాధి లభించడమో చూస్తున్న తల్లిదండ్రులు తమ పిల్లలు కూడా అలాంటి సుస్థిరత సుఖాన్నిపొందాలనే ఆరాటంలో పడుతున్న వ్యయప్రయాసలు అన్నీఇన్నీ కావు. ఈ బలహీనతలను సొమ్ము చేసుకోవడానికి కొన్ని కాలేజీలు వ్యవహరిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తున్నది. ఇంటర్ విద్య ఐదులక్షల నుండి పదిహేను లక్షల వరకు కూడా చెల్లించేవారు ఉన్నారు. తమ కాలేజీల్లో చదివినవారికి ర్యాంకులు, సీట్లువస్తాయనే భ్రమలు కల్పిస్తున్నారు. తమ కాలేజీల్లో మొత్తం ఎంత మంది చదివితే ఎందరికి ఉన్నత ర్యాంకులు వస్తాయో చెప్పరు. మంచిర్యాంకులు వచ్చినవారి ఫొటోలు మాత్రమే ప్రకటిస్తారు. ఇకపిల్లలపైపడుతున్న ఒత్తిడి అంతాఇంతా కాదు. ఆటపాటలు లేవు. ఆటస్థలాలే కనుమరుగైపోయాయి. మరోధ్యాస, వ్యాపకానికి అవకాశంలేకుండా చదివే లక్ష్యంగా రాత్రింబవళ్లు వారిపై ఒత్తిడిపెంచి చదివిస్తున్నారు. ఆ మానసిక ఒత్తిడి తట్టుకోలేక అశాంతిని భరించలేక ఇటు తల్లిదండ్రులను ఒప్పించలేక చదువులు అర్థంకాక తమలో తాము నలిగినలిగి విపరీతమైన టెన్షన్‌కుగురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో తాము ఎందుకు ఆత్మహత్యలకు పాల్పడవలసి వచ్చిందో స్పష్టంగా లేఖలురాసి తనువులు చాలిస్తున్నారు. ప్రధానంగా తలతాకట్టు పెట్టి,కడుపు కట్టుకొని, అప్పోసొప్పో చేసి లక్షలాదిరూపాయలు తల్లిదండ్రులు తమభవిష్యత్‌కోసం ఫీజుల రూపంలో చెల్లించడంతోపాటు వారు తీసుకుంటున్న శ్రద్ధాశక్తులు అన్నీ గమనిస్తూ వారు ఆశించిన మేరకు తాము చదవలేకపోవడం, చదివినా మనస్సు కెక్కకపోవడంతో మానసిక సంఘర్షణకుగురై అటు తల్లిదండ్రులకు తాము ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులను చెప్పి ఒప్పించలేక ఇటు బోధన చేసిన అధ్యాపకులతో మనసు విప్పి తమ బాధలను వివరించలేక ఒత్తిడిని తట్టుకోలేక తనువు చాలిస్తున్నారు. ఈ విషయం కొందరు అధ్యాపకులకు కొన్ని సందర్భాల్లో అర్థమైనా యజమాన్యాల వ్యాపార కాంక్షకు వెరసి పెదవి విప్పలేకపోతున్నారు. ఇలా బట్టీపెట్టి ర్యాంకులు సంపాదించిన వారిలో కొందరికి ఐఐటి లాంటి సంస్థల్లో ప్రవేశం దొరికినా అక్కడ బోధనా పరిస్థితులు, విధానాలలో ఇమడలేకపోతున్నారు. ఈ చావులకు ఇలాంటి కారణాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికైనా పాలకులు ఆలోచించాలి. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఒత్తిడిలేని విద్యావిధాన రూపకల్పన దిశగా మేధావులు ఆలోచించాలి. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం చేసినా దేశాభివృద్ధికి భాగస్వాములు కావాల్సిన ఉజ్వల భవిష్యత్ ఉన్న యువతీయువకులను దేశం కోల్పోతుంది. ఏ కోణంలో చూసినా చదువుల పేరుతో లేత మనసులను బలిపీఠం ఎక్కించడం ఏమాత్రం సమంజసంకాదు. ●

ఒక్క మాట

# పోషకాహారాన్ని అందరికి అందివ్వాలి


వి. వరదరాజు

ఇండియా రోజుకు 58కోట్ల లీటర్ల పాలు ఉత్పత్తి చేస్తోంది. పాలఉత్పత్తిలో మొదటి స్థానం మనదే. ప్రజలందరికి పోషకాహార అవసరం తీర్చే స్థాయికి చేరాం. ఇదొక శుభ పరిణామం. ఉత్పత్తిలో ముందు వున్నాం. కానీ వినియోగ వ్యత్యాసాలు అపరిమితం.అందరికి, ముఖ్యంగా పోషకాహార లేమితో బాధపడుతున్న వారికి పాలు అందేలా పంపిణీపై ప్రభుత్వాలు దృష్టి సారిస్తే ఆరోగ్య భారతిగా అవతరిస్తుంది. ఆ కార్యాచరణ రూపొందించి, అమలు చేయాలి. పాలల్లో మాంసకృత్తులు, కాల్షియం,పిండి పదార్థాలు, విటమిన్ ఏ, బి12 వంటి పలు పోషకాలు వున్నాయి. అందుకే వీటిని సంపూర్ణ ఆహారం అన్నారు ఆరోగ్య నిపుణులు. ఇవి పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారిస్తాయి. ముఖ్యంగా ఐదేళ్లలోపు పిల్లల్లో పెరుగుదల మందగింపు, వయసుకు తగ్గ పొడవు బరువు పెరగకపోవడం వంటి పోషకాహార లోపాలు పాలు సరిచేయగలవని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ప్రపంచ సగటు పాల ఉత్పత్తి 322 గ్రాములుంటే, దేశంలో వాటి సగటు లభ్యత 459 గ్రాములుగా వుంది. సగటు పాల లభ్యత కంటే మూడు, నాలుగు రేట్లు అధికంగా ధనికులు వాడుతున్నారని జాతీయ శాంపిల్ సర్వే లెక్కించింది. పేదల వినియోగం కూడా పెరిగింది. కానీ పేదల్లో అత్యంత బీదలైన 30 శాతం మంది జాతీయ పాల ఉత్పత్తిలో కేవలం18శాతం మాత్రమే వాడుతున్నారని గృహ వినియోగ సర్వే పేర్కొన్నది. సర్వే ఇంటి వాడకం గూర్చి మాత్రమే తెలియజేస్తుంది. వ్యాపార వినియోగం లెక్కింపు కూడా అవసరం. హోటళ్లు, బేకరీలు,మిఠాయి దుకాణాలు, భారీఆహార పరిశ్రమలు పాలతో అనేక తినే, త్రాగే పదార్థాలు తయారు చేస్తున్నాయి. అమ్మకం చేస్తున్నాయి. వీటి వినియోగంలో కూడా పట్టణ ప్రజలే ముందుండడం సహజమే కదా! ప్రాంతానికి ప్రాంతానికి పాల వాడకంలో అంతరాలు వున్నాయి. కొన్ని సామాజిక వర్గాల వినియోగం చాలా తక్కువగావుంది. గ్రామీణ పట్టణాల మధ్య కూడా వినియోగ తేడాలున్నాయి. పల్లెల్లో పాల ఉత్పత్తి ఎక్కువ వున్నా, అక్కడి వినియోగం తక్కువ. సగటు వినియోగం గమనిస్తే పట్టణ వాసులు గ్రామీణుల కంటే 30 శాతం ఎక్కువగా తీసుకొంటున్నారు. ఒక్కో ప్రాంతానికి ఒక్కో రకమైన ఆహారపు అలవాట్లు ఉంటాయి. పాల వినియోగ గృహ సర్వే ఈ విషయం రూఢికవించింది. పోషకాహార లోప నివారణకు జాతీయ పోషకాహార సంస్థ సూచనను గమనంలోకి తీసుకోవాలి. పెద్దగా కష్టం చేయని వ్యక్తికి రోజుకు పావు లీటర్ పాలు సిఫారసు చేసింది. ఈ సిఫారసు ప్రకారం ప్రతి కుటుంబం పాలు వినియోగించాలంటే 70శాతం కుటుంబాలు పాలకోసం వారి ఆదాయంలో 10నుండి 30 శాతం వరకు ఖర్చు చేయాల్సి ఉంటుందని అంచనా. పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు, రోగులకు, ముసలివారికి పాలు చాలా అవసరం. పాలరేటు, లభ్యతలు, సరఫరా లేమిలు, అవగాహనా లోపాల వలన అవసరమైన వారికి అందకుండాపోతున్నాయి. అందరికి అందేలా పంపిణీ విధానం రూపొందించాలి. ప్రధానమంత్రి పోషణ కార్యక్ర మాన్ని బలోపేతం చేయాలి. గుజరాత్, హర్యానా, కర్ణాటక, తెలంగాణలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పాలపొడి పిల్లలకు అందిస్తున్నాయి. ఇది ఒక కుటుంబ పోషకాహార అవసరానికి చాలవు. ఒక కుటుంబానికి ఇచ్చే పాలపొడిని ప్రభుత్వం పెంచి ఇవ్వాలి. చత్తీస్‌ఘడ్ వంటి రాష్ట్రాలు ఆర్థికవనరులు లేక కుటుంబం పోషకాహార పంపిణీని నిలిపివేసాయి. ఈ కార్యక్రమం కోసం ఫండ్స్ కేటాయిస్తే మంచి ఫలితాలొస్తాయి. ప్రభుత్వాలు ఆర్థిక వనరుల సమీక రణకోసం ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలి. దేశంలో వందలాది కో ఆపరేటివ్ పాలసం ఘాలు పనిచేస్తున్నాయి. ఆయాప్రాంత లబ్ధిదారులకు కూపన్లు లేదా మంత్లీ కార్డులు అందించి నేరుగా కోపరేటివ్ సంఘాలకు పంపిణీ అప్పగించినా పంపిణీ ఖర్చులు తగ్గుతాయి. ఆ కోఆపరేటివ్స్ ఆదాయం కూడా పెరుగుతుంది. ●

# నోబెల్ గ్రహీతలు.. శారీరక 'శాంతి' పరిరక్షకులు

డి జె మోహన రావు

ఫిజియాలజీ లేదా మెడిసిన్‌లో నోబెల్ బహుమతి అందుకున్న మేరీ ఇ. బ్రంకోవ్, ఫ్రెడ్ రామ్‌స్‌డెల్, షిమోన్ సకాగుచిలు చేసిన పరిశోధన, మన రోగనిరోధక వ్యవస్థ పనితీరు గురించి ప్రాథమిక ఆలోచననే మార్చివేసింది. వారి ఆవిష్కరణ నియంత్రణ వ్యవస్థ (టిరెగ్స్) మన శరీరంలో ఎంత ముఖ్యమో నిరూపించింది. టిరెగ్స్ అంటే రెగ్యులేటరీ టి కణాలు. వీటిని మన శరీరంలోని ప్రత్యేకమైన 'భద్రతా సిబ్బంది'గా లేదా 'శాంతి పరిరక్షకులు'గా పోల్చవచ్చు. మన రోగనిరోధక వ్యవస్థలో ఉన్న ఇతర టి కణాలు అంటే శత్రువులను చంపేవి పొరపాటున మన శరీర భాగాలనే స్నేహితులను శత్రువులుగా గుర్తించి దాడి చేయకుండా, ఈ టిరెగ్స్ కణాలు 'బ్రేకులు' వేసి వాటిని అదుపు చేస్తాయి. ఇది నిష్క్రియమైన రక్షణ నుండి చురుకైన నియంత్రణకు మారిన గొప్పమార్పు. ఈ ఆవిష్కరణలు మానవాళికి ప్రధానంగా రెండు రంగాలలో అపారమైన ప్రయోజనాన్ని అందిస్తుంది. మొదటగా ఆటో ఇమ్యూన్ వ్యాధులకు శాశ్వత ఉపశమనం కలిగించబోతుంది. ఈరకమైన వ్యాధులు అనేవి రోగనిరోధక వ్యవస్థ నియంత్రణ కోల్పోయి, తమ శరీర భాగాలపైనే దాడి చేయడం వల్ల వచ్చే తీవ్రమైన సమస్యలు. వీటిలో రుమటాయిడ్‌ఆర్థరైటిస్, టైప్ 1 డయాబెటిస్, లూపస్ వంటి వ్యాధులు కోట్లాది మంది ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి. బహుమతి పొందిన వారిలో ఒకరైన సకాగుచి 1995లో టిరెగ్స్‌న్ని కనుగొని అవి చురుకుగా ఈ స్వీయదాడిని అణచివేస్తాయని నిరూపించారు. ఆ తర్వాత బ్రంకోవ్, రామ్‌స్‌డెల్ శాస్త్రవేత్తలు ఎఫ్ఓఎక్స్‌పి3 అనే ఒకే ఒక్క జన్యువు ఈ టిరెగ్స్ తయారీని, వాటి శక్తిని నియంత్రించే ముఖ్యమైన 'మాస్టర్ స్విచ్' అని గుర్తించారు. ఈ స్విచ్‌లో లోపంవస్తేనే ఐపిఈఎక్స్ వంటి ప్రాణాంతక ఆటో ఇమ్యూన్ రుగ్మతలు వస్తాయని స్పష్టం చేశారు. ఈ జ్ఞానాన్ని ఉపయోగించి, శాస్త్రవేత్తలు ఇప్పుడు టిరెగ్ కణ చికిత్స అంటే టిరెగ్ సెల్ థెరపీ అనే సరికొత్త చికిత్సా విధానాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఈ చికిత్సలో రోగి నుంచి టిరెగ్స్‌న్ని తీసుకొని ప్రయోగశాలలో వాటి సంఖ్యను పెంచి తిరిగి రోగికి ఎక్కిస్తారు. ఇది రోగనిరోధక సమతుల్యతను పునరుద్ధరించి ఆటో ఇమ్యూన్ వ్యాధులను తగ్గించడానికి, అలాగే అవయవ మార్పిడి తర్వాత శరీరం కొత్త అవయవాన్ని తిరస్కరించకుండా అడ్డుకోవడానికి చాలా సహాయపడుతుంది. ఇక రెండో ప్రయోజనానికి వస్తే క్యాన్సర్ పోరాటంలో 'టిరెగ్స్' పాత్ర అపారం.



మేరీ ఇ. బ్రంకోవ్ | ఫ్రెడ్ రామ్‌స్‌డెల్ | షిమోన్ సకాగుచిలు

క్యాన్సర్ కణితి రక్షణ వ్యూహంలో విప్లవాత్మకమైన మార్పును ఈ ఆవిష్కరణ ఉపయోగబడుతుంది. సాధారణంగా మన రోగనిరోధక వ్యవస్థలో ఉండే ఇతర టి కణాలు దేహ సైనికులుగా క్యాన్సర్ కణాలను ప్రమాదకరమైన శత్రువులుగా గుర్తించి, వాటిని చంపడానికి ప్రయత్నిస్తాయి. కానీ, ఈ పోరాటంలో రెగ్యులేటరీ టి కణాలు జోక్యం చేసుకొని క్యాన్సర్‌కు అనుకూలంగా పనిచేస్తాయి. క్యాన్సర్ కణం చాలా తెలివైంది. ఇది తన చుట్టూ ఒక ప్రత్యేక వాతావరణాన్ని అంటే మైక్రో ఎన్విరాన్‌మెంటును సృష్టిస్తుంది. ఈ వాతావరణంలో అది టిరెగ్స్‌న్ని పెద్ద సంఖ్యలో ఆకర్షిస్తుంది. ఈ టిరెగ్స్ కణితి ప్రాంతంలోకి రాగానే అవి చురుకుగా ఉంటూ, మిగతా సైనికులాంటి యాంటీట్యూమర్ టి కణాలుకు 'బ్రేకులు' వేస్తాయి. దీనివల్ల క్యాన్సర్ కణాలను చంపడానికి ప్రయత్నిస్తున్న శక్తివంతమైన కణాలు బలహీనపడతాయి లేదా వాటి పనిని పూర్తిగా ఆపేస్తాయి. టిరెగ్స్ కొన్ని రకాల రసాయనాలను విడుదల చేస్తాయి. ఇవి రోగనిరోధక వ్యవస్థలోని కణాలకు 'దాడి ఆపండి,ఇక్కడ అంతా శాంతంగా ఉంది' అనే సంకేతాన్ని అందిస్తాయి. దీనిద్వారా క్యాన్సర్ కణాల చుట్టూ ఒక బలమైన రక్షణ వలయం లేదా నియంత్రణ వలయం ఏర్పడుతుంది. ఫలితంగా రోగనిరోధక వ్యవస్థ క్యాన్సర్ కణాలను శత్రువులుగా గుర్తించదు. ఒకవేళ గుర్తించినా దాడి చేయలేదు. అప్పుడు క్యాన్సర్ కణాలు సులభంగా ఎదుగుతాయి. దీనినే ఇమ్యూన్ ఎవేషన్ అంటే రోగనిరోధక శక్తి నుండి తప్పించుకోవడం అంటారు. ప్రస్తుతం క్యాన్సర్ చికిత్సలో ఇమ్యునోథెరపీ అంటే రోగనిరోధక శక్తిని పెంచి క్యాన్సర్‌ను చంపే చికిత్సలు చాలా శక్తివంతమైనవిగా పరిగణించబడుతున్నాయి. కానీ, ఈ టిరెగ్స్ వాటి ప్రభావానికి అడ్డుగా నిలుస్తున్నాయి. చెక్‌పాయింట్ ఇన్హిబిటర్లు వంటి చికిత్సలు, క్యాన్సర్‌పై దాడి చేయకుండా టి కణాలను అడ్డుకునే 'లాక్‌లను' తెరుస్తాయి. కానీ,కణితి ప్రాంతంలో టిరెగ్స్ ఎక్కువగా ఉంటే, అవి ఎన్ని లాక్‌లు తెరిచినాసరే, చురుకుగా ఉంటూ రోగనిరోధక శక్తిని అణచివేస్తాయి. కార్‌టి లాంటి కణచికిత్సలలో కూడా బయట నుంచి ఎక్కించిన శక్తివంతమైన టికణాలు లోపలికి వెళ్లిన తర్వాత అక్కడి టిరెగ్స్ ప్రభావంవల్ల బలహీనపడతాయి,లేదా వాటిశక్తిని కోల్పోతాయి. ఈ అడ్డంకిని అధిగమించడం ఇప్పుడు క్యాన్సర్ పరిశోధనలో అతిపెద్ద లక్ష్యం. శాస్త్రవేత్తలు రెండు ప్రధాన వ్యూహాలను అనుసరిస్తున్నారు. ఈ పరిశోధన విజయవంతమైనప్పటికీ ఈ చికిత్సలు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి రావాలంటే కొన్ని పెద్దసవాళ్లను అధిగమించాలి. ఇప్పుడు వాడుతున్న టిరెగ్స్ చికిత్స కంటే, మరింత మెరుగైన కార్-ట్రెగ్స్‌ను తయారు చేయాలి. ఇవి కేవలం దెబ్బతిన్న శరీర ప్రాంతంలో మాత్రమే పనిచేస్తాయి. తద్వారా ఇతర చోట్ల రోగనిరోధక శక్తి అణచివేసే ప్రమాదం తగ్గుతుంది. ఒక రోగి రక్తకణాల నుండి ఈ టిరెగ్స్‌న్ని వేరుచేసి, అభివృద్ధి చేయడం చాలా సంక్లిష్టమైన ఖరీదైన ప్రక్రియ. ఈ ప్రక్రియవేగంగా తక్కువ ఖర్చుతో జరగాలంటే, ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలి జెన్స్ సాంకేతికతలను పారిశ్రామికంగా మందుల తయారీలో ఉపయోగించడం అత్యవసరం. ●

# ప్రజావాక్కు



### స్కూల్ యాజమాన్యాల బకాయిల భారం

రాష్ట్రంలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకంలో ప్రభుత్వం పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు స్కూల్ యాజమాన్యాలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. అయితే, గత కొన్ని సంవత్సరాలుగా ఈ పథకంలో ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోవడంతో అనేక స్కూళ్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. యాజమాన్యాలు విద్యార్థుల ఫీజులు, పాఠ్యపుస్తకాలు, సిబ్బంది వేతనాలు వంటి ఖర్చులను ముందుగానే భరించగా, ప్రభుత్వం నుండి వచ్చే చెల్లింపులు ఆలస్యమవడం వల్ల నిర్వహణ కష్టతరం అయింది. కొన్ని స్కూళ్లు రుణాలు తీసుకుని వ్యవహరిస్తుండగా, మరికొన్ని పాఠశాలలు పథకం కింద కొత్త అడ్మిషన్లు తగ్గిస్తున్నాయి. ప్రభుత్వం త్వరగా బకాయిలను చెల్లించి, పథకాన్ని సజావుగా కొనసాగించాల్సిన అవసరం ఉంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### శిథిలావస్థలో విద్యా వనరుల కేంద్రాలు

రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాలోని మండలాలలో మండల విద్యా వనరుల కేంద్రాలు శిథిలావస్థకు చేరువలో ఉన్నాయి. నిత్యం మండల విద్యావనముల కేంద్రానికి వచ్చే ఉపాధ్యాయులు భయభ్రాంతులకు గురవుతున్నారు. విద్యా వనరుల కేంద్రాలు ఎప్పుడుకూలిపోతుందో అనేటువంటి ఆందోళనలమధ్యమండల విద్యావనరుల కేంద్రం సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పని చేస్తున్నారు. ప్రతి సంవత్సరం వివిధ పాఠశాలలకు సరఫరాఅయ్యే ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత దుస్తులు ఇతర సామాగ్రి ఈ మండల విద్యా వనరుల కేంద్రంలోనే నిలువ చేస్తారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలి.

- కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా

### ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రపంచంలో ఊబకాయంతో బాధపడుతున్న వాళ్లు కోకొల్లలు. మనదేశంలో కూడా తక్కువేమీకాదు. ఈ ఒబెసిటికి ప్రధాన కారణం వ్యాయామలేమి. జంక్‌ఫుడ్ ఎక్కువ తీసుకోవడం అని నిపుణులు చెబుతుంటారు. మంచి ఆరోగ్యం పొందాలంటే చిరుతిళ్లు నిద్ర ముఖ్యంగా మానసిక ప్రశాంతత ఎంతో అవసరం. రోజుకు కనీసం పది నిమిషాలపాటు ధ్యానం చేయాలి.

- ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### బదిలీ ఉపాధ్యాయులందరిని రిలీవ్ చేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2025 జూన్ నెలలో జరిగిన ఉపాధ్యాయ బదిలీలలో బదిలీ పొంది రిలీవర్ లేక రిలీవ్ కాని ఉపాధ్యాయులు వేలాదిమంది ఉన్నారు. డిఎస్సీ నియామకాలు చేసేటపుడు డిఎస్సీ టీచర్లు మరియు ప్రత్యామ్నాయంగా అకడమిక్ ఇన్స్ట్రక్టర్ల నియామకం ద్వారా ఖాళీలను భర్తీ చేసి బదిలీ పొందిన వారందరిని రిలీవ్ చేస్తామని ప్రభుత్వం తెలియజేసింది. ప్రస్తుతం డిఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసి అక్టోబర్ 13 నుంచి విధుల్లో చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకొంటోంది. డీఎస్సీ 2025 నియామకాలు పూర్తి కావస్తోంది. అంతర్ జిల్లా బదిలీలు పూర్తయ్యాయి, వారు కూడా కొత్త స్థానాల్లో చేరారు. కానీ 2025 ఉపాధ్యాయ ఉపాధ్యాయులు రిలీవర్ లేక పాత స్థానాల్లోనే పనిచేస్తున్నారు. ఇది అన్యాయం. కాబట్టి ప్రభుత్వం తగు ప్రత్యామ్నాయ మార్గాలు చర్యలు తీసుకొని ఉపాధ్యాయులందరిని రిలీవ్ చేయాలి.

-వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### పౌరసత్వం ముఖ్యం

బీహార్ వలసలు ఆ రాష్ట్ర పౌరులను దేశ పౌరులుగా నిరూపించుకోవలసిన స్థితికినెట్టివేశాయి. ఇది చాలాబాధాకరం. అస్సాంలో కూడా ఇదే రకమైన స్థితిని కలుగజేశారు. అయితే వేరే మతాల వారిని ఏరివేయలి అన్న వారి కాంక్షలేమి తీరలేదు. చాలా మంది హిందువులు అస్సాం లెక్కల ప్రకారం ఈ దేశ పౌరులుగాకాకుండాపోతున్నారు. అంటే ఎన్సీసీర్ పద్ధతి విఫలం అయినట్టే ఉంది. కాదు కాదు తోస్తున్నది. ఒక పౌరుడుకి తాను నివసించిన రాష్ట్రంతో కొన్ని జ్ఞాపకాలు కలిగి ఉంటాడు. కాబట్టి పౌరసత్వం ఓటు హక్కు కోల్పోవడానికి ఇష్టపడరు.

-భారత అవినాష్, జనగామ

### వృక్షో రక్షతి రక్షితః

శబ్ద,వాయుకాలుష్యంతో మానవుడుకకావికలం అవుతున్నాడు. ఇక పశుపక్ష్యాదుల సంగతిసరేసరి. ప్రకృతి అసమతుల్యత వైపు పయనిస్తూ ఆపదలతో విలయతాండవం చేస్తున్నా నరుడు మేలుకోలేదన్నవిషయంఆందోళనకరం. ఇదిముమ్మాటికి మానవ తప్పిదం. మనం ఎంతభయంకర వాతావరణంలో ఉన్నామనేది ఏదో ఒకచోట పుడమితల్లి కన్నెర్ర కారణంగా తుఫాన్, సునామి రక్కసి విరుచుకుపడడమే ఇందుకు నిదర్శనం. అభివృద్ధి నెపంతో ఇష్టానుసారంగా పరిసరాలకు హాని తలపెట్టే పనులు ఇక నుంచి అయినా మానుకోవాలి.

-ఎం. రాజేష్ నల్గొండ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విజయవాడ వార్త



# బీసీ హాస్టల్‌లో కలుషిత నీరు తాగి ఆసుపత్రి పాలైన విద్యార్థులు

పెదనందిపాడు అక్టోబర్ 10, ప్రభాతవార్త: గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం అన్నపర్రు లోని బీసీ బాలుర హాస్టల్ లో కలుషిత ఆహారం నీరు త్రాగిన 54 మంది విద్యార్థు లు వాంతులు విరోచనాలు జ్వరం తదితరు కారణాలతో శుక్రవారం ఉదయం పెదనందిపాడు మండల ఆరోగ్య కేంద్రం కు ఆటోలలో చేరుకున్నారు .బాధితులకు మండల ప్రాథమిక కేంద్రంలోనూ. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపం లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలోను. వైద్య బృందం చికిత్సలు నిర్వహిస్తున్నారు. కలుషిత నీరు ఆహారం తీసుకోవడం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల విషయం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె విజయలక్ష్మి వెంటనే పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకొని బాధిత విద్యార్థులకు దగ్గరుండి వైద్య చికిత్సలు చేయించారు. జిల్లా కలెక్టర్ తమీ మ్ అన్సారియా తోపాటు అధికార యంత్రాంగం మొత్తం పెదనందిపాడు చేరుకున్నారు. మండల ప్రాథమిక కేంద్రంలోనూ. కళ్యాణ మండపంలోనూ ఏర్పాటు చేసిన శిబిరంలో చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థులను కలెక్టర్ వివరాలుఅడిగి తెలుసుకున్నారు. చికిత్స శిబిరాలను పత్తిపాడు శాసనసభ్యులు రామాంజనేయులు సందర్శించి బాధితులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జరిగిన సంఘటన దురదృష్టకరమైనప్పటికీ విద్యార్థులందరూ క్షేమంగా ఉన్నారని. బాధిత విద్యార్థుల 54 మందిలో 16 మంది విద్యార్థులకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా వైద్యశాలకు తరలించామన్నారు. 21 మంది విద్యార్థులను వైద్యులు చికిత్సతో కో లుకున్న వెంటనే అన్నపర్రు హాస్టల్ కు తరలించామన్నారు. మరో 17 మంది విద్యార్థులను శిబిరంలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్సలు అందజేస్తున్నామన్నారు. విద్యార్థులు ఆసుపత్రి పాలవటానికి కారణాలను విలేకరులు అడిగినప్పుడు. వారు తీసుకున్న ఆహారాన్ని పరీక్షల నిమిత్తం ల్యాబ్ లకు పంపించామని అక్కడ నుండి వచ్చిన రిపోర్టు అనంతరం సంబంధించిన వారిపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. శాసనసభ్యులు రామాంజనేయులు మాట్లాడుతూ బాధిత విద్యార్థులందరికీ వైద్య చికిత్సలు జరుగుతున్నాయని జిల్లావ్యాప్తంగా హాస్టల్లోని సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వ పరంగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పెదనందిపాడు లోని 24 గంటల ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్ పోస్టులు భర్తీ చేస్తామని నూతన భవనం నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి తో పాటు జిల్లా వ్యాధి నిరోధక టీకాలాధికారి ఏ శ్రావణ బాబు. బీసీ సంక్షేమ శాఖ అధికారి కే మయూరి. ఆర్డీవో శ్రీనివాసరావు. తహసిల్దార్ హేనా ప్రియ. డిప్యూటీ తహసిల్దార్ షేక్ కరీముల్లా. మండల రెవెన్యూ సిబ్బంది. ఇన్చార్జి ఎంపీడీవో స్వామి రెడ్డి. ఇన్చార్జి డిప్యూటీ ఎంపీడీవో నాగయ్య. ఈవో శ్వేత. మండల ఆరోగ్య కేంద్రం డాక్టర్ నందకుమార్. డాక్టర్ ప్రియంవధ. ప్రసాద్ స్వామి. చెన్నయ్య. కాకుమాను. పాండ్రపాడు ఆరోగ్య కేంద్రాల డాక్టర్స్. ఎం ఎల్ హెచ్ ఎం పి లు. ఏ ఎన్ ఎం లు పాల్గొని బాధితులకు చికిత్సలు అందజేస్తున్నారు. అశోక పాఠశాల సెక్రెటరీ రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ పోపూరి లక్ష్మీ నారాయణ తమ పాఠశాల బస్సుల ద్వారా బాధితవిద్యార్థులను వైద్య శిబిరాలకు తరలిస్తూ సేవలందించి పలువురు మన్ననలు పొందారు. వైద్య శిబిరాలను కూటమి నాయకులు నర్రా బాలకృష్ణ .టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కే రాంబాబు. ఆర్ శివరామకృష్ణయ్య. డి నాగరాజు. హరి ప్రసాద్ తదితరు పాల్గొని విద్యార్థులకు జరుగుతున్న వైద్య సేవలను పరిశీలించారు.





## డీఎస్సీ 1998 ఉపాధ్యాయులను రెగ్యులైజేషన్ చేయాలి: బైరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



అమరావతి అక్టోబర్ 10 ప్రభాతవార్త: డీఎస్సీ 1998 ఉపాధ్యాయులు రెగ్యులైజేషన్ చేయాలని అసోసియేషన్ అధ్యక్షులు బైరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కోరారు . శుక్రవారం విజయవాడ ప్రెస్ క్లబ్లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రెగ్యులర్ ఉపాధ్యాయులు మాదిరిగా మాకు ప్రయోజనాలు కల్పించి హెల్త్ కార్డులు మంజూరు చేయాలని. 25 సం" నుండి నష్టపోయిన మాకు ప్రభుత్వ సర్వీసును క్రమబద్ధీకరణ చేసి 62 సం" లకు సర్వీస్ ని పొడిగించాలని కోరుతున్నామన్నారు. పదవి విరమణ పొందిన ఉద్యోగస్తులకు 20,000 పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. శనివారం ధర్నాచౌక్ లో జరిగే డీఎస్సీ 1998 ఉపాధ్యాయుల నిరసన కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బి.కామేష్, అప్పలనాయుడు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## కోమాకి ఎలక్ట్రిక్ వాహనాలు పరిచయం

విజయవాడ అక్టోబర్ 10 ప్రభాతవార్త: ప్రముఖ విద్యుత్ వాహన బ్రాండ్ అయిన కోమాకి ఎలక్ట్రిక్ ఇటీవల ఎఫ్ఏఎమ్1.0 మరియు ఎఫ్ఏఎమ్ 2.0 లను వరుసగా రూ.99,999/ మరియు రూ. 1,26,999/ ఎక్స్‌షోరూమ్ ధరలతో విడుదల చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.


## 'కాలిఫోర్నియా బాదంతో దీపాల పండుగ'

విజయవాడ అక్టోబర్ 10 ప్రభాతవార్త: దేశవ్యాప్తంగా దీపావళి ఇళ్లను వెలిగిస్తున్నవేళ, ఈ దీపావళికి, పండుగను కాలిఫోర్నియా బాదంతో జరుపుకోవాలని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. సహజ ప్రోటీన్, ఫైబర్, గుండెకు ఆరోగ్యకరమైన కొవ్వులతో సమృద్ధిగా ఉండే బాదంను తీపి వంటకాలపై చల్లుకోవచ్చు. రుచి, ఆరోగ్యం రెండింటినీ బహుమతిగా సమర్పించవచ్చు. నట్స్ రాజు బాదంలో ప్రోటీన్, కాల్షియం, జింక్, డైటరీఫైబర్, మెగ్నీషియం, విటమిన్ ఇ వంటి 15 అవసరమైన పోషకాలు ఉన్నాయి. రక్తంలో చక్కెర నియంత్రణ, కండరాల పునరుద్ధరణ, గుండె ఆరోగ్యం, బరువు నిర్వహణ జరుగుతుందన్నారు.

## వృద్ధుల కోసం ఎల్వీపీఈఐ లో ప్రత్యేక నేత్ర సంరక్షణ కార్యక్రమాలు

విజయవాడ అక్టోబర్ 10 ప్రభాతవార్త: ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో వయో వృద్ధుల నేత్ర సంరక్షణలో భాగంగా అత్యాధునిక నేత్ర వైద్య సేవలు అందిస్తున్నట్టు డాక్టర్ అవినాష్ పతేంగే తెలిపారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సం పురస్కరించుకుని ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల కోడె వెంకటాద్రి చౌదరి క్యాంపస్ తో పాటు తమ ఎల్వీపీఈఐ ఇతర క్యాంపస్లలో కూడా ఎల్డర్లీ ఐ కేర్ సెంటర్స్ ( ప్రత్యేక వృద్ధుల నేత్ర సంరక్షా కేంద్రాలు) అందుబాటులో ఉన్నాయన్నారు. క్రమం తప్పకుండా పరీక్షలు, ఫిజియోథెరపీ, నేత్ర వ్యాధుల పైన అవగాహన కలిగించే సదస్సులు నిర్వహించమని అన్నారు. ఎల్వీపీఈఐ యట్ ది హోమ్ సేవలను కూడ కదలలేని రోగులకు అందిస్తున్నట్టు తెలిపారు.


## విజయవాడలో అడ్వాన్స్‌డ్ రెటినా సర్జికల్ సర్వీసెస్




అమరావతి అక్టోబర్ 10 ప్రభాతవార్త: భారతదేశంలోని సూపర్‌స్పెషాలిటీ కంటి ఆసుపత్రుల ప్రముఖ నెట్‌వర్క్ అయిన సెంటర్ ఫర్ సైట్, మొగల్రాజపురంలో కేంద్రంగా ఉన్న విజయవాడ కేంద్రంలో తన అడ్వాన్స్‌డ్ రెటినా సర్జికల్ సర్వీసెస్‌ను ప్రారంభించారు. ఈ అభివృద్ధి ప్రపంచవ్యాప్తంగా బెంచ్‌మార్క్ చేయబడిన రెటీనా సంరక్షణను ఆంధ్రప్రదేశ్ ప్రజలకు దగ్గర చేస్తుంది, 1996లో పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ డాక్టర్ మహిపాల్ ఎస్. సచ్‌దేవ్ స్థాపించిన ఈ సంస్థ 30+ నగరాల్లో 85 కి పైగా ఆసుపత్రులు, 350+ నిపుణులైన వైద్యుల బృందం మరియు దాదాపు మూడు దశాబ్దాల నైపుణ్యంతో, సెంటర్ ఫర్ సైట్ భారతదేశంలో దృష్టి సంరక్షణలో ముందంజలో ఉంది.

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ఉద్యమ పోస్టర్ ఆవిష్కరణ

తిరువూరు, అక్టోబర్ 10, ప్రభాతవార్త :తిరువూరు నియోజకవర్గ వైఎస్ఆర్ పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమ పోస్టర్‌ను రాష్ట్ర వైసిపి



కార్యదర్శి తిరువూరు నియోజకవర్గ పరిశీలకులు తంగిరాల రామిరెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు వివిధ హోదాల్లో గల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎస్‌యూడీ లైఫ్ నిఫ్టీ ఆల్ఫా 50 ఇండెక్స్ ఫండ్ ప్రారంభం

విజయవాడ, అక్టోబర్ 10 ప్రభాతవార్త: స్టార్ యూనియన్ డాయి ఇచి లైఫ్ ఇన్సూరెన్స్ (ఎస్‌యూడీ లైఫ్) సంస్థ,"ఎస్‌యూడీ లైఫ్ నిఫ్టీ ఆల్ఫా 50 ఇండెక్స్ ఫండ్" అనే కొత్త ఫండ్‌ను ప్రారంభించామని ఎస్‌యూడీ లైఫ్ చీఫ్ ఇన్వెస్ట్మెంట్ ఆఫీసర్ప్రాశాంత్ శర్మ తెలిపారు. ఈ ఫండ్ నిఫ్టీ ఆల్ఫా 50 ఇండెక్స్ ను అనుసరిస్తుందని, ఇది భారతదేశంలోని స్థిరమైన, మార్కెట్‌ను మించిన పనితీరు చూపే కంపెనీలను గుర్తించడానికి రూపొందించిన స్మార్ట్ బీటా బెంచ్‌మార్క్ గా నిలుస్తుందని చెప్పారు. ఈ న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఓ) అక్టోబర్ 24, 2025 వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

## ప్రాజెక్టు కార్యాలయ ప్రారంభోత్సవ సన్నాహాలను పరిశీలించిన సిఆర్డిఏ అడిషనల్ కమిషనర్ ఏ.భార్గవ్ తేజ

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 10:** ప్రజారాజధాని అమరావతిలో ఈ నెల 13న ప్రారంభం కానున్న ఏపీ సిఆర్డిఏ ప్రాజెక్టు కార్యాలయ ప్రారంభోత్సవ సన్నాహకాలను అడిషనల్ కమిషనర్ ఏ.భార్గవ్ తేజ ఐఏఎస్ గారు పరిశీలించారు. నిర్మాణం పూర్తి చేసుకున్న ప్రాజెక్టు కార్యాలయంలోని పలు ఫ్లోర్లు, వివిధ ఛాంబర్‌లను అడిషనల్ కమిషనర్ గారు సందర్శించారు. అడిషనల్ కమిషనర్




గారికి సిఆర్డిఏ హౌసింగ్ బిల్డింగ్స్ విభాగ చీఫ్ ఇంజినీర్ పి.వి.కె.భాస్కర్, డెవలప్మెంట్ ప్రమోషన్ జోనల్ జాయింట్ డైరెక్టర్ కె.దివ్యలత, కమ్యూనికేషన్స్ విభాగ డిప్యూటీ డైరెక్టర్ ఎం.సిద్దార్థ వర్మ తదితరులు ప్రాజెక్టు కార్యాలయంలో పూర్తి కానున్న పనులను వివరించారు. ప్రాజెక్టు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి అడిషనల్ కమిషనర్ గారు ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

## వీసి విధుల నుంచి తప్పకున్న గంగాధరరావు

### - వీసి ఛాంబర్‌లో 10నిమిషాలు గడిపి తన పుస్తకాలతో వెనుదిరిగిన మాజీ వీసి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,అక్టోబరు10, ప్రభాతవార్త: తాత్కాలిక వీసిగా పనిచేసిన ఆచార్య కె.గంగాధరరావు తన విధుల నుంచి రిలీవ్ అయ్యారు. గురువారం ఉదయం వీసి కార్యాలయానికి వచ్చిన ఆయన తనకు సంబందించిన పుస్తకాలను తీసుకుని వీసి చాంబర్ వదిలివెళ్ళారు. కేవలం 10 నిమిషాలు మాత్రమే ఆయన అక్కడ ఉన్నట్లు తెలిసింది. ఏఎన్‌యుకు రెగ్యులర్ వీసిగా ఆచార్య ఎస్.వి.సత్యన్నారాయణ రాజును ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులు వచ్చిన వెంటనే గంగాధరరావును రిలీవ్ చేయాలని జిఓ నెంబరు 203 ద్వారా ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో ఆయన తన పదవిని కోల్పోవాల్సి వచ్చింది. 15 నెలల తరువాత వీసి చాంబర్ మూగబోయినట్లు అనిపించింది. నిన్నా మొన్నటి వరకు ఆయనే వీసిగా వస్తారని కొన్ని అంచనాలు ఉన్నాయి. లోకల్, నాన్ లోకల్ విషయంలో గంగాధరరావుకు అవకాశం ఉంటుందని అంతా భావించారు. వీసి పదవికి అన్ని రకాల మద్దతు కూడగట్టుకునేలోగా పదవీగండం రావడం జీర్ణించుకోలేని విషయం. చివరికి తక్షణమే విధులునుంచి తొలగిపోవాలని జిఓ రావడం వర్సిటీలో చర్చనీయాంశమైంది. విద్యాశాఖా మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలో ఉన్న యూనివర్సిటీకి వీసి మార్పు అన్ని అంచనాలను తారుమారు చేసింది. శుక్రవారం కొందరు అధ్యాపకులు మాజీ వీసి గంగాధరరావు విభాగానికి వెళ్ళి కలిశారు. ఆయనకు మద్దతుగా కొందరు కోఆర్డినేటర్‌లు రాజీనామా చేసేందుకు సన్నద్ధులయ్యారని సమాచారం. నూతన వీసి బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రస్తుతం గంగాధరరావు టీంలో ఉన్న తాత్కాలిక డైరెక్టర్‌లు, కోఆర్డినేటర్‌ల మార్పు ఉండనుంది. వీరిలో కొందరికి మోదం, మరికొందరికి ఖేదం తప్పదని తెలుస్తోంది. ఇదిలాఉండగా అన్నీ ఉన్నా... అల్లునికి శని అన్న చందంగా ఏఎన్‌యు పరిస్థితి నెలకొంది. ఆచార్య రాజశేఖర్ దాదాపు నాలుగున్నరేళ్ళ (ఎఫ్ఏసి, రెగ్యులర్) పాటు వీసిగా పనిచేశారు. ఆయన హయాంలో నూతన కోర్సులు ఏర్పాటు, వర్సిటీ అభివృద్ధి వేగంగా జరిగి ఏఎన్‌యుకు దాదాపు 130 వరకు జాతీయ, అంతర్జాతీయ ర్యాంకులతో పాటు, ఎన్ఐఆర్ఎఫ్, నాక్ ఏ ప్లస్ గ్రేడ్ (డ్యూయల్ మోడ్ కేటగిరి) వచ్చింది. ఆయన తరువాత ఇన్‌చార్జ్ (ఎఫ్ఏసి కాదు) వీసిగా ఆచార్య గంగాధరరావు బాధ్యతలు చేపట్టారు. కొద్ది రోజుల తరువాత తన టీంను (రెక్టార్, రిజిస్ట్రార్, డైరెక్టర్, కోఆర్డినేటర్‌లను) నియమించుకున్నారు. వారందరిని తాత్కాలికంగా నియమించిన గంగాధరరావు తన పాలనను కొనసాగించారు. అప్పటి వరకు తనపై ఉన్న మృదుస్వభావి ముద్రతో పాలన చేస్తున్నది ఇతనేనా అనే చర్చ మొదలైంది. కాలానుగుణంగా కొందరు అధికారులు సహాయనిరాకరణ చేశారని గుసగుసలు వినిపించాయి. పెద్దమొత్తాల్లో పెన్షన్‌లు తీసుకునే వారికి సైతం నెలకు రూ.60వేలు వేతనాలతో ఉద్యోగాలు ఇచ్చారనే అభియోగాలు వచ్చాయి. ఇవన్నీ కూడా ఆయనకు పదవీగండంగా మారినట్లు చర్చించుకుంటున్నారు. స్థానికంగా ఉన్న కొందరు పార్టీ వేగులు వర్సిటీ పరిస్థితులపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేధికలు పంపారు. వేగుల సమాచారంతో వాటిని పరిగణలోకి తీసుకుని బెనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి అకడమిక్ పరంగా స్ట్రాంగ్‌గా ఉన్న ప్రొఫెసర్‌ను వీసిగా నియమించడం జరిగింది. గంగాధరరావుకు ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీకి వీసిగా నియమిస్తారంటూ కొందరు జోస్యం చెప్పడటం గమనార్హం.




## 'మానసిక ఆరోగ్యానికి బుద్ధుని సూత్రాలు దోహదం'

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,అక్టోబరు10, ప్రభాతవార్త: గౌతమ బుద్ధుని సూత్రాలు మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయని మయన్మార్ దేశానికి చెందిన బుద్దిస్ట్ ఫిలాసఫర్, ఏఎన్‌యు పరిశోధకులు కోమల అన్నారు. వర్సిటీలోని సైకాలజీ విభాగంలో శుక్రవారం ప్రపంచ మానసిక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కోమల మాట్లాడుతూ నేటితరం బుద్ధుని సూత్రాలను మానసిక ఆరోగ్యానికి ఏవిధంగా అన్వయించుకోవాలో వివరించారు. విద్యార్థి దశలో మానసిక ప్రశాంతత ఎంతో ముఖ్యమని, జ్ఞానం, వివేకం పెంపొందించుకోడానికి ఎంతో దోహదపడతాయన్నారు. విభాగాధిపతి ఆచార్య జి.చెన్నారెడ్డి మాట్లాడుతూ నైతిక విలువలు పాటించడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చునన్నారు. గొప్ప మేధావులందరు విలువలు పాటించిన వారే అన్నారు. ఈ కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు డాక్టర్ విమల, ప్రమీళారాణి, కె.కృష్ణమోహన్, అనుపమ తదితరులు పాల్గొన్నారు. మానసిక దినోత్సవం సందర్భంగా విభాగం విద్యార్థులు 200మంది వివిధ విభాగాల విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

## తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ అత్యవసర సమావేశం

తిరువూరు, అక్టోబర్ 10, ప్రభాతవార్త : తిరువూరు నగర పంచాయితీచైర్ పర్సన్ కె నిర్మల అధ్యక్షతన కౌన్సెల్ అత్యవసర సమావేశం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొలికలపూడి శ్రీనివాసరావు, కమీషనర్ మనోజ్ఞ, కౌన్సెలర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## బాణసంచా అమ్మకందారులు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలి : జిల్లా అగ్నిమాపక అధికారి మాల్యాద్రి

**విజయవాడ కార్పొరేషన్,అక్టోబరు 10,ప్రభాతవార్త:** దీపావళి సందర్భంగా బాణసంచా అమ్మకందారులు అగ్ని ప్రమాదాలు జరుగకుండా ఖచ్చితంగా ఫైర్ సేఫ్టీ నామ్స్ పాటించాలని డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి పేర్కొన్నారు. మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం లోని నూతన భవనం, మీటింగ్ హాల్లో దీపావళి సందర్భంగా బాణ సంచా అమ్మకందారులతో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, ఎస్టేట్ ఆఫీసర్ ఏ.శ్రీధర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.వెంకటనారాయణలు సంయుక్తంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ అనుమతి లేనిదే బాణసంచా అమ్మరాదని, వీధి విక్రయదారులు నిర్ధేశిత ప్రదేశాలలోనే బాణసంచా అమ్మాలన్నారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు మాట్లాడుతూ నగరపాలక సంస్థకు ప్రధానంగా సురక్షితమైన దీపావళి జరుపుకోవడమే ముఖ్యమన్నారు. అమ్మేవారు వారి చుట్టుపక్కల నివసిస్తున్న వారు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందికరమైన ప్రమాదకరమైన వాతావరణం ఉండకుండా చూసుకోవాలన్నారు. ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరుగకుండా ఉండాలంటే కేవలం విశాలవంతమైన ఓపెన్ గ్రౌండ్‌లో మాత్రమే బాణసంచా అమ్మటానికి అనుమతిని ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ (యుసిడి) పి.వెంకటనారాయణ మాట్లాడుతూ వీధి విక్రయదారులు కేవలం నిర్ధేశిత ప్రదేశాలలో మాత్రమే అమ్మకాలు చేయాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నగేష్, నగర పరిధిలోని బాణసంచా అమ్మకందారులు, విఎంసి సిబ్బంది పాల్గొన్నారు.



## దోమల వల్ల కలిగే వ్యాధుల నివారణ కోసం 'ఫ్రైడే డ్రై డే'

**విజయవాడ కార్పొరేషన్,అక్టోబరు 10,ప్రభాతవార్త:** విజయవాడ కార్పొరేషన్, అక్టోబరు 10,ప్రభాతవార్త: దోమల వల్ల కలిగే వ్యాధుల నుండి నివారణ కోసం ఫ్రైడే డ్రై డే నిర్వహణతో ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర ఇచ్చిన ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం ద్వారకానగర్, లెక్చరర్స్ కాలనీ, మధురానగర్ ప్రాంతాలలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి దోమల బారిన పడకుండా ఉండేందుకు విఎంసి సిబ్బంది అవగాహన కల్పించారు. అందులో భాగంగా అక్కడ నివసిస్తున్న ప్రజలు వారి ఇళ్ళల్లో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేస్తూ ప్రతి ఫ్రైడే డ్రై డే నిర్వహించాలని, వారికి అవగాహన కల్పిస్తూ దోమలు పెరగకుండా యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బయాలజిస్ట్ కామేశ్వరరావు, మలేరియా సిబ్బంది, ఎఎన్‌యంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



## హజరత్ అతావుల్లా బాబా మిషన్ సేవలు ప్రశంసనీయం: ఎమ్మెల్యే 'కొలికపూడి'



**ఎ కొండూరు, అక్టోబర్ 10, ప్రభాతవార్త :** అలుపెరుగని అన్నదాత, సూఫీధర్మ సిద్ధాంతకర్త, నఖీబుల్ ఔలియా హజరత్ ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షాతాజ్ ఖాదరీ బాబా గత 70 ఏళ్ళుగా మహా అన్నదాత క్రతువు కొనసాగిస్తూ అటు ధార్మిక, ఇటు ఆద్యాత్మిక రంగాల్లో చేసిన బాబా మిషన్ కృషి ఆచంద్రార్కం సూర్య, చంద్రులున్నంతకాలం అతావుల్లా బాబా అన్నం మెతుకు వల్ల ఆకలిగొన్న పేదప్రజల క్షుద్బాధ తీర్చటం, ఆ అన్నం మెతుకు ద్వారా ఎందరికో మానసిక ప్రశాంతత, రోగనివారిణిగా అన్నం పాత్ర నేటికీ పని చేస్తుండడం ఆ అతావుల్లా బాబాకు భగవంతుడు, అల్లా ప్రసాదించిన వరమని అతావుల్లా బాబా లాంటి సూఫీ మహాత్ములు కొందరు మాత్రమే వుంటారని ఎన్‌టిఆర్ జిల్లా తిరవూరు కూటమి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. చీమలపాడు అతావుల్లా బాబా దర్బాదర్ అండ్ దర్గాలో ఇరాక్ దేశం లోని బాగ్దాద్‌లో వున్న గౌసెపాక్ మహబూబ్ సుభాని, బడే పీర్‌మహాత్ముల గా ్యర్వీషరీఫ్ జెండా గంథమహోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని కులమతాలకతీతంగా దర్బార్‌కు వచ్చిన వేలాదిమంది భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిపారు. అతావుల్లా బాబా వారి ఆధ్యాత్మిక, ధార్మిక, సంఘ సేవా కార్యక్రమాల మిషన్‌ను పీఠాధిపతులు ఖాజా మొహియుద్దీన్, విజయనగరం ఖాదర్ వలీ బాబా దర్గా ముతవల్లి డాక్టర్ ఖలీల్‌బాబు ముందుకు తీసుకెళ్ళటం గొప్ప అద్భుత సేవా కార్యం అని ఎమ్మెల్యే శ్రీనివాసరావు అన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ దర్బార్‌కు విచ్చేయగా దర్బార్ సాంప్రదాయం ప్రకారం జాఫర్‌బాబు, ఖాజాబాబు, ఖలీల్ పాల్గొని స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేవం పార్టీ తిరువూరు ఎ. కొండూరు మండల, నియోజకవర్గ స్థాయిలో వివిధ హోదాలో వున్న నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దర్బార్‌లో భారీగా ప్రసాద వితరణ అన్నదానం నిర్వహించారు.

## పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరైన 'పిన్నెల్లి' సోదరులు



మాచర్ల, అక్టోబరు 10, ప్రభాతవార్త: వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో జరిగిన వర్గపోరులో జరిగిన జంట హత్యల కేసులో పోలీసుల ఆదేశాల మేరకు రెండోసారి మాచర్ల రూరల్ పోలీసు స్టేషన్‌లో విచారణకు పిన్నెల్లి సోదరులు శుక్రవారం హాజరయ్యారు. పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, యువజన రాష్ట్ర విభాగా ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలను పోలీసులు విచారించారు.

## Publication of Notice for News Paper

The following individual sites are submitted for the forthcoming TDR Committee meeting, which will be headed by the Commissioner of Vijayawada Municipal Corporation. The meeting will cover the areas mentioned below. Any Suggestion or objections regarding the issuance of the TDR bonds for the applications listed below should be submitted to this office (Circle-II, VMC main office) within 7 days. If no objections are received with in this period. Further action will be taken for the issuance of TDR bonds.

| S.No | Name of the Property Holder | Road affected area | Name of the Street | R.S.No/ Village Name | Near D.No | Document No |
|---|---|---|---|---|---|---|
| 1 | Sri. Kotha Srinivasarao | 110.00 Sq Yds | 100 Feet wide HT Line Road | Rs no: 463/1 | 54-11-1A | 6482 / 2015 |
| 2 | Sri. Nannapaneni Srinivasa Prasad | 111.11 Sq Yds | 120 Feet wide Eluru road | Rs No: 227 | 44-1-2/1 | 2889 / 2003 |
| 3 | Smt. Kosaraju Umachowdary, W/o Murali Krishna | 893.27 Sq Yds | 80 Feet wide Budameru canal road | Rs No: 138 Gunadala | 49-4/1-14B | 2100 / 2014 |
| 4 | 1)Sri Yelamanchili Venkata Rama Pratap S/o Suresh 2) Sri Yelamanchili Sivarama Charan S/o Suresh | 137.67 Sq Yds | 120 Feet wide Eluru road | Rs No : 211/4(P) Gunadala | 44-1-34 | 1281 / 1999 |
| 5 | Sri Agnihotram Srinivasa | 149.55 Sq yds | 120 Feet wide Gunadala to Nunna road | Rs No: 42/2D Gunadala | 49-4/1-3 | 2724 / 2021 |
| 6 | Sri Kelam Narasimha rao | 322.57 Sq yards | 60 feet Railway track road | Rs No: 34/1 Gunadala | 49-4-22 | 5810/2022 106/2022 522/2022 362/2022 |
| 7 | Manne Vishnu S/o Venkata ramarao | 968 Sq yards | 120 Feet wide Gunadala to Nunna road | Rs No: 63/6 Gunadala | 49-4-10 | 5993 / 2018 |

For Assistant City Planner –II
Vijayawada Municipal Corporation

## వైద్య కళాశాలలపై ప్రజలను పక్కదారి పట్టించేందుకే జగన్ తప్పుడు ప్రచారం : ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు, అక్టోబరు 10 ప్రభాతవార్త : మెడికల్ కాలేజ్‌లపై ప్రజలను పక్కదారి పట్టించేందుకే వైకాపా అధినేత జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైకాపా హయాంలో 50 శాతం మెడికల్ సీట్లు ప్రైవేటుకు కేటాయించారన్నారు. అప్పటి జగన్ ప్రభుత్వమే ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ప్రైవేట్ కోటాకు 50 శాతం సీట్లు కేటాయిస్తూ జీవో నెం.107, 108, 133 లను విడుదల చేసిందన్నారు. పీపీపీ విధానంలో ప్రభుత్వ కోటాలో 110 సీట్లు అదనంగా పెరుగుతాయనేది వాస్తవమని, ఈ విధానం వల్ల రాష్ట్ర విద్యార్థులకు మరింత అవకాశం లభిస్తుందన్నారు. జగన్ పాలనలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణాలకు రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఖర్చు చేయలేదని, మొత్తం రూ.1550 కోట్లు కేంద్ర ప్రభుత్వమే కేటాయిందన్నారు. నాలుగేళ్ళ జగన్ పాలనలో నిర్మాణాలు కేవలం 18శాతం మాత్రమే పూర్తయ్యాయని, ఈ ఆలస్యం వల్ల 1750 మెడికల్ సీట్లు మిగిలిపోవడమే కాక పీజీ సీట్లు కూడా కోల్పోయే అవకాశం ఉంటుందన్నారు. రాజకీయ స్వార్ధ ప్రయోజనాల కోసమే ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లపై దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు.

## జెడ్పీ పాఠశాలలో పోషకమాసం పై అవగాహన



పెదకూరపాడు, అక్టోబరు 10 ప్రభాతవార్త : మండల కేంద్రమైన పెదకూరపాడులోని జెడ్పీ పాఠశాలలో శుక్రవారం 8వ పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. తహశీల్దార్, ఎంపిడివో, ఎంఈవోలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అత్త దేవమ్మ, సర్పంచ్ గుడిపూడి రాజు, మాజీ ఎంపిటిసి షేక్.ముంతాజ్, యానిమేటర్ సుజాత, సిడిపివో వెంకటరమణ, హెచ్ఎం రమణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణీలు పాల్గొన్నారు. గర్భిణీలకు సీమంత కార్యక్రమంలో నూతన వస్త్రాలను అందజేశారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం'

పెదకూరపాడు, అక్టోబరు 10 ప్రభాతవార్త : పెదకూరపాడు సబ్‌స్టేషన్, 75 తాళ్ళూరు సబ్‌స్టేషన్ పరిధిల్లో ఉన్న అన్ని గ్రామాలలో ఉదయం 8.30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలియజేశారు. ఏఈ రామకృష్ణ మాట్లాడుతూ వినియోగదారులు ముందస్తు చర్యలను తీసుకొని సహకారం అందించాలన్నారు.

## ఏపీ ఎస్ఆర్ఎంకు క్యూఎస్ఐ గేజ్ డైమండ్ రేటింగ్




మంగళగిరి, అక్టోబరు 10, ప్రభాత వార్త: ఏపీఎస్ఆర్ఎం యూనివర్శిటీకి దేశీయంగా ప్రతిష్టాత్మకమైన గుర్తింపు లభించింది. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఖి క్యూ ఎస్ఐ.గేజ్ సంస్థఖి యూనివర్సిటీ పనితీరును అన్ని కోణాల్లోనూ విశ్లేషించి డైమండ్ రేటింగ్ ను ప్రకటించింది. అత్యున్నతమైన విద్యా బోధన, పరిశోధన, విద్యా ప్రమాణాలను విశ్లేషించి ఓవరాల్ గా డైనుండ్ రేటింగ్ ప్రకటించింది. అత్యాధునిక సదుపాయాల కల్పన విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకున్న ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి ప్లాటినమ్ రేటింగు ప్రకటించిన క్యూఎస్ ఐ గేజ్ సంస్థ ఉద్యోగాల కల్పన, టీచింగ్, లెర్నింగ్, రీసెర్చ్, డైవర్సిటీ వంటి కీలక అంశాలను విశ్లేషించి గోల్డ్ రేటింగ్ ను అందజేసింది. గవర్నెన్స్, మౌలిక సదుపాయాల కల్పన వంటి విషయాల్లో సిల్వర్ రేటింగ్ ను ప్రకటించింది. ప్రతిభ గల ఫ్యాకల్టీల ఏర్పాటు, విద్యా ప్రమాణాలు, పరిశోధనల్లో నూతన పంథా, అంతర్జాతీయ స్థాయి ఎంవోయూలను కూలంకుషంగా విశ్లేషించిన సంస్థ ఓవరాల్ గా ఏపీ ఎసీఆర్ ఎం యూనివర్సిటీకి డైమండ్ రేటింగ్ ను ప్రకటించింది. ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే క్యూ ఎస్ఐ గిజ్ నుంచి డైమండ్ రేటింగ్ లభించడం ఎంతో సంతోషంగా ఉందని వర్సిటీ ఇన్ ఛార్జి వైస్ ఛాన్సిలర్ ఆచార్య సతీష్ కుమార్ పేర్కొన్నారు. యూనివర్సిటిలో బోధన, పరిశోధన వంటి కీలక అంశాల్లో మరింత పురోగతిని సాధిస్తామని క్వాలిటీ అన్యూరెన్స్ అసోసియేట్ డీన్ డాక్టర్ కార్తీక్ రాజేంద్రన్ పేర్కొన్నారు.

## కెఎల్‌యులో 'సమ్యక్ 2025 ' ప్రారంభం


తాడేపల్లి,అక్టోబర్ 10,ప్రభాతవార్త : కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో జాతీయ స్థాయి టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్ సమ్యక్-2025ని నిర్వహిస్తుందని వర్సిటీ విసి డాక్టర్ జి.పార్థసారధి వర్మ తెలిపారు.ఈ ఉత్సవానికి రాష్ట్ర క్రీడల అథార్టి చైర్మన్ అనిమిని రవినాయుడు ముఖ్యఅతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు.విద్యార్థులనుద్దేశించి ఆయన ప్రసంగించారు.దీంతో పండుగ వాతావరణం నెలకొంది.విద్యార్థుల భాగస్వామ్యంతో జాతీయ టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్ ఘనంగా జరిగింది.వర్సిటీ విసి డాక్టర్ జి.పార్థసారధివర్మ,ఆచార్య డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్,సమ్యక్ చైర్మన్ డాక్టర్ కె.రాజశేఖర్‌రావు, డాక్టర్ ఎ.శ్రీనాథ్,డాక్టర్ మాధవ్,కన్వీనర్లు డాక్టర్ వి.రాజేష్,డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ ఎం.కిషోర్‌బాబులతోపాటు ఇతర సీనియర్ నిర్వాహకులు, పరిశ్రమ నిపుణులు,విద్యార్థి నాయకులు హాజరయ్యారు.ముఖ్యఅతిథి అనిమిని రవినాయుడు మాట్లాడుతూ ఈ ఉత్సవాలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటిస్తూ వాస్తవ ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేలా జాతీయ స్థాయి వేదికను సృష్టించినందుకు కెఎల్ యూనివర్సిటీని ప్రశంసించారు.విద్యార్థులు అనుకూలమైన,సరసమైన స్కేలబుల్ పరిష్కారాలను నిర్మించాలని కోరారు. ప్రముఖులు ఉత్సవ సావనీర్‌ను విడుదల చేసి,కార్యక్రమాల అమలుకు వారి సహకారానికి కోఆర్డినేటర్లు,వాలంటీర్లకు గుర్తింపులను అందజేశారు.ప్రధానమంత్రి నరేంద్రమోదీ యొక్క వికసిత్ భారత్ విజన్ 2047ముఖ్యమంత్రి నారా చంద్రబాబు స్వర్ణ ఆంధ్రప్రదేశ్ విజన్,ఏఐ జెన్ యుగంలో ఊహించదగిన అనేక అవకాశాల కోసం మార్గం సుగమం చేస్తాయని,ఏపీ ప్రజలకు ముఖ్యంగా విద్యార్థులకు రాబోయే సంవత్సరాల్లో ఈ విజయవంతమైన విజన్ ప్లాన్‌లో భాగస్వామ్యమయ్యే వారు విద్యార్థులందరూ అత్యాధునిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని ఏఐ,వీఎల్ఎస్ఐ,రోబోటిక్స్,డ్రోన్ టెక్నాలజీ,హైడ్రోపోనిక్స్ మొదలైన అన్ని సాంకేతికతలతో పాటు వారిని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.జాతీయ నైపుణ్య ప్రాధాన్యతలతో ఈ ఉత్సవం సమలేఖనాన్ని డాక్టర్ కె.రాజశేఖర్‌రావు వివరించారు.సమ్యక్ చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ బహుళ వేదికల్లో సజావుగా నిర్వహించినందుకు భాగస్వామ్య సంస్థలు,అధ్యాపకులు వేలాది మంది విద్యార్థి వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు.రోజంతా,కారిడార్లు,మైదానాలు ప్రత్యక్ష ప్రదర్శనలు,ప్రోటోటైప్ పరీక్ష,హ్యాక్ స్టాక్స్ పీర్ సమీక్షలతో నిండిపోయాయి.నిపుణులు జ్యూరీలు కొత్తదనం సాంకేతిక లోతు,వినియోగదారుల ప్రభావం,స్కేలబిలిటీపై ప్రదర్శనలను మూల్యాంకనం చేయగా,వర్క్‌షాపులు జెనరేటివ్ ఏఐ,క్లౌడ్ డెవాప్స్,సైబర్ సెక్యూరిటీ డిజైన్ థింకింగ్,రోబోటిక్స్,ఎఆర్,విఆర్,డేటా ఇంజనీరింగ్‌పై కార్యక్రమాలతో వర్సిటీలోని హాళ్ళన్నీ నిండిపోయాయి.







## 'బాలికలు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలి'



కొల్లూరు, అక్టోబరు 10 (ప్రభాతవార్త) : బాలికలు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవడానికి దోనేపూడి సెక్టార్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఫజరున్నీసా అన్నారు. శుక్రవారం దోనేపూడి హైస్కూల్లో అంతర్జాతీయ బాలికల దినోత్సవం వేడుకలను అంగన్‌వాడీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ఫజరున్నీసా మాట్లాడుతూ బాలికల దినోత్సవం వేడుకలను అంగన్‌వాడీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ఫజరున్నీసా మాట్లాడుతూ బాలికల దినోత్సవం సందర్భంగా బాలికలకు విద్య అవకాశాలను ప్రోత్సహించడం బాలికల అన్ని కోణాల్లో చదువుకోవడానికి సమాన అవకాశాలు కల్పించడం ఆరోగ్య పరిరక్షణ సంతాన పేక్ష మానసిక శారీరక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సమానత్వం హక్కులు లింగ మూలక వివక్షను నివారించటం హక్కులను రక్షించటం సాధికారిత బాలికల నాయకత్వం ఆర్థిక సామాజిక రంగాల్లో ముందడుగు వేయడానికి ప్రోత్సాహించడం లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక స్వచ్ఛంద సంస్థలు బాలికల దినోత్సవంగా జరుపుకుంటూ బాలికల హక్కులు స్వావలంబన సమానత్వం కోసం ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. కార్యక్రమంలో వ్యాసరచన పోటీలలో గెలుపొందిన బాలికలకు సూపర్‌వైజర్ ఫజరున్నీసా బహుమతులు అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సంధ్య, రాజ్యలక్ష్మి, సౌభాగ్యలక్ష్మి, కిశోర

## ఎస్ఆర్ఎంలో రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్



మంగళగిరి, అక్టోబరు 10, ప్రభాతవార్త: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం మూడవ రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్ జరిగింది. బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ మాజీ డైరెక్టర్, పద్మభూషణ్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ బలరామ్ పద్మనాభన్ ముఖ్య అతిధిగా హాజరై సదస్సును ప్రారంభించి రీసెర్చ్ స్కాటర్లను ఉద్దేశించి ప్రసంగించారు.. పరిశోధనా రంగంలో అడుగు పెట్టిన ప్రతి విద్యార్థి ప్రధానంగా విజ్ఞానాన్నీ, పరిశోధనాంశాలపై పట్టు పెంచుకోవాలన్నారు. రోజురోజుకీ సైన్స్ విస్తృతమవుతున్న ప్రస్తుత రోజుల్లో నూతన ఆవిష్కరణలు భారత్ కీర్తిని మరింత ఇనుమడింపజేస్తున్నాయన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన భారత వాతావరణ పరిశోధనా ప్రయోగశాల (ఎన్ఏఆర్ఎల్) డైరెక్టర్ డాక్టర్ అమిత కుమార్ పాత్ర మాట్లాడుతూ, ఆసక్తి లేనిదే ఆవిష్కరణలు అసాధ్యమన్నారు. మన దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో ప్రగతి సాధిస్తుందని, శాస్త్రీయ పరిశోధన దేశ అభివృద్ధికి ఎంతో ఉపయుక్తంగా మారుతుందన్నారు. నూతన లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. నూతన ఆవిష్కరణలకు యూనివర్సిటీలు కేంద్రాలుగా మారాలని ఎస్ఆర్ఎం గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచార్య డి నారాయణరావు సూచించారు. చంద్రయాన్ తో భారత్ కీర్తి విశ్వవ్యాప్తంగా మారిందని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ డిక్లరేషన్ ప్రకటించిందని, ఇందులో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ నోడల్ ఏజెన్సీగా గుర్తించబడిందని ఆయన పేర్కొన్నారు. ఎస్ ఆర్ ఎం యూనివర్సిటీలో క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపిందని నారాయణరావు పేర్కొన్నారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ డాక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ రీసెర్చ్ సమ్మిట్ ఏర్పాటు చేయడం పరిశోధనా అంశాలపై అవగాహన కలిగించడం ఉపయుక్తంగా మారిందని పేర్కొన్నారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ బలరామ్, అమిత్ కుమార్ పాత్రో, టి నారాయణరావు లను యూనివర్సిటీ యాజమాన్యం సత్కరించింది. ఈ సందర్భంగా వేదికపై రీసెర్చ్ అబ్ స్ట్రాక్ట్ బుక్లెట్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ తప, రిజిస్ట్రార్ ఆర్ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇప్పటంలో స్వచ్ఛత అవగాహన కార్యక్రమం

తాడేపల్లి,అక్టోబర్ 10,ప్రభాతవార్త : నిర్మల ఫార్మసీ కళాశాల సేవా పథకం యూనిట్ మరియు ఉన్నత భారత అభియాన్ యూనిట్ సంయుక్తాధ్వర్యంలో ఇప్పటం గ్రామంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు.విద్యార్థులు కళాశాల నుంచి బయలుదేరి,ఇప్పటం గ్రామ సచివాలయానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రేఖా నరేష్‌బాబు పరిసరాల పరిశుభ్రత,తడి-పొడి చెత్త వేరా ్ఎటు,ప్లాస్టిక్ వినియోగ నిర్మూలన వంటి అంశాలపై గ్రామప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు దిశానిర్ధేశం చేశారు.విద్యార్థులు ఇంటింటికి వెళ్ళి ఇంటి పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత,స్వచ్ఛత అవసరం లాంటి అంశాలపై సర్వే నిర్వహించి ప్రజలకు చైతన్యం కల్పించారు.ఇప్పటం ప్రాథమిక పాఠశాలకు చేరుకొని మానవహారంగా ఏర్పడి విద్యార్థులకు అవగాహన కల్పించారు.విద్యార్థులందరూ కలసి రాష్ట్ర ప్రభుత్వం సూచించిన "స్వచ్ఛత ప్రతిజ్ఞ" చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రెవ.సిస్టర్ జి.నిర్మలజ్యోతి,ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాములరెడ్డి లు అభినందించారు.ఇప్పటం గ్రామ సచివాలయం కార్యదర్శి నందం బాల పరమేశ్వరరావు,ప్రాథమిక పాఠశాల సీనియర్ టీచర్ నల్లపాటి మధుబాబు,ఎన్ఎస్ఎస్ స్టూడెంట్ కోఆర్డినేటర్స్ ఎం.బిందు ప్రియాంక,ఎస్.కె.రజీయాబేగం, జి.ప్రజ్ఞ,ఎం.మధుమిత,పి.సాయి స్నిగ్ధ,ఎం.డి హలీమా నౌరీ,ఎం.హరినాథ్,తదితరులు పాల్గొన్నారు.




## స్వచ్ఛ సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి -డీఎల్‌పీఓ స్వరూపరాణి



కొల్లిపర,అక్టోబరు 10 ప్రభాతవార్త: స్వచ్ఛ సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఎల్‌పీఓ స్వరూపరాణి అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని తూములూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆమె రికార్డులను..డంపింగ్ యార్డును తనిఖీ చేసి సిబ్బందికి తగిన సూచనలు..సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ పారిశుద్ధ్యంపై తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు.కాల్వల్లో మురుగు తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి,డిప్యూటి ఎంపీడీఓ భార్గవ్,పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'బోధనేతర పనిభారం తగ్గించండి'



కొల్లిపర,అక్టోబరు 10 ప్రభాతవార్త: పాఠశాలల్లో యాప్ నిర్వహణ,బయోమెట్రిక్ పనితీరు,పొటోలు తీయటం,ఇతర పని వత్తిడితో ఉపాధ్యాయులు సతమతమవుతున్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అన్నారు.శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యా సంఘాల పిలుపు మేరకు ఎంఈవో వెంకటేశ్వర్లుకు ఉపాధ్యా సంఘాల మండల నాయకులు వినతి పత్రం అందజేసారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ భోధనేతర పనులన్నింటినీ బాయ్‌కాట్ చేసేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయసంఘాల నాయకులు వర ప్రతాప్‌కుమార్,కాలేషావలి,ఎన్.రామచంద్రయ్య,పి.సురేష్,మృత్యుంజయరావు,రాము,సత్తార్,ఏడుకొండలు,నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత -ఎంపీపీ భీమవరపు పద్మావతి



కొల్లిపర,అక్టోబరు 10 ప్రభాతవార్త: భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు.శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులకు,కార్యదర్శులకు థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్‌విలేజ్‌పై శిక్షణా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిదిగా పాల్గొని ప్రసంగిచారు.ఎంపీడీఓ విజయలక్ష్మి అద్యక్షతన జరిగిన కార్యక్రమంలో పద్మావతి మాట్లాడుతూ గ్రామాలను సుందరంగా తీర్చి దిద్దాలన్నారు.డిఎల్‌పీఓ స్వరూపరాణి మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రత,వ్యర్థాల నిర్వహణ,మొక్కలు పెంపకం వంటి వాటిపై ప్రజా ప్రతినిధులు,అధికారులు దృష్టి పెట్టడం వలన గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు.కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీఓ భార్గవ్,సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి,వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొదన్నారు.

## తగ్గించిన జీఎస్టీ ధరల ప్రకారమే వస్తువులను కొనుగోలు చేయాలి -ఎంపీడీఓ విజయలక్ష్మి



కొల్లిపర,అక్టోబరు 10 ప్రభాతవార్త: ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ధరల ప్రకారమే వస్తువులను కొనుగోలు చేయవిచ్చని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు.శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్‌పై ప్రజా ప్రతినిధులకు..అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా ధరను చూడాలన్నారు.కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి,డిప్యూటి ఎంపీడీఓ భార్గవ్,సీనియర్ అసిస్టెంటు శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## క్రాప లో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ముఖ్య నాయకులు







కొల్లూరు, అక్టోబరు 10 (ప్రభాతవార్త) : మండల పరిధిలోని క్రాప గ్రామంలో శుక్రవారం నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని విగ్రహావిష్కరణ చేసిన వేమూరు నియోజకవర్గ శాసన సభ్యులు నక్కా ఆనందబాబు, గుంటూరు నియోజకవర్గం శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, మరియు దెందులూరు నియోజకవర్గ శాసన సభ్యులు చింతమనేని ప్రభాకర్‌లు పాల్గొని విగ్రహావిష్కరణ చేశారు. విగ్రహ దాత తలశిల సీతారాంబాబు కుమారుడు పవన్ ఆధ్వర్యంలోఈ కార్యక్రమం జరిగింది. క్రాప అడ్డరోడ్డు నుండి మిల్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొల్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూధనప్రసాద్, మరియు వేమూరు నియోజకవర్గం మరియు కొల్లూరు మండల తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మత్తు మందుల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన: సీఐ రమేష్



చిలకలూరిపేట, అక్టోబర్ 10, ప్రభాతవార్త: యువతను మత్తు మందుల బారి నుండి రక్షించాలనే లక్ష్యంతో చిలకలూరిపేట పట్టణంలో విస్తృత అవగాహన కార్యక్రమం జరిగింది. స్థానిక శారదా స్కూల్ నందు చిలకలూరిపేట పట్టణ సీఐ రమేష్ సారథ్యంలో, అసిస్ట్ సంస్థ సహకారంతో "మత్తు మందు నుండి యువతను కాపాడుదాం" అనే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ రమేష్ విద్యార్థులతో మాట్లాడారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. నేటి సమాజంలో, ముఖ్యంగా ధనిక కుటుంబాలలో, "క్లబ్ కల్చర్" పేరుతో యువత డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ తీసుకోవడం కేవలం వ్యక్తిగత సమస్యే కాదని, అది వారి కుటుంబాలను, సమాజాన్ని కూడా నాశనం చేస్తుందని స్పష్టం చేశారు.డ్రగ్స్ నివారణకు ప్రత్యేక చర్యలుడ్రగ్స్ నివారణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ఈ విషయంలో పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని సీఐ రమేష్ తెలిపారు. డ్రగ్స్ నిరోధక చర్యల కోసం ఖిఈగల్ అనే ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు విద్యార్థులకు తెలియజేశారు.డ్రగ్స్ తీసుకునేవారు ఎక్కడైనా కనిపించినా, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని విద్యార్థులను కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ 1972 ను గుర్తు చేశారు. ఎవరైనా డ్రగ్స్ కనిపిస్తే, ఎవరైనా డ్రగ్స్ తీసుకుంటున్నట్లయితే వెంటనే 1972 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ అవగాహన కార్యక్రమంలో శారదా స్కూల్‌కు చెందిన బాలురు, బాలికలు సంఖ్యలో పాల్గొన్నారు.

## బాణసంచా ధరలను నియంత్రించండి: ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోండి



చిలకలూరిపేట, అక్టోబర్ 10, ప్రభాతవార్త: అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం. ప్రతి సంవత్సరం ఎక్కడో ఒకచోట ఇలాంటి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సామాజికవేత్త మాదాసు భాను ప్రసాద్ కోరారు. ప్రభుత్వం కోనసీమ జిల్లాలో జరిగిన ప్రమాదంపై కమిటీని వేయడమే కాకుండా నివేదిక ఆధారంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని భాను ప్రసాద్ కోరారు. చిలకలూరిపేట పట్టణంలో నేషనల్ హైవే పై ఏర్పాటుచేసిన బాణసంచా విక్రయ కేంద్రాలలో భద్రతా నిబంధనలు అమలు జరిగేలాగా చర్యలు తీసుకోవాలని కోరారు.చిలకలూరిపేట పట్టణం బాణసంచా విక్రయాలలో రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధి.. ఇక్కడ పెద్ద ఎత్తున అమ్మకాలు జరుగుతాయనేది జగమెరిగిన సత్యం, బాణసంచా విక్రయదారులు తీసుకునే లైసెన్సులు, అమ్మే సరుకుకు వాటి రేట్లకు ఏమాత్రం పొంతన ఉండటం లేదని సంబంధిత అధికారులు స్పందించి రేట్ల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం

చిలకలూరిపేట, అక్టోబర్ 10, ప్రభాతవార్త: చిలకలూరిపేట నియోజకవర్గం లో మాజీ మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోటి సంతకాల ˘ప్రజా ఉద్యమ్ం పోస్టర్ల ఆవిష్కర!ఈ సందర్భంగా



రజినిమాట్లాడుతూ రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు 45 రోజులపాటు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఈరోజు ప్రారంభించింది.ప్రజల ఆరోగ్య హక్కులను కాపాడేందుకు, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు చేతుల్లోకి అప్పగించాలనే కుట్రలను అడ్డుకునేందుకు ఈ ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా జోరుగా కొనసాగనుంది.సంతకాల సేకరణలో మేధావి వర్గాలు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజలు పాల్గొనాలి.ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రజల సొత్తు,వాటి ప్రైవేటీకరణను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోం అని తెలిపారు

## దీపావళి టపాసులు అమ్మకం దారులు నిబంధనలు పాటించాల్సిందే



చిలకలూరిపేట, అక్టోబర్ 10, ప్రభాతవార్త: రూరల్ మండల పరిధిలోని క్రాకర్ షాపులను చిలకలూరిపేట రూరల్ సిఐ బి.సుబ్బానాయుడు, ఎస్సై జి.అనిల్ కుమార్ లు, కలిసి తనిఖీలుచేశారు. ఈ సందర్భంగా రూరల్ స్టేషన్ పరిధిలో ఉన్న క్రాకర్స్ షాపుల యొక్క లైసెన్సులు,అనుమతులను పరిశీలించారు.అధికారులు షాపు నిర్వాహకులతో మాట్లాడుతూ,దీపావళి సందర్భంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే ప్రభుత్వం విధించిన నిబంధనల ప్రకారం షాపుల పని వేళలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు.నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నడపాలి

### గిరిజన విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక సహాయం హర్షణీయం -గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీను నాయక్



చిలకలూరిపేట, అక్టోబర్ 10, ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న మెడికల్ కళాశాలలు ప్రైవేట్ పరం కాకుండా ప్రభుత్వమే నిర్వహించాలి. ప్రభుత్వం నడపడం వలన విద్యార్థులకు తగిన న్యాయం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్ అన్నారు.శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో ప్రైవేట్ పరం చేయవద్దని ఇప్పటికే సిపిఐ నుంచి తీవ్రంగా వ్యతిరేకించడం జరిగిందన్నారు. మును.. ముందు దీనిపై కార్యక్రమాలు చేపడతామన్నారు. మన్యం జిల్లా కురుపాం లో గిరిజన పాఠశాలలో చదువుతున్న ఇద్దరు బాలికలు పచ్చకామెర్లతో కేజీహెచ్ లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆ కుటుంబాలకు ఒక్కొక్కరికి ఐదు లక్షలు చొప్పున మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రకటించడం పట్ల హర్ష వ్యక్తం తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆ బాలికల కుటుంబాలకు ఇటువంటి పరిహారం ప్రకటించకపోవడం పట్ల తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజన గురుకులాల్లో, వసతి గృహాల్లో ఆర్వో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని, తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట సిపిఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు, అఖిల భారత యువజన సమితి (ఏఐవైఎఫ్) పట్టణ కన్వీనర్ బి. రాంబాబు నాయక్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిలకలూరిపేట, అక్టోబర్ 10, ప్రభాతవార్త: రెండో శనివారం కారణంగా సబ్ స్టేషన్ లో మరమ్మతులు, లైన్ల మరమ్మత్తులు, ట్రీ కటింగ్ కారణముగా రూరల్ మండలం చిలకలూరిపేట రూరల్ మండల పరిధిలోని మానుకొండవారి పాలెం,మిట్టపాలెం, గొట్టిపాడు, దండమూడి, నాగభైరువారిపాలెం, గుదేవారిపాలెం, కుక్కపల్లివారిపాలెం, పసుమర్తి, చిన్న పసుమర్తి,మురికిపూడి, రామచంద్రాపురం, యడవల్లి , రాజాపేట,గోపాలంవారిపాలెం గ్రామములకు ఉదయం 9 గంటలనుండి మధ్యాహ్నం 2 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడును. యడ్లపాడు మండలం లోనిపుట్టకోట, కొత్తపాలెం,చెంగిజ్ఖ్ ఖాన్పే ,యడ్లపాడు,జాలాది, జగ్గాపురం, కారుచోల గ్రామములకు, నాదెండ్ల మండలం లోని అన్ని గ్రామములకు ఉదయం ,9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడును కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని డిఇ ఆర్.అశోక్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులకు క్రీడాదుస్తులు అందజేత



కొల్లూరు, అక్టోబరు 10 (ప్రభాతవార్త) : మండల కేంద్రమైన కొల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 24మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులను 1972-1973పూర్వ విద్యార్థులు శుక్రవారం అందజేశారు. అందజేసిన వారిలో కొల్లూరు జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు గుదిబండి రజనీకాంత్, విద్యా కమిటీ ఛైర్మన్ కొమ్ము తులామాన్, సూర్యదేవర భరత్‌కుమార్, భాగవతుల సూర్యనారాయణమూర్తి, మొవ్వ శశిధర్, గాడేపల్లి రామకృష్ణప్రసాద్, సూర్యదేవర శివాజీ, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పెదపూడి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌ను సందర్శించిన చైర్‌పర్సన్ రాధిక



తెనాలి మున్సిపాలిటీ, అక్టోబర్10,ప్రభాతవార్త: పురపాలకసంఘ పరిధిలోని జ్యోతిరావుఫూలే కాలనీ నందు గల మురుగునీటిశుద్ధి ప్లాంట్ ను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక పరిశీలించారు. వార్డు పర్యటనలో భాగంగా ప్లాంట్ ను సందర్శించి,దాని పనితీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రు.30కోట్లతో నిర్మించిన ఈప్లాంట్ ను శనివారం కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్,స్థానిక శాసనసభ్యులు,రాష్ట్ర ఆహార పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్,శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ లు ప్రారంభోత్సవం చేయనున్నట్లు, ఇప్పటికే ట్రయల్ రన్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.దీని ద్వారా పట్టణంలోని డ్రైనేజీ ద్వారా వచ్చే మురుగునీటికి శాశ్వత పరిష్కారం లభించినట్లేనని అధికారులు తెలిపారు.అంతేకుండా రైతులకు సాగు,మంచినీటి అవసరాలకు ఈ ప్లాంట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఎం.యేసుబాబు,టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సాంబశివరావు, ఇంచార్జి ఏఈ జానీబాషా, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## 'కాల్వలపై ఆక్రమణలు తొలగించండి'



తెనాలి మున్సిపాలిటీ, అక్టోబర్10,ప్రభాతవార్త: మురుగుకాల్వలపై ఆక్రమణలు తొలగించాలని, మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు.శుక్రవారం పట్టణంలోని పూలే కాలనీ నందు నిర్వహించిన శానిటేషన్ పనులను పరిశీలించారు.అనంతరం వార్డులో పారిశుధ్య పనులను పరిశీలించారు.మురుగుకాల్వలపై ఆక్రమణలను తొలగించవలసిందిగా సిబ్బందిని సూచించారు. కాల్వలపై నిర్మాణాలు జరిపితే,పూడికలు తీయుటకు ఆటంకం ఏర్పడుతుందని,కావున ప్రజలు సహకరించాలన్నారు.అనంతరం పారిశుధ్యసిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఎం. యేసుబాబు,టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సాంబశివరావు, ఇంచార్జి ఏఈ జానీబాషా, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భారత్‌పై అమెరికా ఆధిపత్యం నిలువరించాలి: సిపిఎం



తెనాలి టౌన్, అక్టోబర్10,ప్రభాతవార్త: భారతదేశం పై అమెరికా ఆధిపత్యాన్ని నిలువరించాలనిమన దేశప్రజల ప్రయోజనాలను పరిరక్షి ంచుకోవాలని,పట్టణ సీపీఎం పార్టీ ప్రజలకు పిలుపునిచ్చింది.శుక్రవారం పట్టణంలోని చెంచుపేట లోనగల ప్రజా సంఘాల కార్యాలయంలో, కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం సిపిఎం పట్టణ కమిటీ కార్యదర్శి కే.బాబూప్రసాద్ మాట్లాడుతూ, అమెరికా నేడు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకు ఆ భారాన్ని ప్రపంచ దేశాలపై వేసి తను ఒడ్డున పడాల ని చూస్తున్నారని అందులో భాగంగానే మనపై అడ్డగోలుగా,సుంకాలు వేస్తున్నారని, టెక్స టిల్స్, దుస్తులు, రొయ్యలు,చేపలు లీథెర్,వజ్రఆభరణాలు మందులు మరియు సినీ పరిశ్రమ పై 50!!సుంకం లు వేశారని తెలిపారు.వాటి వల్ల మన పరిశ్రమలు మూత పడుతాయని, రష్యా నుండి ఆయిల్ దిగుమతి చేసుకో రాదని ఆంక్షలు విధించారని, అందుకోసం 50!!అదనంగా టాక్స్ కట్టాలని హుకుం జారీ చేశారని,మనదేశ సార్వభౌమత్వం మీద దాడి చేస్తున్నారని విమర్శించారు.ట్రంప్ విధానాలను అడ్డు కోవడంలో మననేతలు విఫలం అయ్యారని,చైనా మెక్సికో లాంటి దేశాలు యెదురు తిరిగితే వాటితో రాజీ చేసుకున్నారనన్నారు. సిపిఎం రూరల్ కమిటీ కార్యదర్శి ఎం.శివసాంబిరెడ్డి మాట్లాడుతూ ట్రంప్ వేసే సుంకం పెంపు వల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపో తుందని చెప్పారు.పాడి రైతులు దివాలా తీస్తారని, పౌల్ట్రీ పరిశ్రమల దెబ్బ తింటున్నదని చెప్పారు.దేశ భక్తి గురించి మాట్లాడే బీజేపీ నాయకులు,ఇంత అన్యాయం మనకు అమెరికా చేస్తున్నా నోరుమెదుపట లేదన్నారు. మోడీ ని బలపరుస్తున్న కూటమి నాయకులు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో నోరు విప్పి మాట్లాడుట లేదన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ హుస్సేన్ వలి,జి.వెంకటసుబ్బయ్య, పి. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రెండోరోజుకు చేరిన కాంగ్రెస్ పార్టీ సంతకాల సేకరణ



తెనాలి టౌన్, అక్టోబర్10,ప్రభాతవార్త: ఆల్ఇండియా కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర కాంగ్రెస్ పిలుపుమేరకు, తెనాలి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో,శుక్రవారం "ఓట్ చోర్ గద్దె చోడ్" పేరుతో మున్సిపల్ కార్యాలయం ఎదుట సంతకాల సేకరణ కార్యక్రమం రెండోరోజుకి చేరింది.ఈ సందర్భంగా తెనాలి అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఓట్ల చోరీకి పాల్పడిందని, బిజెపి కేంద్ర ప్రభుత్వంలో కొనసాగే అర్హత కూలిపోయిందని,డాక్టర్ సాంబశివుడు ఘాటుగా విమర్శించారు. ఓట్ల చోరీ అంశంపై తమ పార్టీ అధినేత రాహుల్ గాంధీ మాట్లాడితే కేంద్ర ప్రభుత్వ పెద్దలు తట్టుకోలేకపోతున్నారని, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలను అణగదొక్కాలని చూడటం బిజెపి ప్రభుత్వ విధానమన్నారు.గతంలో ఎన్నికలు జరిగిన మహారాష్ట్ర లో గాని, కర్ణాటకలో గాని అలాగే త్వరలో ఎన్నికలు జరగబోయే బీహార్ లోగాని పెద్ద ఎత్తున ఓట్ల అక్రమాలు పాల్పడింది బిజెపి అని, ఆయన దుయ్యబట్టారు. లక్షల మంది కొత్త ఓటర్లుగా నమోదు చేసుకుంటే అందులో కొన్ని వేలమంది ఓట్లు అక్రమంగా నమోదు చేసి,ఈ రకమైన ఓట్ల చోరీతో గద్దెనెక్కిన బిజెపి ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందని,ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెంటనే గద్దె దిగాలని కాంగ్రెస్,వామపక్ష పార్టీల తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో సిపిఐ నాయకులు చెరుకుమల్లి సింగారావు మరియు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొన్నూరు నాగ సూర్య శశిధర్ రావు,పార్టీ నాయకులు పెనుగొండ శివకుమార్, మాదాల పూర్ణచంద్రరావు, భీమా రమేష్,చందు అయ్యప్ప,కోటేశ్వరరావు,పులే రామ్,శ్రీను,మల్లికార్జున రావు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు అన్యాయం: మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి టౌన్, అక్టోబర్10,ప్రభాతవార్త: ప్రభుత్వ మెడికల్ కాలేజీ లను ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతున్న రాష్ట్ర ప్రభుత్వ చర్యల వలన పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని మాజీ



శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ కరపత్రాలను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్ ముఖ్యమంత్రిగా గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేశారని, అందులో కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని, మరల జగన్ ముఖ్యమంత్రి అయినట్లయితే ఆ మెడికల్ కళాశాలలను నిర్మాణాలను పూర్తి చేసేవారని శివకుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య భారమవుతుందని ప్రజలందరూ గమనించాలని ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య భారమవుతుందని ప్రజలందరూ గమనించాలని, ఈవిధానం పై ప్రభుత్వ చర్యలకు నిరసనగా, వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు అవ్వాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు మహిళా నేతలు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా పట్టణ తెదేపా అధ్యక్షుడు ఖుద్దూస్ జన్మదిన వేడుక

తెనాలి టౌన్, అక్టోబర్10,ప్రభాతవార్త: పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మహమ్మద్ ఖుద్దూస్ జన్మదిన వేడుకలు శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు నిర్వహించారు.ఈ సందర్భంగా శాసనమండలి సభ్యులు, తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఖుద్దూస్ చేత కేక్ కటింగ్ చేయించి,జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్సి ఆలపాటి



మాట్లాడుతూ, ఖుద్దూస్ తెలుగుదేశం పార్టీకి క్రమశిక్షణ కలిగిన సైనికుని వలె పనిచేస్తూ,పార్టీ కార్యకర్తలు నాయకులు అందర్నీ కలుపుకుపోయే మనిషని,పార్టీ కష్టకాలంలో అండగా నిలబడి, పార్టీ అభివృద్ధికి ఎల్లవేళలా తోడ్పడిన నాయకుడని, పట్టణ పార్టీ అధ్యక్షుడిగా 7సార్లు వ్యవహరించి, మళ్లీ 8వ సారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టటం ఆయన ప్రతిభకు నిదర్శనం అన్నారు. అనంతరం వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనంద్ బాబు,ఏలూరు జిల్లా దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ లు కుద్దూస్ కి కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పట్టణంలో తెలుగుదేశం పార్టీకి సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొంది, కార్యకర్తలకు అండగా నిలబడి,న ఖుద్దూస్ భవిష్యత్తులో మరెన్నో పదవులు అలంకరించాలని, కోరుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో తెదేపా పట్టణ కార్యదర్శి వసంతం అశోక్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, తెలుగు యువత నాయకుడు కొల్లూరు శ్రీధర్,డాక్టర్ వేమూరి శేషగిరిరావు,శ్రీరాం సుభాష్ బాబు, కార్యకర్తలు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# బాపట్ల జిల్లా వార్త



## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొన్నూరు, అక్టోబరు 10,ప్రభాతవార్త: వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందించే లక్ష్యంగా విద్యుత్‌శాఖ పనిచేస్తోందని, అందులో భాగంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని ఎపిసిపిడిసిఎల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఆర్.వి.శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీబిసి రోడ్డులోని 11కెవి, ఎక్స్‌ప్రెస్ ఫీడర్ సమీపంలో చెట్ల కొమ్మలు, ఇతర చెట్ల యొక్క తీగలు అల్లుకొని ఉన్నందున, వాటిని తొలగించేందుకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. దీని వల్ల జీబీసి రోడ్డు, నేతాజీనగర్, వీవర్స్ కాలనీ, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్న విషయాన్ని వినియోగదారులు గుర్తించాలన్నారు. వినియోగదారుల సహకరించాలని కోరారు.

# బాణసంచా తయారీ, నిల్వ, విక్రేతలు తప్పని సరిగా అనుమతులు పొందాలి

### -కేసుల దర్యాప్తు వేగవంతంగా నిర్వహించాలి
### -నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ ఉమామహేశ్వర్




బాపట్ల, అక్టోబర్ 10, ప్రభాతవార్త: విది నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని బాపట్ల జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలోని సమావేశ హాలు నందు జిల్లా పోలీస్ అధికారులతో మొట్టమొదటిసారిగా నేర సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర మాట్లాడుతూ విచారణ దశలో ఉన్న కేసుల పురోగతి వేగవంతం చేయాలన్నారు.మహిళ, మిస్సింగ్, గంజాయి, ఎస్సీ ఎస్టీ సంబంధిత కేసుల దర్యాప్తు, సైబర్ నేరాలు, శక్తి యాప్, మహిళ సంబంధిత చట్టాల గురించి అవగాహన కార్యక్రమాలు, నిర్వహించాలన్నారు.బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై, రోడ్డు భద్రతా నియమాలు పాటించని వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు, సముద్ర తీర ప్రాంతాలలో యాత్రికుల భద్రత కోసం తీసుకోవలసిన చర్యలు, అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాల కట్టడికి డ్రోన్ ల వినియోగం తదితర పలు విషయాల గురించి పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేసి పలు సూచనలు ఇచ్చారు.విచారణ దశలో ఉన్న కేసులను సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని వేగవంతంగా దర్యాప్తు నిర్వహించి కేసుల పెండెన్సీ తగ్గించాలన్నారు. ఫోక్సో కేసులు, తీవ్రమైన నేరాలలో నిర్దిష్ట గడువులోపు దర్యాప్తు పూర్తి చేసి సంబంధిత కోర్టులో అభియోగపత్రం దాఖలు చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్ యంత్రాంగం ఎప్పుడు సంసిద్ధంగా ఉండాలన్నారు. నేరాలను కట్టడి చెయ్యడంతో పాటు ప్రజలకు భద్రత రక్షణ కల్పించడం పోలీస్ శాఖ ప్రథమ కర్తవ్యమన్నారుదీపావళి ముందు గుండు సామాగ్రి తయారీ, నిలువచేసే కేంద్రాలు, విక్రయ దుకాణాలకు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు ఉండాలన్నారు. జిల్లా పోలీస్ అధికారులు వాటిని తరచూ తనిఖీ చేస్తూ ఉండాలన్నారు. . ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. గతంలో నేరాలకుమరల ఏమైనా చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనే అవకాశం ఉన్న వారిపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. వారి కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. ఏదైనా నేరంలో పాల్పడే అవకాశం ఉందని సమాచారం తెలిస్తే వెంటనే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని నేరాలను కట్టడి చేయాలన్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎంతమంది పాత నేరస్తులు, రౌడీ షీటర్లు, చెడు నడత కలిగిన వ్యక్తులు ఉన్నారు, వారి వివరాలు సంబంధిత స్టేషన్ ఎస్.హెచ్.ఓ కు పూర్తిగా తెలిసి ఉండాలన్నారు. ఏప్పుడైతే నేరస్తుల గురించిన పూర్తి సమాచారం ఉంటుందో అప్పుడు నేరాలను సమర్థవంతంగా కట్టడం చేయడానికి సంబంధిత ఎస్.హెచ్.ఓ కి అవకాశం ఉంటుందన్నారు.సోషల్ మీడియా పై నిఘా ఉంచాలన్నారు. ఎవరైనా ప్రజల మధ్య, రాజకీయ పార్టీల మధ్య, కులాల మధ్య వర్గల మధ్య రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టిన, ఇతరుల మనోభావాలకు భంగం కలిగే విధంగా వార్తలు వ్యాపింప చేసిన అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.. ప్రతి పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ తమ పరిధిలోని గ్రామాలను తరచు సందర్శిస్తూ ఉండాలన్నారు. తద్వారా నేరాలను అరికట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. అంతేకాకుండా గ్రామంలో జరిగే కోడిపందాలు పేకాట ఇతర చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాల గురించిన సమాచారం కూడా వేగంగా చేరుతుందన్నారు.నేరాలను కట్టడి చేయడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఎక్కడైతే సీసీ కెమెరాలు ఉంటాయో ఆ ప్రదేశాలలో నేరస్తులు నేరాలు చేయాలంటే భయపడే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఉండాలన్నారు.బాపట్ల జిల్లాలో మొత్తం 17 పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రోన్ లు ఉన్నాయన్నారు. సంబంధిత పోలీస్ అధికారులు వారి స్టేషన్ పరిధిలోని నిర్మానుష్య ప్రదేశాలు, బహిరంగ ప్రదేశాలలో, నిరుపయోగంగా ఉన్న భవనాలు, అసాంఘిక కార్యకలాపాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రదేశాలలో డ్రోన్ లను ఎగురవేసి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు.అదేవిధంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిని కూడా గుర్తించి అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. నైట్ బీట్, పెట్రోలింగ్ పటిష్టంగా నిర్వహించాలన్నారు. స్టేషన్ ఎస్.హెచ్.ఓ కూడా తప్పనిసరిగా రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసు అధికారులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. దీనిలో భాగంగా వాహన తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రోడ్డు భద్రత నియమాల గురించి, సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా విక్రయాలను కట్టడి చేసేందుకు తగిన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉందన్నారు. సైబర్ నేరాలు కూడా అదే రీతిలో పెరుగుతున్నాయన్నారు. సైబర్ నేరాల బారిన ప్రజలు పడకుండా వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి పోలీస్ అధికారి వారి పరిధిలోని పాఠశాలలు, కళాశాలలో ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతాయి, ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటే ప్రజలు వాటి బారిన పడకుండా ఉంటారు, బాపట్ల జిల్లాలో మొత్తం ఐదు శక్తి బృందాలు ఉన్నాయన్నారు. ప్రతి శక్తి బృందానికి ఒక ఎస్సై స్థాయి అధికారి నాయకత్వం వహిస్తున్నారన్నారు. శక్తి బృందం సభ్యులు తరచు తమ పరిధిలోని పాఠశాలలు, కళాశాలను సందర్శిస్తూ శక్తి యాప్ గురించి, మహిళ సంబంధిత చట్టాల గురించి, సైబర్ నేరాల గురించి మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ నేర సమీక్ష సమావేశంలో రేపల్లె, బాపట్ల, చీరాల డిఎస్పీలు ఏ.శ్రీనివాసరావు, జి.రామాంజనేయులు, ఏమ్.డి. మోయిన్, సిసిఎస్ డిఎస్పి పి. జగదీష్ నాయక్, డిసిఆర్బి డిఎస్పి బాలమురళీకృష్ణ, జిల్లాలోని సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## డాక్టర్ రూత్‌రాణిని కలిసిన బసవపున్నారెడ్డి



పొన్నూరు, అక్టోబరు 10,ప్రభాతవార్త: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ సభ్యురాలుగా నియామకమైన మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణిని వైకాపా చీరాల, పర్చూరు నియోజకవర్గాల పరిశీలకుడు మోదుగుల బసవపున్నారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. రూత్‌రాణికి రాష్ట్రస్థాయిలో పదవి రావడం ఆమె పార్టీకి చేసిన సేవలే కారణమన్నారు. డాక్టర్ రూత్‌రాణి మునిసిపల్ ఛైర్‌పర్సన్‌గా అనేక సేవలు అందించారన్నారు. అదేవిధంగా వైకాపా ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి విశేషంగా సేవలందించారన్నారు. బాపట్ల నియోజకవర్గ పరిశీలకురాలుగా కూడా పనిచేశారన్నారు. రూత్‌రాణి చేసిన సేవలకు గుర్తింపుగా పార్టీ అధిష్టానం రాష్ట్రస్థాయిలో ఎగ్జిక్యూటీవ్ సభ్యురాలుగా నియమించిందన్నారు. పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు పార్టీ నాయకులను, కార్యకర్తలను, అభిమానులను కలుపుకొని ముందుకు సాగాలని మోదుగుల బసవపున్నారెడ్డి రూత్‌రాణికి సూచించారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

## ఉద్యం రిజిస్ట్రేషన్‌కు అధిక ప్రాధాన్యత

పొన్నూరు, అక్టోబరు 10,ప్రభాతవార్త: ఉద్యం రిజిస్ట్రేషన్ చేసుకొన్న వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉద్యం పథకానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఉద్యం పథకం రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లయితే తద్వారా లభించే సర్టిఫికెట్ ద్వారా భవిష్యత్‌లో సూక్ష్మ,




చిన్న, మధ్య తరహా వ్యాపారులు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం, ఇతర ప్రయోజనాలు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. ఉద్యం పథకం రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు, సిబ్సిడీలకు అర్హులని చెప్పారు. బ్యాంకుల నుంచి రుణాలు సులభంగా లభిస్తాయన్నారు. ప్రభుత్వ టెండర్లలో కూడా ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డిడివి నారాయణరావు, ఎంపిఎం జోజిబాబు తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలపై అవగాహన కలిగి ఉండాలి: ఐసిడిఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ కుమారి

పొన్నూరు, అక్టోబరు 10,ప్రభాతవార్త: ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్ వైజర్ కుమారి అన్నారు. మండల పరిధిలోని దండమూడి ఎంపియూపి పాఠశాలలో శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. 19సంవత్సరాలు నిండిన స్త్రీ, పురుషులకు మాత్రమే వివాహం జరిపించాలన్నారు. మైనార్టీ తీరకుండా వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు నిర్వహించేవారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే ఏ శాఖాధికారులకైనా సమాచారం తెలియజేయవచ్చున్నారు. సదస్సులో చైల్డ్ ప్రొటక్షన్ కమిటి సభ్యులు రవికుమార్, భార్గవి, అంగన్‌వాడీ కార్యకర్త పిడి విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు ప్రయోజనం: నరేంద్ర



పొన్నూరు, అక్టోబరు 10,ప్రభాతవార్త: జీఎస్టీ తగ్గింపు ద్వారా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. స్థానిక షాదీఖానాలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌లో భాగంగా శుక్రవారం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే ధూళిపాళ్ళ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర మాట్లాడుతూ మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలను మార్చాలనే ఉద్దేశంతోనే జీఎస్టీలో అనేక సంస్కరణలు తీసుకురావడం జరిగిందన్నారు. జీఎస్టీని తగ్గించడం ద్వారా సామాన్యులకు ఆర్థికంగా ప్రయోజనం కలుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఒక వైపు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూ మరో పక్క జీఎస్టీలో సంస్కరణలు తెచ్చి ఆర్థికంగా పేదలను బలోపేతం చేస్తుందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగినప్పుడే రాష్ట్రాలు, దేశాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకే ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, వాణిజ్యపన్నుల శాఖాధికారులు, మెప్మా సిబ్బంది, నాయకులు పఠాన్ పిరోజ్‌ఖాన్, షేక్ బాజిసాహెబ్, తోట ప్రసాద్, కత్తుల రవికిరణ్, మాదల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, బండ్లమూడి బాబూరావు, ఎరువులషాపు ప్రొప్రయిటర్ షేక్ కరీముల్లా, బండారుపల్లి శ్రీనివాసరావు, పఠాన్ అహమ్మద్‌ఖాన్, గోవాడ వెంకటకృష్ణారావు, ఆకుల సాంబశివరావు, గురుబాలు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు: అర్బన్ సిఐ వీరానాయక్




పొన్నూరు, అక్టోబరు 10,ప్రభాతవార్త: యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని-జీవితాన్ని నాశనం చేసుకోవద్దని అర్బన్ సిఐ లావూరి వీరానాయక్ సూచించారు. స్థానిక సుజాత కళాశాలలో మాదక ద్రవ్యాల(డ్రగ్స్) దుష్ప్రభావాలపై జిల్లా ఈగల్ సెల్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వీరానాయక్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలు కావడం వల్ల శారీరక, మానసిక స్థితిని కోల్పోతారని, సమాజంలో అగౌరవ భావానికి గురవుతారన్నారు. డ్రగ్స్ అనేవి తాత్కాలిక ఆనందాన్ని మాత్రమే ఇస్తాయని, కానీ జీవితాన్ని నాశనం చేసే ప్రమాదకరమైన వ్యవసనమన్నారు. యువత మానసిక ఒత్తిడిలు, ఫ్యాషన్ పేరుతో, స్నేహితుల ఒత్తిడికి లోనై డ్రగ్స్ వైపు అడుగులు వేయకూడదన్నారు. సోషల్ మీడియా, ఇంటర్నెట్ ద్వారా వ్యసనాలకు దారితీసే ప్రలోభాలకు లోను కాకుండా, క్రీడలు,సంగీతం, పుస్తక పఠనం వంటి మంచి అలవాట్ల వైపు పయనించాలన్నారు. ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నారని, విక్రయిస్తున్నారని తెలిసిన పక్షంలో వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. డ్రగ్స్ మాదక ద్రవ్యాలపై సమాచారం ఉన్నచో ఈగల్ టోల్ ఫ్రీ నెం:1972కి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సదస్సులో పట్టణ ఎస్సై వాగాల శ్రీహరి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా 'మెంటల్ హెల్త్ డే'

పొన్నూరు, అక్టోబరు 10,ప్రభాతవార్త: లయన్స్‌క్లబ్ ఆఫ్ పొన్నూరు స్వర్ణపురి మహిళ ఆధ్వర్యంలో శుక్రవారం మెంటల్ హెల్త్ డే కార్యక్రమం ఆలపాటి సుబ్బారాయుడు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ స్వర్ణపురి మహిళ అధ్యక్షురాలు బేతాళ ఝాన్సీరాణి మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ఉండేందుకు ప్రతి నిత్యం కొంత




సమయాన్ని యోగాకు కేటాయించాలన్నారు. నేటి విద్యార్థులు చిన్న చిన్న సమస్యలకు కూడా విపరీతమైన మానసిక ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. ఒత్తిడికి లోనవడం వల్ల చదివినవి సరిగ్గా గుర్తుండవన్నారు. అందుకే విద్యార్థులు రోజులో కొంత సమయాన్ని ఆటలకు కేటాయిస్తే ఒత్తిడి నుంచి తప్పుకోవచ్చున్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల మానసిక ప్రవర్తనను గుర్తించి, వారిని సక్రమమైన మార్గంలో వెళ్ళేవిధంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యోగా గురువు బి.నాగమంజరి విద్యార్థులు ఒత్తిడి నుంచి ఏ విధంగా బయటపడవచ్చునో అందుకు సంబంధించిన కొన్ని చిట్కాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షురాలు మన్నవ అనసూయాదేవి, కోశాధికారి పి.నిర్మలాదేవి, బి.శబలాదేవి, పి.మోహనలక్ష్మి, ఎం.అమరేశ్వరి, కె.విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దీపికా పదుకొణే 8 గంటల వర్క్.. సంచలన కామెంట్స్ వైరల్





ఈ మధ్య కాలంలో ఇండియన్ సినిమా దగ్గర సెన్సేషన్ గా వైరల్ అయ్యిన హీరోయిన్ ఎవరైనా ఉన్నారు అంటే అది దీపికా పదుకోణే అనే చెప్పాలి. పలు సినిమాల నుంచి ఆమెని తొలగించడం ఆమె పెట్టిన కండిషన్స్ వంటివి వైరల్ గా మారాయి. అయితే అవి అప్పటికి టాక్ మాత్రమే కానీ అసలు దీనిపై ఆమె ఓపెన్ అయ్యి మళ్ళీ చేసిన పలు షాకింగ్ కామెంట్స్ వైరల్ గా మారాయి. దీనితో ఆమె కేవలం 8 గంటలు మాత్రమే షూటింగ్ లో పాల్గొంటాను అని చెప్పింది నిజమే అని తెలిపింది. అయితే ఇండియన్ సినిమా దగ్గర ఎంతో మంది సూపర్ స్టార్ హీరోలు కూడా కేవలం 8 గంటలు మాత్రమే వర్క్ చేస్తారు, వీకెండ్స్ షూటింగ్ లో పాల్గొనరు ఈ విషయం ఎందుకు హెడ్ లైన్స్ ఎక్కలేదు అనేది మాత్రం అర్థం కాదని ఆమె తెలిపింది. అంతే కాకుండా ఇండియన్ సినిమాపై కూడా పలు సంచలన కామెంట్స్ చేయడం జరిగింది. మన ఇండస్ట్రీ ఒక వ్యవస్థ లేని ఇండస్ట్రీ అని ఒక సిస్టం ఇక్కడికి తీసుకురావాలని కామెంట్స్ చేయడం జరిగింది. దీనితో తన నుంచి ఈ షాకింగ్ కామెంట్స్ ఇపుడు వైరల్ గా మారాయి.

## 'డ్యూడ్' ఫ్యామిలీ ఎంటర్‌టైనర్
### ఈవెంట్ లో హీరో ప్రదీప్ రంగనాథన్



రంగనాథన్, మమిత బైజు, కీర్తిశ్వరన్, మైత్రి మూవీ మేకర్స్ పాన్ ఇండియా ఫిల్మ్ 'డ్యూడ్' టాప్ లెవల్ ఎంటర్‌టైన్‌మెంట్ ట్రైలర్ లాంచ్ లవ్ టుడే, డ్రాగన్‌లతో రెండు వరుస హిట్‌లను అందించిన యూత్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ డ్యూడ్‌తో దీపావళికి ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. అక్టోబర్ 17న తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కి సిద్ధమవుతున్న 'డ్యూడ్' ఈ సీజన్‌ను నవ్వులు, మ్యూజిక్, ఎమోషన్స్‌తో అలరించనుంది.
ట్రైలర్ లాంచ్ ఈవెంట్లో హీరో ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. సినిమా ప్రమోషన్స్‌కి వస్తున్న రెస్పాన్స్ చాలా ఆనందంగా ఉంది. ఈవెంట్లకు వెళ్తున్నప్పుడు ఆడియన్స్ ఇంత పెద్ద స్థాయిలో రావడం నాకు చాలా సర్ప్రైజింగ్ అనిపించింది. ఇంత ప్రేమని అందిస్తున్న ప్రేక్షకులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. మైత్రి మూవీ మేకర్స్ నవీన్‌కి రవికి థాంక్యూ. మైత్రి మూవీ మేకర్స్ బిగ్గెస్ట్ ప్రొడక్షన్ హౌస్ ఇన్ ఇండియా. సినిమాల్లో చాలా డ్రామా ఎమోషన్ ఉంటుంది. మీరు ఊహించని ఎలిమెంట్స్ ఉంటాయి. సినిమాలో అద్భుతమైన క్యారెక్టర్ చేసిన శరత్ కుమార్‌కి థాంక్యూ ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్. యూత్ తో పాటు ఫ్యామిలీస్ సినిమాని ఇష్టపడతారు. దీపావళికి సినిమా రిలీజ్ అవుతుంది. ఈసినిమాతో పాటు రిలీజ్ అవుతున్న తెలుసు కదా, మిత్రమండలి, కేర్యాంప్, సినిమాలు అద్భుతంగా ఆడాలనికోరుకుంటున్నాను.'డ్యూడ్' సినిమా కచ్చితంగా తెలుగు ఆడియన్స్‌కి నచ్చుతుంది.యాక్టర్ శరత్ కుమార్ మాట్లాడుతూ,అందరికీ నమస్కారం. 'డ్యూడ్' సినిమా ఒక మంచి వైబ్. ట్రైలర్లో మీరు చూసింది 10 శాతమే. ఈ సినిమా గ్యారంటీ హిట్టు. ఈ సినిమాలో చాలా మంచి ఎంటర్టైన్మెంట్ ఉంది. చాలా కొత్త కథ ఇది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. రవికి థాంక్యూ. ప్రదీప్ ఈ సినిమాతో అందరినీ ఎంటర్టైన్ చేస్తాడు. ఇది హోల్సమ్ ఎంటర్టైనర్. దీపావళికి వస్తున్న సినిమాలన్నీ కూడా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను. అందరూ థియేటర్స్‌లో సినిమా చూసి ఎంజాయ్ చేయాలని ఆశిస్తున్నాను.

## ఎస్ఎల్‌వి సినిమాస్ ఫారిన్ షెడ్యూల్ ప్రారంభం



మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో హోల్సమ్ ఎంటర్‌టైనర్ ఆర్‌టి76 చేస్తున్నారు. ఎస్ఎల్‌టి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను బిగ్‌కాన్వాస్‌పై స్టైలిష్‌గా రూపొందిస్తున్నారు. టీమ్ ప్రస్తుతం కీలక ఫారిన్ షెడ్యూల్‌కి షిఫ్ట్ అయ్యింది. గత కొన్ని రోజులుగా స్పెయిన్‌లోని వాలెన్షియా, సమీప దీవుల్లో లొకేషన్ రికీ పనులు పూర్తి చేశారు. ఈ రోజు నుంచి షూటింగ్ ప్రారంభమవుతోంది.
అనంతరం జెనీవా, ఫ్రాన్స్‌లో కూడా కీలకమైన సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. మొత్తం 25 రోజుల ఈ షెడ్యూల్‌లో కీలక టాకీ పార్ట్‌లతో పాటు శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీతో రెండు పాటలు చిత్రీకరించబోతున్నారు. ఈ సినిమాకి సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సెసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు.ఎలక్ట్రిక్ ఎనర్జీతో ప్రేక్షకులను అలరించే రవితేజ ఈ సినిమాలో న్యూ స్టైలిష్ లుక్‌లో కనిపించనున్నారు. ఇది హ్యూమర్, ఎమోషన్, రవితేజ మాస్ ఎలిమెంట్స్‌తో ఫుల్‌ఫ్లెడ్జ్ ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కుతోంది.ఎమోషనల్ కథలతో అలరించే దర్శకుడు కిశోర్ తిరుమల ఈ చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకుల ఆకట్టుకునేలా రూపొందిస్తున్నారు.ఈ సినిమాకి సినిమాటోగ్రఫీని ప్రసాద్ మూరెళ్ళ. నేషనల్ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్. ఏఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్.టైటిల్, ఫస్ట్ లుక్, ఇతర నటీనటుల వివరాలు త్వరలోనే మేకర్స్ తెలియజేయనున్నారు. తారాగణం: రవితేజ, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: కిషోర్ తిరుమల,నిర్మాత: సుధాకర్ చెరుకూరి,బ్యానర్: ఎస్ఎల్‌వి సినిమాస్, డివోపి: ప్రసాద్ మూరెళ్ల,సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్ ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్,ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: విజయ్ కుమార్ చాగంటి,పీఆర్వో: వంశీశేఖర్

## రాజమౌళి పుట్టినరోజున ఒకే ఒక్కడు అంటూ మహేశ్ బాబు ట్వీట్



రాజమౌళి 52వ పుట్టినరోజు సినీ ప్రముఖుల నుంచి వెల్లువెత్తుతున్న శుభాకాంక్షలు 'ఒకే ఒక్కడు' అంటూ మహేశ్ బాబు ట్వీట్
తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేసిన దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ఈరోజు తన 52వ జన్మదినాన్ని జరుపుకుంటున్నారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ఆయనకు సినీ ప్రముఖులు, అభిమానుల నుంచి సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. స్టార్ హీరో మహేశ్ బాబు కూడా ఆయన బర్త్ డే విషెస్ తెలిపారు.రాజమౌళికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ మహేష్ బాబు 'ఎక్స్' (ట్విట్టర్) లో ఓ ప్రత్యేకమైన పోస్ట్ చేశారు. ఒకే ఒక్కడు ఎస్.ఎస్. రాజమౌళికి జన్మదిన శుభాకాంక్షలు! మీకు భవిష్యత్తులో అన్నీ ఉత్తమంగానే జరగాలని ఆశిస్తున్నాను. అద్భుతమైన పుట్టినరోజు జరుపుకోండి సర్' అంటూ మహేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రస్తుతం వీరిద్దరి కాంబినేషన్‌లో ఎస్ఎస్ఎంబి 29 అనే వర్కింగ్ టైటిల్‌తో ఓ భారీ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మహేశ్ చేసిన పోస్ట్ ప్రాధాన్యత సంతరించుకుంది.

## 'మిత్రమండలి'సినిమా చూసి ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేస్తారు



నిర్మాతలు : కళ్యాణ్ మంతెన. భాను ప్రతాప

నిర్మాతలు కళ్యాణ్ మంతెన, భాను ప్రతాప.. ప్రియదర్శి, నిహారిక ఎన్ ఎం హీరో హీరోయిన్లుగా విజయేందర్ దర్శకత్వంలో బీవీ వర్క్స్ బ్యానర్ మీద బన్నీ వాస్ సమర్పణలో సప్తాస్వ మీడియా వర్క్స్ మీద కళ్యాణ్ మంథిన, భాను ప్రతాప, డా. విజేందర్ రెడ్డి తీగల నిర్మించిన చిత్రం 'మిత్ర మండలి'. ఈ మూవీ అక్టోబర్ 16న రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో నిర్మాతలు కళ్యాణ్ మంథిన, భాను ప్రతాప మీడియాతో ముచ్చటించారు. వారు చెప్పిన విషయాలు, విశేషాలు. **'మిత్ర మండలి' కథ మీ వద్దకు ఎలా వచ్చింది? ఈ జర్నీ ఎలా ప్రారంభమైంది.**

బన్నీవాస్ మాకు మంచి స్నేహితులు. గీతా ఆర్ట్స్‌లో మేం చాలా కాలం ఆయనతో పాటుగా పని చేశాం. "కోటబొమ్మాళీ, పీఎస్, ఆయ్, తండేల్, సింగిల్" ఇలా చాలా చిత్రాల్ని చేశాం. వాసు ఈ కథతో చాలా ఏళ్లుగా ట్రావెల్ అవుతున్నారు. ఓ సారి మా ఇద్దరినీ ఈ కథ వినమని చెప్పారు. కళ్యాణ్ ఎక్కువగా వ్యాపారాల్లో బిజీగా ఉంటారు. మేం ఇద్దరం ప్రొడక్షన్ కంపెనీ స్టార్ట్ చేయాలని అనుకున్నాం. ఆ టైంలో ఈ కథను విన్నాం. ఈ మూవీతో పాటుగా మరో రెండు ప్రాజెక్టుల్ని కూడా స్టార్ట్ చేశాం. వాసు వల్లే ఈ కథ మాకు వచ్చింది.

**దర్శకుడు విజయేందర్ గురించి చెప్పండి?**

విజయేందర్ మంచి దర్శకుడు. అనుదీప్, మ్యాడ్ కళ్యాణ్, ఆదిత్య హాసన్‌లతో విజయేందర్ పని చేశాడు.

**దీపావళికి పోటీ చాలానే ఉంది కదా?**

దీపావళి పండుగ వాతావరణంలో ఎన్ని మంచి చిత్రాలు వచ్చినా జనాలు చూస్తారు. మంచి సినిమాను ఆడియెన్స్ కచ్చితంగా చూస్తారు. ఆ నమ్మకంతోనే మా మూవీని దీపావళి సీజన్‌లోకి తీసుకు వస్తున్నాం.

## ఫంకీ టీజర్ విడుదల



థియేటర్లలో వినోదాల విందుకి హామీ ఇచ్చేలా చిగ'ఫంకీ' టీజర్.వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కథానాయకుడు విశ్వక్ సేన్, హాస్య చిత్రాలకు చిరునామాగా మారిన దర్శకుడు కె.వి. అనుదీప్ కలయికలో రూపొందుతోన్న చిత్రం'ఫంకీ'. ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ చిత్ర టీజర్ తాజాగా విడుదలైంది. అనుదీప్ దర్శకత్వంలో వినోదం ఏ స్థాయిలో ఉంటుందో తెలిపేలా 'ఫంకీ' టీజర్ ఎంతో హాస్యభరితంగా, ఓ విందు భోజనంలా ఉంది.ఈ చిత్రంలో విశ్వక్ సేన్ దర్శకుడి పాత్రను పోషిస్తుండటం విశేషం. ఇందులో విశ్వక్ సరికొత్తగా కనిపిస్తున్నారు. కథానాయిక కయాదు లోహర్ తన అందంతో కట్టిపడేశారు. వీరి జోడి కొత్తగా, ఉత్సాహంగా కనిపిస్తూ.. తెరకు మరింత అందాన్ని తీసుకొచ్చింది. టీజర్ లో భీమ్స్ సిసిరోలియో సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తనదైన నేపథ్య సంగీతంతో ప్రతి షాట్‌ను మరో స్థాయికి తీసుకెళ్ళారు. మొత్తానికి టీజర్ మళ్ళీ మళ్ళీ చూడాలి అనిపించేలా ఉండటమే కాకుండా, సినిమా పట్ల ప్రేక్షకుల ఆసక్తిని రెట్టింపు చేస్తోంది.దర్శకుడు అనుదీప్ శైలి ప్రత్యేక వినోదం టీజర్ లో అడుగడుగునా కనిపించింది. ఈసారి ఆయన రెట్టింపు వినోదాన్ని అందించబోతున్నారని స్పష్టంగా తెలుస్తుంది. అనుదీప్ దర్శకత్వం వహించిన 'జాతిరత్నాలు' ఏ స్థాయిలో నవ్వులను పంచిందో తెలిసిందే. ఇప్పుడు అంతకుమించిన స్థాయిలో నవ్వులను పంచి, ప్రేక్షకులకు సరికొత్త వినోద విందుని అందించేలా దర్శకుడు అనుదీప్ 'ఫంకీ' చిత్రాన్ని మలుస్తున్నారు.నవీన్ నూలి ఎడిటింగ్ కథనం యొక్క వేగాన్ని పదునుగా, ఆకర్షణీయంగా ఉంచుతుందని హామీ ఇస్తుంది. అలాగే రచయితలు అనుదీప్ కె.వి., మోహన్ సాటోల చమత్కారమైన రచన, హాస్యం యొక్క మరొక పొరను జోడిస్తుంది. సురేష్ సారంగం కెమెరా పనితనం 'ఫంకీ' టీజర్ ని మరింత అందంగా మలిచింది. చిత్ర కథకి తగ్గట్టుగా ప్రతి ఫ్రేమ్ అందంగా కనిపిస్తూ, విజువల్ గా అద్భుతంగా ఉంది.

## ఆంధ్రా కింగ్ టీజర్ 12న రిలీజ్



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని, మహేష్ బాబు పి, మైత్రి మూవీ మేకర్స్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని మోస్ట్ ఎవైటెడ్, యూనిక్ ఎంటర్‌టైనర్ ఆంధ్రా కింగ్ తాలూక. మహేష్ బాబు పి దర్శకత్వంలో, ప్రముఖ బ్యానర్ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 28న గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది.ఈ రోజు అంధ్ర కింగ్ తాలూకా టీమ్ బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ చిత్ర టీజర్‌ను అక్టోబర్ 12న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. టీజర్ పోస్టర్‌లో రామ్, భాగ్యశ్రీ ఇద్దరూ నవ్వుతూ కనిపించగా, వారి మధ్యలో ప్రొజెక్టర్ లైట్ బీమ్ కనిపించడం సినిమాటిక్ థీమ్‌ను ప్రజెంట్ చేస్తోంది. ఇప్పటికే వివేక్ మెర్విన్ అందించిన మొదటి రెండు పాటలతో టీం హ్యూజ్ హైప్ క్రియేట్ చేసింది. ఫస్ట్ సింగిల్ నువ్వుంటే చాలే ద్వారా రామ్ తన సింగింగ్ డెబ్యూ చేస్తూ అందరినీ ఆకట్టుకున్నాడు. ఈ పాట ప్రేక్షకుల మనసులను దోచుకుని బిగ్గెస్ట్ మ్యూజికల్ హిట్‌గా నిలిచింది. రెండవ పాట పప్పీ షేమ్ డిఫరెంట్వైబ్ తో అదిరిపోయింది. ఈ సాంగ్‌కి రామ్ స్వయంగా వాయిస్ ఇచ్చారు.ఉపేంద్ర ఈ చిత్రంలో సూపర్ స్టార్‌గా కీలక పాత్ర పోషిస్తున్నారు. రావు రమేష, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, విటివిగణేష్ ముఖ్యమైన పాత్రల్లో కనిపిస్తున్నారు. టాప్ టెక్నికల్ టీం ఈ సినిమాకి పని చేస్తున్నారు. సిద్ధార్థ నుని సినిమాటోగ్రఫీని నిర్వహిస్తు న్నారు. శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్,తారాగణం: రామ్ పోతినేని, ఉపేంద్ర, భాగ్యశ్రీ బోర్సే, రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, విటివి గణేష్.

## శ్రీ పద్మాలయ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న చిత్రం 'ఎర్రచీర'



బేబి ఢమరి సమర్పణలో శ్రీ పద్మాయల ఎంటర్టైన్మెంట్స్ శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'ఎర్రచీర'. ఈ సినిమాలో నటుడు రాజేంద్రప్రసాద్ ముద్దుల మనవరాలు బేబీ సాయి తేజస్విని నటించింది. 'ఎర్రచీర' మూవీకి సుమన్ బాబు స్వీయ దర్శకత్వం వహిస్తూ ఒకముఖ్య పాత్ర పోషించారు. మదర్ సెంటిమెంట్, హార్రర్, యాక్షన్ కథతో ఈ సినిమా తెరకెక్కింది. అయితే ఈ సినిమాలో హారర్ సన్నివేశాలు ఎక్కువ ఉన్న కారణంగా ఈ సినిమా చూసిన సెన్సార్ వారుతి సర్టిఫికెట్ ఇచ్చారు. హార్ట్ పేషెంట్స్ ఈ సినిమానికి చూడటానికి వచ్చినప్పుడు మాత్రం తగు జాగ్రత్తలు తీసుకుని రావలసిందిగా చిత్ర దర్శకుడు సుమన్ బాబు తెలిపారు.ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలో ఒకరైన ఎన్. వి.వి. సుబ్బారెడ్డి ( సుభాష్) మాట్లాడుతూ,'సినిమా కంటెంట్ డివోషనల్ టచ్ ఉన్న కంటెంట్ కావడంతో ఈ సినిమాని కార్తీక మాసం సందర్భాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 24వ తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. ఇంటర్వెల్ బ్యాంగ్, క్లైమాక్స్ హైలైట్ గా నిలుస్తాయి అన్నారు.

## బాక్సాఫీస్ వద్ద 'కాంతార చాప్టర్ 1' ప్రభంజనం




'కాంతార: చాప్టర్ 1 చిత్రం విడుదలైన 9 రోజుల్లోనే రూ.509 కోట్ల గ్రాస్ వసూళ్లు కొత్త పోస్టర్‌తో అధికారికంగా ప్రకటించింది చిత్ర యూనిట్.
వీకన్నడ నటుడు రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో రూపొందించిన 'కాంతార: చాప్టర్ 1' చిత్రం బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. 'కాంతార' సినిమాకు ప్రీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం, విడుదలైన తొలి రోజు నుంచే వసూళ్ల వర్షం కురిపిస్తోంది. తాజాగా ఈ సినిమా మరో అరుదైన మైలురాయిని చేరుకుంది. విడుదలైన కేవలం9 రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ. 509 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించిందని చిత్రబృందం అధికారికంగా వెల్లడించింది. దసరా పండుగ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం, అంచనాలకు మించి అద్భుతమైన విజయాన్ని అందుకుంది. సినిమా విజయాన్ని పురస్కరించుకుని, చిత్రయూనిట్ ఈ భారీ వసూళ్ల వివరాలతో కూడిన ఒక కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది.'కాంతార' మొదటి భాగానికి ముందు జరిగిన కథాంశంతో తెరకెక్కిన ఈ ప్రీక్వెల్, ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.
మరోవైపు, ఈ వారాంతంలో బాక్సాఫీస్ వద్ద పెద్ద సినిమాల సందడి ఏమీ లేదు. దీంతో 'కాంతార: చాప్టర్ 1' చిత్రానికి థియేటర్లలో అడ్డే లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో సినిమా కలెక్షన్లు మరింత పెరిగి, రానున్న రోజుల్లో ఇంకెన్నో కొత్త రికార్డులను సృష్టించే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## 'డ్యూడ్'లో చాలా క్రూషియల్ క్యారెక్టర్ చేశా: శరత్‌కుమార్



లవ్ టుడే, డ్రాగన్‌లతో రెండు వరుస హిట్‌లను అందించిన యూత్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ డ్యూడ్‌తో దీపావళికి ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్ గా పరిచయం అవుతున్నారు. ప్రేమలు అద్భుతమైన విజయం తర్వాత ప్రదీప్ సరసన మమిత బైజు నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా సాంగ్స్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. ట్రైలర్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. అక్టోబర్ 17న తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా శరత్ కుమార్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

డ్యూడ్ కథ వినప్పుడు ఎలా అనిపించింది?

కథలో ముఖ్య భాగమయ్యే పాత్రలు చేయడానికి ఇష్టపడతాను. డైరెక్టర్ కీర్తిశ్వరన్ డ్యూడ్ కథ చెప్పారు. కథ అద్భుతంగా వుంది. ప్రదీప్‌కి అంకుల్ గా కనిపిస్తాను. నా పాత్ర కథలో చాలా క్రూషియల్. చాలా కొత్త పాయింట్. ఒక ఫ్యామిలీలో ఇలాంటి ఒక మేటర్ జరిగితే సొసైటీ ఎలా రియాక్ట్ అవుతుందనే కోణంలో డైరెక్టర్ చాలా అద్భుతంగా ప్రజెంట్ చేశారు.

ఈ క్యారెక్టర్ చేయడం ఎలా అనిపించింది?

ఈ క్యారెక్టర్ చేయడం చాలా ఎక్సయిటింగ్ గా అనిపించింది. చాలా డిఫరెంట్ షేడ్స్ వుంటాయి. అలాంటి క్యారెక్టర్ ని ప్లే చేయడం కూడా చాలా డిఫికల్ట్.

డ్యూడ్ ఎలాంటి ఫిల్మ్?

ఇది చాలా ఎమోషనల్ ఫిల్మ్. ఆడియన్స్ చాలా కొత్తగా ఫీల్ అవుతారు.

మ్యూజిక్ గురించి?

సాయి అభ్యంకర్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. చాలా ట్యాలెంటెడ్ కంపోజర్. ఈ సినిమాకి తన మ్యూజిక్ బిగ్ ఎసెట్.

మైత్రీ మూవీ మేకర్స్ గురించి?

మైత్రీ మూవీమేకర్స్ చాలా పెద్ద ప్రొడ్యూసర్స్.డైరెక్టర్ కి కంప్లీట్ ఫ్రీడమ్ ఇచ్చారు.

మీ డ్రీం రోల్?

సుభాస్ చంద్రబోస్ బయోపిక్ చేయాలని వుంది. ఆ అవకాశం రావాలని కోరుకుంటున్నాను .

11-10Pg5 9_11-10Pg5.qxd 10/10/2025 10:20 PM Page 1



# 50 సంస్థలు, వ్యక్తులపై అమెరికా ఆంక్షలు..

## జాబితాలో భారతీయులు!

**వాషింగ్టన్, అక్టోబరు 11:** ఇరాన్ నుంచి చమురు కొనుగోలు, మార్కెటింగ్ చేస్తున్నారన్న అభియోగాలపై 50కి పైగా సంస్థలు, వ్యక్తులపై అమెరికా ఆంక్షలు విధించింది. ఈ జాబితాలో భారతీయుల పేర్లు కూడా ఉండటం గమనార్హం. అమెరికా ట్రెజరీ కార్యాలయం ఈ విషయాన్ని ఓ ప్రకటనలో వెల్లడించింది. కొందరు బిలియన్ డాలర్ల విలువైన ఇరాన్ చమురు, లిక్విడ్ గ్యాస్ కొనుగోలు, మార్కెటింగ్‌తో దాని పాలనకు ఆదాయాన్ని సమకూరుస్తున్నారని అందులో పేర్కొంది. దీంతోపాటు అమెరికాకు వ్యతిరేకంగా తీవ్రవాద గ్రూపులకు మద్దతిస్తున్నారని ఆరోపించింది. ఈ సందర్భంగా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ మాట్లాడుతూ.. ఇరాన్ ఇంధన ఎగుమతులను నిర్వీర్యం చేయడంతోపాటు దానికి అందే నగదు ప్రవాహాన్ని అడ్డుకునేందుకు ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. అధ్యక్షుడు ట్రంప్ ఆధ్వర్యంలోని పరిపాలన అమెరికాను బెదరించే ఉగ్రవాద గ్రూపులకు నిధులు అందకుండా దెబ్బతీయడమే లక్ష్యంగా ఉందన్నారు. అమెరికా తాజాగా విధించిన ఆంక్షల జాబితాలో భారతీయులైన వరుణ్ పులా, సోనియా శ్రేష్ఠ, అయ్యప్పన్ రాజాలు కూడా ఉన్నారు. ఇరాన్ చమురు ఉత్పత్తులను తరలించే షిప్పింగ్‌కు సంబంధించి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వీరి ప్రమేయం ఉన్నందున ఈ ఆంక్షలు విధించినట్లు ట్రెజరీ తెలిపింది. డిపార్ట్‌మెంట్ వివరాల ప్రకారం.. వరుణ్‌పులా సంస్థకు చెందిన ఓ నౌక గతేడాది జూలైలో ఇరాన్‌కు చెందిన నాలుగు మిలియన్ బ్యారెల్స్ ఎల్‌పిజీని చైనాకు రవాణా చేసినట్లు తెలుస్తోంది. అయ్యప్పన్ రాజా సంస్థకు చెందిన నౌక కూడా ఏప్రిల్‌లో ఇరాన్‌కు చెందిన ఎల్‌పిజిని చైనాకు రవాణా చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. సోనియా శ్రేష్ఠకు చెందిన సంస్థ కూడా టెల్‌అవీవ్ ఎల్‌పిజిని పాక్‌కు రవాణా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే యుఎస్ ట్రెజరీ వీరిపై ఆంక్షలు విధించింది.



# 'శాంతి' వెనుక రాజకీయమేనా?

## ట్రంప్ సహా శ్వేతసౌధం ప్రతినిధుల విమర్శలు

### గడువు దాటాకే తమకు ఎండార్స్‌మెంట్‌లు వచ్చాయన్న నోబెల్ కమిటీ చైర్మన్

**స్టాక్‌హోమ్, అక్టోబరు 10:** ప్రతి ఏటా విభిన్నరంగాల్లో అత్యుత్తమసేవలందించిన వ్యక్తులు,సంస్థలకు ఇచ్చే నోబెల్ పురస్కారాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెదవి విరిచారు. నోబెల్ పురస్కారాల్లో రాజకీయాలే ఎక్కువ ఉన్నట్లు తెలుస్తోందని ట్రంప్ సహా శ్వేతసౌధం కూడా విమర్శలుచేసింది. శాంతికంటే రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు మరోసారి నిరూపించిందని వైట్‌హౌస్ స్పందించింది. నోబెల్ శాంతిపురస్కారాన్ని వెనిజులా ప్రతిపక్ష నేత మానవహక్కుల కార్యకర్త కొరినా మచాడోకు ప్రధానం చేస్తున్నట్లు నోబెల్ కమిటీ వెల్లడించినప్పటినుంచి ట్రంప్, ఆయన అనుయాయులనుంచి విమర్శలు వెల్లువలా వచ్చాయి. ఏడు యుద్ధాలను విరమింపచేసి మధ్యప్రాచర్యంలో శాంతిస్థాపనకు కృషిచేసిన తనకే నోబెల్ రావాల్సి ఉందని మొదటినుంచి ట్రంప్ చెప్పుకుంటూ వచ్చారు. దీనికితోడు పర్యటించిన ప్రతిచోటా, ప్రతి సమావేశంలోను నోబెల్‌శాంతిపురస్కారం తనకు రాకుండా అమెరికాకు అవమానంగానే భావించాల్సి ఉంటుందని కూడా వ్యాఖ్యలుచేసారు. రష్యా ఉక్రెయిన్‌మధ్య జరిగే ఎనిమిదో యుద్ధాన్ని కూడా విరమింపచేసే ప్రయత్నాలుచేస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయెల్‌ప్రధాని నెతన్యాహుతో మాట్లాడుతూ వారునాకు నోబెల్ ఇవ్వరని, నేను అర్హుడినైనా నాకు ఎప్పటికీ ఇవ్వరని వ్యాఖ్యలుచేసారు. ట్రంప్‌నకు శాంతిపురస్కారం రాకపోవడంపై కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవెన్ చెయుంగ్‌మాట్లాడుతూ డొనాల్డ్‌ట్రంప్‌చేసిన శాంతిస్థాపన యత్నాలను నోబెల్‌కమిటీ విస్మరించిందని అన్నారు. శాంతిపురస్కారం రాకపోయినా అధ్యక్షుడు ట్రంప్ శాంతికోసం ప్రయత్నిస్తూనే ఉంటారని, యుద్ధాలను అంతంచేస్తారని, ప్రజల ప్రాణాలను కాపాడతారని అన్నారు. ట్రంప్ గొప్ప మానవతా కరుణకలిగిన వ్యక్తి అని ఆయన నోబెల్‌కమిటీపై విరుచుకుపడ్డారు. ఈక్రమంలోనే కొన్నిదేశాలు పాకిస్తాన్, ఇజ్రాయెల్ వంటి దేశాలు ట్రంప్‌నకు శాంతిపురస్కారం ఇవ్వాలంటూ లాబీయింగ్‌చేసాయి. సుమారు 18కిపైగా దేశాలు ఎండార్స్ మెంట్ ఇచ్చాయని చెపుతున్నారు. చివరినిమిషంలో రష్యాకూడా ట్రంప్‌నకు నోబెల్ ఇవ్వాలంటూ ప్రకటించింది.

**నోబెల్ కమిటీ వివరణ :** ట్రంప్‌నకు శాంతిపురస్కారం ప్రకటించడంలో కొన్ని సాంకేతిక సమస్యలు వచ్చాయన్నారు. తమకు నోబెల్ పురస్కారాలకు గడువు జనవరి 31కే ముగిసిందని, ఆతర్వాతనే ట్రంప్‌నకు ఇవ్వాలంటూ నామినేషన్లు, ఎండార్స్ మెంట్లు వచ్చాయన్నారు. కొన్నిదేశాలనుంచి మద్దతు వచ్చినా ఆయనకు గడువు ముగియడంతో వాటిని పరిగణనలోనికి తీసుకోలేమని నోబెల్ కమిటీ చైర్మన్‌జోర్గెన్ వాట్నె ఫ్రిడ్నెస్ అన్నారు. నోబెల్ వ్యవస్థాపకుడు ఆల్‌ఫ్రెడ్ నోబెల్ ఆశయాలకు అనుగుణంగానే విజేతలను ఎంపికచేస్తామన్నారు. ఈ కమిటీ మీడియా బహిరంగప్రచారాలను కూడా గమనిస్తుందని, నోబెల్‌గ్రహీతల చిత్రాలున్న గదిలో కూర్చుని ఆ లేఖలను మేంచూస్తామని, ఆగది మాకు ఎంతో ధైర్యాన్నిస్తుందని అన్నారు. సమగ్రతతో పనిచేసే సంకల్పాన్ని ఇస్తుందని ఫ్రిడ్నెస్ పేర్కొన్నారు. త్వరిత గతిన దక్కిన దౌత్యవిజయాలకంటే స్థిరమైన బహుపాక్షిక యత్నాలకు కమిటీ ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ట్రంప్ ఫలితాలు సుస్థిర ఫలితాలిస్తాయని ఇంకా నిరూపించబడలేదని హెన్నీ జ్యాక్స్ సొసైటీ చరిత్రకారుడు థియోజెనౌ అన్నారు. ఒకఘర్షణ స్వల్పకాలం పేరిట ఆపడానికి, మూలకారణాలుగుర్తించి పరిష్కరించేందుకు మధ్య చాలా తేడా ఉంటుందన్నారు. వాతావరణ మార్పులపై నమ్మకం లేనివారికి లాంటి పురస్కారాలుదక్కుతాయని భావించలేమన్నారు. అయితే ఇపుడు మిస్ అయినా 2026లో ట్రంప్ మళ్లీ పోటీపడే అవకాశం లేకపోలేదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# సహజీవనం ధోరణులకు దూరంగా ఉండండి

## యువతులకు యూపి గవర్నర్ హెచ్చరిక



**వారణాసి, అక్టోబరు 10:** సహజీవనం ధోరణులకు నేటి తరం అమ్మాయిలు దూరంగా ఉండాలని, లేదంటే భాగ స్వాముల చేతిలో దారుణంగా 50 ముక్కలుగా నరికి వేయబడుతున్న ఘటనలను చూడాల్సి వస్తుందని యుపి గవర్నర్ ఆనందిబెన్ పటేల్ తీవ్రస్వరంతో హెచ్చరించారు. వారణాసిలోని మహాత్మాగాంధీ కాశీ విద్యాపీఠ్ 47వ స్నాతకోత్సవంలో ఆనందీబెన్ పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ, తాను అమ్మాయిలకు ఒక్కటే చెప్పాలనుకుంటున్నానని ఈ రోజుల్లో లివ్‌ఇన్ సంబంధాలు ఒక ట్రెండ్‌గా మారాయి. కానీ, దయచేసి దానికి దూరంగా ఉండండని స్పష్టం చేశారు. భాగస్వాముల మధ్య హింసకు సంబంధించిన వార్తలు తనను తీవ్రంగా బాధిస్తున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా ఇలాంటి వార్తలు వింటూనే ఉన్నాను. మన కుమార్తెలు ఎందుకిలా చేస్తున్నారని ఆలోచిస్తుంటే నాకెంతో బాధ కలుగుతోందని ఆమె అన్నారు. ఈ తరహా ఘటనలపై ఓ న్యాయమూర్తి కూడా తన వద్ద ఆందోళన వ్యక్తం చేశారని గవర్నర్ గుర్తుచేశారు. యువతులను దోపిడీ నుంచి కాపాడేందుకు విశ్వవిద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆ న్యాయమూర్తి సూచించినట్లు ఆమె తెలిపారు. కొన్ని రోజుల వ్యవధిలో ఆనందీబెన్ పటేల్ లివ్‌ఇన్ సంబంధాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఇది రెండోసారి. రెండు రోజుల క్రితం బలియాలోని జననాయక్ చంద్రశేఖర్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో మాట్లాడుతూ, సహజీవనం వల్ల కలిగే పరిణామాలు చూడాలంటే అనాథ శరణాలయాలకు వెళ్లాలని అన్నారు.

## గిరిజన బాలికలపై సామూహిక లైంగిక దాడి

**రాంచి, అక్టోబరు 10:** ఝార్ఖండ్‌లో అత్యంత దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. గర్వా జిల్లాలో ఇద్దరు గిరిజన బాలికలను కిడ్నాప్ చేసిన దుండగులు అడవిలోకి తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. నవరాత్రి ఉత్సవాల సమయంలో జరిగిన ఈ అమానుష ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఒక నిందితుడిని అరెస్ట్ చేయగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం రంకా పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగరి గ్రామానికి చెందిన ముగ్గురు బాలికలు తమ స్నేహితులతో కలిసి నవరాత్రి జాతరకు వెళ్లారు. జాతర ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా, మార్గమధ్యంలో ఓ స్కార్పియో వాహనం వారి వద్ద ఆగింది. అందులో నుంచి దిగిన నలుగురు వ్యక్తులు బలవంతంగా ఆ ముగ్గురు బాలికలను వాహనంలోకి ఎక్కించుకున్నారు. బాలికలతో ఉన్న యువకులు అడ్డుకోవడానికి ప్రయతి్నంచగా, నిందితులు వారిని తీవ్రంగా కొట్టి తరిమేశారు. వాహనంలో బాలికలను అటవీ ప్రాంతం వైపు తీసుకెళ్లారు. ఒక బాలిక ప్రాధేయ పడటంతో ఆమెను మధ్యలోనే వదిలేశారు. మిగిలిన ఇద్దరు బాలికలను నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు.

# 'దగ్గు' మృతులపై సిబిఐ వేయలేం

## - ప్రజాప్రయోజన వ్యాజ్యం తిరస్కరించిన సుప్రీం

## - పలు రాష్ట్రాలలో కొన్ని సిరప్‌లపై నిషేధం



న్యూఢిల్లీ, అక్టోబరు 10: మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో దగ్గు మందు కారణంగా చిన్నారులు మృతి చెందారని ఈ అంశంపై సీబీఐతో దర్యాప్తు చేయించాలంటూ దాఖలైన ప్రజప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. న్యాయవాది విశాల్ తివారీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను విచారించేందుకు నిరాకరించింది. మొదట ధర్మాసనం నోటీసులు జారీ చేసేందుకు అంగీకరించినప్పటికీ కేసును పరిశీలించిన తర్వాత పిటిషన్‌ను తోసిపుచ్చింది. న్యూస్‌పేపర్లు చదివిన తర్వాత పిటిషనర్లు కోర్టును ఆశ్రయిస్తున్నారంటూ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పిటిషన్‌ను వ్యతిరేకించారు. తాను ఏ రాష్ట్రానికి ప్రాతినిథ్యం వహించడం లేదని కానీ తమిళనాడు, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలు ఈ విషయంలో తీవ్రమైన చర్యలు తీసుకున్నాయని, వాటిని విస్మరించలేమని మెహతా కోర్టుకు తెలిపారు. డ్రగ్స్ చట్టాలను అమలు చేసేందుకు తగిన వ్యవస్థలు ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో ఉన్నాయని తెలిపారు. సుప్రీంకోర్టులో ఇప్పటివరకు ఎన్ని ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారని పిటిషనర్ తివారీని ధర్మాసనం ప్రశ్నించింది. తాను ఎనిమిది నుంచి పది పిల్స్ పిటిషన్లను దాఖలు చేశానని తివారీ సమాధానం ఇవ్వగా ధర్మాసనం ఆయన పిటిషన్‌ను తోసిపుచ్చింది. నాసిరకం మందులు మార్కెట్‌కు చేరకుండా తొలుత నాణ్యత పరీక్షా వ్యవస్థల్లోని లోపాలను దర్యాప్తు చేయాలని.. ఈ విషయంలో కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలని పిల్‌లో న్యాయవాది తివారీ కోరారు. అమ్మకాలు, ఎగుమతులకు అనుమతించే ముందు ఎన్‌ఏబీఎల్ గుర్తింపు పొందిన ల్యాబ్‌లలో అనుమానిత ఉత్పత్తులకు టాక్సికాలజీ పరీక్షను తప్పనిసరి చేయాలని పిటిషనర్ కోరారు. కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ కారణంగా మధ్యప్రదేశ్‌లో 23 మంది చిన్నారులు మృతి చెందారు. మృతి చెందిన పిల్లల్లో ఒకే రకమైన లక్షణాలు కనిపించాయి. అయితే, ఒక బిడ్డ కుటుంబం పోస్ట్‌మార్టంకు అంగీకరించింది. ఆ తర్వాత ఆ బిడ్డ మృతదేహాన్ని వెలికితీసి పరిశీలించారు. రాజస్థాన్‌లో ముగ్గురు పిల్లలు సైతం ఇలాంటి కారణాలతోనే మరణించారని భావిస్తున్నారు. పిల్లలకు జలుబు, దగ్గు సమస్యలు రాగా వారికి దగ్గు మందును సిఫారసు చేశారు. రెండు మూడు రోజుల తర్వాత పిల్లల్లో మూత్ర విసర్జన బంద్ ఆగిపోయింది. దర్యాప్తులో మూత్రపిండాలు పనిచేయడం లేదని.. ఆ తర్వాత కొద్దిరోజులకే పిల్లలు చనిపోతున్నట్లుగా గుర్తించారు. దగ్గు మందు సిరప్ అంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పలు రాష్ట్రాలో ఈ సిరప్‌ను బ్యాన్ చేశాయి.

## జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాపై

### కేంద్ర వివరణ కోరిన సుప్రీం

**న్యూఢిల్లీ, అక్టోబరు 10:** జమ్మూ కశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరించాలంటూ దాఖలైన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర హోదా అంశంపై దాఖలైన పిటిషన్లపై స్పందన చెప్పాలంటూ కేంద్రానికి నాలుగు వారాల గడువు ఇచ్చింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం పిటిషన్లను విచారించింది. విద్యావేత్త జహూర్ అహ్మద్ భట్, సామాజిక కార్యకర్త అహ్మద్ మాలిక్‌తో పాటు పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. 2023 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీ మేరకు త్వరగా రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని పిటిషనర్లు కోరారు. ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ఈ సందర్భంగా ప్రస్తావించారు. 2024 సెప్టెంబర్ 30 నాటికి జమ్మూ కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించి, త్వరలో రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని పునరుద్ధరించాలని ఆ సమయంలో సుప్రీంకోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. జమ్మూ కశ్మీర్‌కు ముందస్తు రాష్ట్ర హోదా రాజ్యాంగపరమైన అవసరమని ఇర్ఫాన్ హఫీజ్ పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్ రాష్ట్ర హోదా పిటిషన్‌లో వాది అయిన ఇర్ఫాన్ హఫీజ్ లోన్ సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం గతంలో 2024 సెప్టెంబర్ నాటికి జమ్మూ కశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలని, త్వరలోనే రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని ఆదేశించిందని తెలిపారు. రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా రాష్ట్ర హోదాను నిర్దిష్ట కాలపరిమితితో పునరుద్ధరించాలని కోర్టుకు ఒక ప్రతిపాదనను సమర్పించారు. జమ్మూ కశ్మీర్ మంత్రివర్గం ఆమోదించిన ఈ ప్రతిపాదన కాపీని కోర్టుకు సమర్పించామని ఆయన తెలిపారు. కేంద్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ.. ఈ అంశంపై జమ్మూ కశ్మీర్ పరిపాలనతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇది ఒక ప్రత్యేక పరిస్థితి అని, ఇందులో అనేక సున్నితమైన అంశాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా కేంద్రపాలిత ప్రాంతాన్ని ప్రతికూల కోణంలో చిత్రీకరిస్తున్నారన్నారు.

# పాక్‌లో మళ్లీ చెలరేగిన ఉద్రిక్తతలు



లాహోర్, అక్టోబరు 10: పాకిస్థాన్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా తెహ్రీక్‌ఎలబ్బైక్ పాకిస్థాన్ (టీఎల్‌పీ) అనే మతతత్వ పార్టీ తలపెట్టిన భారీ ర్యాలీ నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. శుక్రవారం జరగనున్న లబ్బైక్ యా అక్సా మిలియన్ మార్చ్ కారణంగా రాజధాని ఇస్లామాబాద్, రావల్పిండి నగరాల్లో మొబైల్, ఇంటర్నెట్ సేవలను నిరవధికంగా నిలిపివేశారు. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా, రాజధానికి వెళ్లే అన్ని ప్రధాన మార్గాలను మూసివేసి దిగ్బంధించారు. నగరంలోని రెడ్ జోన్‌ను పూర్తిగా సీల్ చేసి, కేవలం అధికారిక పాసులు ఉన్నవారిని మాత్రమే మార్గల్లా రోడ్డు మీదుగా అనుమతిస్తున్నారు. అంతర్గత వ్యవహారాల మంత్రి మోహ్సిన్ నఖ్వీ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. దీంతోపాటు, పంజాబ్ ప్రావిన్స్ వ్యాప్తంగా 10 రోజుల పాటు 144 సెక్షన్‌ను అమలు చేశారు. దీని ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో నలుగురి కంటే ఎక్కువ మంది గుమికూడటంపై నిషేధం విధించారు. ఈ ర్యాలీకి ముందే లాహోర్‌లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. టీఎల్‌పీ చీఫ్ సాద్ హుస్సేన్ రిజ్వీని అరెస్ట్ చేసేందుకు పోలీసులు వారి ప్రధాన కార్యాలయంపై దాడి చేశారు. దీంతో టీఎల్‌పీ కార్యకర్తలు రాళ్లు, ఇనుప రాడ్లతో పోలీసులపై ఎదురుదాడికి దిగారు. ఈ ఘర్షణల్లో ఐదుగురు పోలీసులు, పదుల సంఖ్యలో ఆందోళనకారులు గాయ పడినట్లు పోలీసు అధికారి ఒకరు తెలిపారు. అయితే, తమ కార్యకర్త ఒకరు మరణించగా, 20 మందికి గాయాలయ్యాయని టీఎల్‌పీ వర్గాలు ఆరోపించాయి. ప్రభుత్వ చర్యలను టీఎల్‌పీ తీవ్రంగా ఖండించింది. శాంతియుతంగా తలపెట్టిన మా ర్యాలీని అడ్డుకోవడానికి ప్రభుత్వం నీచమైన చర్యలకు పాల్పడుతోంది. గాజాలో యూదులు ముస్లింలను అణచివేస్తుంటే, ఇక్కడ వారికి మద్దతిచ్చే వారు మమ్మల్ని అణచివేస్తున్నారని టీఎల్‌పీ ప్రతినిధి ఆరోపించారు. పాలస్తీనాకు మద్దతు తెలపడం పాకిస్థాన్‌లో నేరంగా మారిందన్నారు.

## హెచ్1బి వీసాల్లో సమూల మార్పులకు ట్రంప్ కసరత్తు

### పరిశోధన విద్యార్థులలో తీవ్ర ఆవేదన




**వాషింగ్టన్, అక్టోబరు 10:** అమెరికాలో ఉద్యోగం చేయాలని ఆశించే వేలాది మంది భారతీయ విద్యార్థులు, యువ నిపుణులకు ఇది ఆందోళన కలిగించే వార్త. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం హెచ్1బీ వీసా కార్యక్రమంపై సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే వీసా రుసుము పెంపు ప్రతిపాదనలతో ఆందోళన నెలకొనగా, తాజాగా వీసాల జారీ, వినియోగం, అర్హత ప్రమాణాలపై మరిన్ని కఠిన నిబంధనలను విధించేందుకు సిద్ధమవుతోంది. ఈ మార్పులు అమల్లోకి వస్తే, భారతీయ నిపుణుల అమెరికా కల మరింత సంక్లిష్టంగా మారనుంది. అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్‌ఎస్), 'హెచ్1బీ నాన్‌ఇమ్మిగ్రెంట్ వీసా వర్గీకరణ కార్యక్రమ సంస్కరణ' పేరిట ఫెడరల్ రిజిస్టర్‌లో కొత్త ప్రతిపాదనలను నమోదు చేసింది. ఈ ప్రతిపాదనల ముఖ్య ఉద్దేశం "అమెరికా కార్మికుల వేతనాలు, పని పరిస్థితులను మెరుగ్గా పరిరక్షించడం,

హెచ్1బీ కార్యక్రమ సమగ్రతను పెంచడం" అని ప్రభుత్వం పేర్కొంది. ఈ సంస్కరణల్లో భాగంగా వీసా నిబంధనలను ఉల్లంఘించిన కంపెనీలపై మరింత నిఘా పెట్టడం, థర్డ్‌పార్టీ ప్లేస్‌మెంట్‌లను కఠినంగా పర్యవేక్షించడం వంటి అంశాలు ఉన్నాయి. ప్రస్తుతం విశ్వవిద్యాలయాలు, లాభాపేక్ష లేని పరిశోధన సంస్థలు, ఆరోగ్య సంరక్షణ సంస్థలకు వార్షిక వీసా పరిమితి (క్యాప్) నుంచి మినహాయింపులు ఉన్నాయి. తాజా ప్రతిపాదనల్లో భాగంగా ఈ మినహాయింపులను కూడా ప్రభుత్వం పునఃసమీక్షించే అవకాశం ఉందని కథనాలు వస్తున్నాయి. అదే జరిగితే ఈ సంస్థలపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ కొత్త నిబంధనలకు సంబంధించిన పూర్తి వివరాలు ఈ ఏడాది డిసెంబర్ నాటికి అధికారికంగా వెలువడవచ్చని రెగ్యులేటరీ నోటీసులో సూచించారు.

## శబరిమల బంగారం లెక్కల్లో అవకతవకలు

### కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయాలని ఆదేశించిన కోర్టు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10:** అయ్యప్పస్వామి కొలువుదీరిన శబరిమల ఆలయంలోని విగ్రహాల బంగారం తాపడం బరువు తగ్గడంపై శుక్రవారం కేరళ హైకోర్టులో విచారణ జరిగింది. బంగారం లెక్కల్లో అవకతవకలు చోటుచేసుకున్నట్లు కనిపిస్తోందని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంపై క్రిమినల్ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేయాలని రాష్ట్ర పోలీసులను ఆదేశించింది. అలాగే ఈ వివాదంపై ఇప్పటికే న్యాయస్థానం సిట్ ఏర్పాటుచేసి, నెలలోగా నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. దానిని బహిర్గతం చేయొద్దని పేర్కొంది. శబరిమలలో గర్భగుడి ముందున్న ద్వారపాలక విగ్రహాలపై బంగారు పూతపూసిన తాపడాలను అందిస్తానని ఉన్నికృష్ణన్ అనే దాత తీసుకెళ్లారు. ఈ పనిని చెన్నైలోని ఓ సంస్థకు అప్పగించారు. 2019లో వాటిని తొలగించే సమయంలో తాపడాల బరువు 42.8 కిలోలుగా ఉన్నట్లు రికార్డుల్లో ఉందన్నారు.

# అస్సామీ గాయకుడి మృతికేసులో ఇద్దరు భద్రతా సిబ్బంది అరెస్టు



**గువాహతి, అక్టోబరు 10:** అస్సాం గాయకుడు జుబీన్ గార్గ్ ఇటీవలే మరణించిన విషయం తెలిసిందే. సింగపూర్ వెళ్లిన జుబీన్ అక్కడ ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయారు. ఆయన మరణంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక సీఎం హిమంత బిశ్వ శర్మ ఆదేశాల మేరకు జుబీన్ మృతిపై అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ప్రమాద సమయంలో అక్కడున్న వారిపై నిఘా పెట్టారు. ఇప్పటికే జుబీన్ మేనేజర్ సిద్ధార్థశర్మ, నార్త్‌ఈస్ట్ ఇండియా ఫెస్టివల్ చీఫ్ ఆర్గనైజర్ శ్యామ్‌కాను మహంత, జుబీన్ కజిన్ సోదరుడు సహా పలువురిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా జుబీన్ గార్గ్ ఇద్దరు వ్యక్తిగత భద్రతా సిబ్బందిని సిట్ బృందం అరెస్ట్ చేసింది. నందీశ్వర్ బోరా, పరేష్ బైశ్యాలను రోజులుగా ప్రశ్నించిన తర్వాత అదుపులోకి తీసుకున్నారు. వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోకి పెద్ద ఎత్తున ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. గార్గ్ మృతిపై దర్యాప్తు చేస్తున్న సిట్ బృందం గాయకుడి ఇద్దరు వ్యక్తిగత భద్రతా సిబ్బంది బ్యాంకు ఖాతాలను అధికారులు పరిశీలించారు. వారి ఖాతాల్లో దాదాపు రూ.కోటి లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. దీంతో గార్గ్ మరణంలో వారి ప్రమేయం ఉందనే అనుమానంతో వారిని విచారించారు.

# సంక్షిప్తంగా..

## బగ్రాన్ ఎయిర్‌బేస్‌పై కూటమికి మద్దతు పలికిన భారత్

**న్యూఢిల్లీ, అక్టోబరు 10:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చర్యలు అంతర్జాతీయ సమీకరణాలను సమూలంగా మార్చేస్తున్నాయి. ముఖ్యంగా భారత్ తాజాగా సంచలన నిర్ణయం తీసుకుంది. అమెరికా అధ్యక్షుడికి వ్యతిరేకంగా, చిరకాల ప్రత్యర్థులైన పాకిస్థాన్, చైనాకు మద్దతుగా కీలక నిర్ణయం తీసుకుంది. తాలిబన్‌పాలిత ఆఫ్ఘనిస్తాన్‌కు సంబంధించిన అంశం విషయంలో అమెరికాకు వ్యతిరేకంగా భారత్ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఆఫ్ఘనిస్థాన్‌లోని బాగ్రామ్ ఎయిర్ బేస్ అమెరికాకు దక్షిణాసియాలో అతిపెద్ద వైమానిక స్థావరంగా చాలా కాలం కొనసాగింది. తాలిబన్లపై 20 ఏళ్ల యుద్ధంలో అమెరికా కార్యకలాపాలకు కేంద్రంగా ఉంది. అయితే అమెరికా వదిలేసి వెళ్లిపోయిన తర్వాత దానిని తాలిబన్లు స్వాధీనం చేసుకున్నారు.

## 'విద్యుత్ రక్షక్'కు పేటెంట్ హక్కు కల్పించిన కేంద్రం!



**న్యూఢిల్లీ, అక్టోబర్ 10:** ఇండియన్ ఆర్మీకి చెందిన సమీకృత జనరేటింగ్ మానిటరింగ్, ప్రొటెక్షన్ అండ్ కంట్రోల్ సిస్టమ్ విద్యుత్ రక్షక్‌కు పేటెంట్ హక్కు కల్పిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇటీవల దీనిని మేజర్ రాజ్‌ప్రసాద్ ఆర్ఎస్ అభివృద్ధి చేశారు. సంక్లిష్ట పరిస్థితుల్లో విద్యుత్ వ్యవస్థలను కాపాడటంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. బహుళ జనరేటర్లు, పవర్ సిస్టమ్‌ల సమగ్ర పర్యవేక్షణ, రక్షణ, నియంత్రణలకు ఇది ఉపయోగపడుతుంది. భారత సైన్యానికి విద్యుత్ రక్షక్‌పై 2023 నుంచి 20 ఏళ్లపాటు ఈ పేటెంట్ హక్కును కల్పించారు. ఇందుకు సంబంధించిన వివరాలు తెలియజేస్తూ భారత సైన్యం సోషల్ మీడియాలో ఓ వీడియోను షేర్ చేసింది. ఆత్మనిర్భర్ భారత్‌వైపు దేశం అడుగులు వేస్తున్న సమయంలో మేజర్ రాజ్‌ప్రసాద్ రూపొందించిన విద్యుత్ రక్షక్‌తో భారత సైన్యం మరో ముందడుగు వేసిందని ఎడిజిపిఐ సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

## బాలీవుడ్ బాడీ బిల్డర్ వరీందర్‌సింగ్ మృతి



**ముంబయి, అక్టోబరు 10:** బాలీవుడ్ చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ బాడీబిల్డర్, నటుడు వరీందర్ సింగ్ ఘుమన్ (42) గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. సల్మాన్ ఖాన్ హీరోగా 2023లో వచ్చిన టైగర్ 3 చిత్రంలో నటించి గుర్తింపు పొందిన ఆయన, చిన్న వయసులోనే కన్నుమూయడం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. అమృత్‌సర్‌లోని ఫోర్టిస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వరీందర్ సింగ్, శుక్రవారం సాయంత్రం 5:30 గంటల సమయంలో తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషాద వార్తను పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎంపీ సుఖీందర్ సింగ్ రంధావా గురువారం సాయంత్రం తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు.

## అమెరికా ఎంబసీ ముట్టడికి యత్నం.. ఇస్లామాబాద్‌లో ఇద్దరి మృతి

**ఇస్లామాబాద్, అక్టోబరు 11:** పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో చోటుచేసుకున్న ఆందోళనల్లో ఇద్దరు నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారు. గాజాలో మరణాలు, ట్రంప్ శాంతి ప్రణాళికను నిరసిస్తూ తెహ్రీక్-ఇ-లబైక్ పాకిస్థాన్ (టిఎల్‌పి) కార్యకర్తలు గురువారం నుంచి ఇస్లామాబాద్‌లో ఆందోళనలు చేపట్టారు. శుక్రవారం నిరసనకారులు ఇస్లామబాద్‌లోని అమెరికా ఎంబసీ ముట్టడికి యత్నించడంతో ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. ఆందోళనకారులను కట్టడి చేసేందుకు భద్రతా దళాలు ప్రయత్నిస్తున్న క్రమంలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో ఇద్దరు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. ఆందోళనకారులు పలు వాహనాలు, దుకాణాలను ధ్వంసం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. పరిస్థితులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉండడంతో ఇస్లామాబాద్, రావల్పిండి ప్రాంతాల్లో ఇంటర్నెట్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు.

## ఎయిరిండియా విమానంలో మళ్లీ సమస్యలు

**దుబాయి, అక్టోబరు 10:** టాటా గ్రూప్ ఆధీనంలోని దేశీయ ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా లో సాంకేతిక సమస్యలు కొనసాగుతున్నాయి. తాజాగా ఆస్ట్రియాలోని వియన్నా నుంచి ఢిల్లీకి వస్తున్న ఎయిర్ ఇండియా విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో విమానాన్ని దుబాయ్‌కి దారిమళ్లించారు. తనిఖీల అనంతరం దుబాయ్ ఎయిర్‌పోర్ట్ నుంచి విమానం ఢిల్లీకి బయల్దేరింది. ఈ విషయాన్ని ఎయిర్ ఇండియా ధృవీకరించింది. ఈనె 9న వియన్నా నుంచి న్యూఢిల్లీకి బయల్దేరిన ఎఐ154 విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో విమానాన్ని దుబాయ్‌కి దారి మళ్లించాం. అక్కడ సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. అవసరమైన తనిఖీల అనంతరం విమానం శుక్రవారం ఉదయం 8:45 గంటలకు న్యూఢిల్లీకి బయల్దేరింది' అని సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు చెప్పింది.

11-10pg6exHMNWJQE MN 10_11-10pg6exHMNWJQE.qxd 10/10/2025 11:29 PM Page 1





## వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు భేష్!

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబరు 10 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్ సంతృప్తి వ్యక్తం చేశారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా శుక్రవారం ఆయన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనాతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు వారికి ఆలయ అర్చక బృందం, డిప్యూటీ కమిషనర్, నల్లం సూర్య చక్రధరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్. కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు. డిఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్ విద్యాసాగర్, ఎస్సై పి.రాంబాబు, వాడపల్లి దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావులతో కలిసి ఆయన బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. మాడవీధులను, పార్కింగ్ ప్రదేశాన్ని, క్యూలైన్ల ఏర్పాటును పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు బాగున్నాయన్నారు. గత ఏడాదిలో ఆలయం మరింత అభివృద్ధి చెందిందని తెలిపారు. మాడవీధులు విశాలవంతమయ్యాయని, ఆలయ దక్షిణ, ఉత్తర సింహ ద్వారాల వెడల్పుతో భక్తులకు సులభంగా దర్శనం అవుతుందన్నారు. శనివారం వచ్చే భక్తులు రద్దీ దృష్ట్యా ప్రత్యేకమైన భద్రత ఏర్పాటు చేస్తామని ఐజి అశోక్‌కుమార్ వెల్లడించారు.

# ఆయుష్‌ను పటిష్టం చేస్తాం

**- కేంద్రం రూ.166 కోట్లు మంజూరు - మంత్రి సత్యకుమార్ యాదవ్**




విజయవాడ, అక్టోబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకైన ఆయుష్ శాఖను పటిష్టం పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. శుక్రవారం స్థానిక డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఆయుష్ శాఖకు చెందిన పీజీ విద్యార్థులు, హౌస్ సర్జన్స్ స్టైఫండ్స్ పెంచినందుకు మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ దేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆయుష్ శాఖ ఆదర్శంగా ఉండేలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. విద్యార్థుల పరిస్థితిని అర్థం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం స్టైఫండ్ ను పెంచిందన్నారు. 2025-26 సంవత్సరానికి రాష్ట్ర ఆయుష్ శాఖ అభివృద్ధి కార్యక్రమాల కోసం కేంద్రం రూ.166 కోట్లు మంజూరు చేసిందన్నారు.. దర్శవరం, కాకినాడలో కొత్తగా ఆయుర్వేద కళాశాలలు మంజూరు చేశామన్నారు. గత ప్రభుత్వం ఆయుష్ శాఖను పట్టించుకోకుండా నిరక్ష ్యం చేసిందన్నారు. కేంద్రానికి పంపించాల్సిన నివేదికలను పంపక పోవడం వల్ల మూడు సంవత్సరాల్లో ఒక్క రూపాయి కూడా ఆయుష్ శాఖకు కేటాయింపు జరగలేదన్నారు. ఎంతో ప్రాచీనమైన మన భారతీయ ఆయుష్, యునాని తదితర వైద్య విధానాలను సంరక్షి ంచుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.. భావితరాలకు దీని విశిష్టతను తెలియ పరిచే విధంగా కొన్ని నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా దీనికి సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. ఆయుష్ ప్రాధాన్యతను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గుర్తించి దీనికి ఒక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఆయుష్‌లో భాగమైన యోగా, ప్రాణాయామం వంటి వాటికి ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం కల్పించిందన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఆయుష్ శాఖకు చెందిన ఐదు ఆస్పత్రులను, మూడు కాలేజీలను ఏర్పాటు చేయబోతున్నామన్నారు.. ఆయుష్ వ్యవస్థని మరింత పటిష్టపరిచే విధంగా బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది మొత్తం కలిపి 500 పోస్టుల నియామకాలు చేపట్టబోతున్నామన్నారు. విజయవాడ ఆయుర్వేద కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం 3 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిందన్నారు. ఇంటిగ్రేటెడ్ ఆయుర్వేద కళాశాలలు విశాఖపట్నం, కాకినాడ లలో మంజూరు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం పూర్తి గా ఆయుష్ శాఖను నిర్వీర్యం చేసిందన్నారు.. కూటమి ప్రభుత్వం వచ్చిన సంవత్సరంలోనే మొదటి ఏడాది రూ. 83 కోట్లు, రెండో ఏడాది 166 కోట్లు మంజూరు చేశారన్నారు. గతంలో 2018 లో సెంట్రల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూషన్ ఫర్ యోగా అండ్ నేచురోపతికి భూమిని కేటాయించగా, గత ప్రభుత్వం ఆ స్థలాన్ని వేరే యాక్టివిటీస్ కి ఇచ్చారని, అది కూడా నెరవేరలేదన్నారు. అంత ప్రతిష్టాత్మకమైన సంస్థను గత ప్రభుత్వం రాష్ట్రానికి రానివ్వకుండా చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి ప్రాంతమైన ప్రత్తిపాడులో ఆ సంస్థకు భూమిని కేటాయించింది. రాబోయే 2 సంవత్సర కాలంలో నిర్మాణం పూర్తి చేసి అందుబాటులో తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నా మన్నారు. దీనివల్ల ఆయుష్‌లో అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి వచ్చి అత్యాధునికమైన పరిశోధనలు చేయడానికి విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఆయుష్ శాఖ డైరెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పీజీ విద్యార్థుల స్టైఫండ్ ను పెంచి రికార్డు సృష్టించారన్నారు. గతంలో పోల్చుకుంటే ఆయుష్ శాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. వైద్య విద్యార్థులు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాన్ని అందిపుచ్చుకుని ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి, ఆయుష్ డిపార్ట్మెంట్ అడిషనల్ డైరెక్టర్ పి. సాయి సుధాకర్, డాక్టర్ నోరి రామాశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ కె. నిర్మలా జ్యోతి బాయ్, ఆయుర్వేద కళాశాల కు చెందిన పీజీ, హౌస్ సర్జన్స్ పాల్గొన్నారు.

## ఉద్యోగులను దూరం చేసుకోకండి

**ప్రభుత్వానికి గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం సూచన**

విజయవాడ, అక్టోబరు 10 ప్రభాతవార్త: రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఉద్యోగులకు సంబంధించి పెండింగ్ డిఎలు, పిఆర్సీ, పాత బకాయిలు గురించి చర్చిస్తారని ఊహించాం, కానీ చర్చించలేదని దీంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో వున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అప్పలనాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చి 16 నెలలు అయినా ఇప్పటికే అనేకసార్లు కేబినెట్ సమావేశాలు జరిగిన కనీసం ఉద్యోగులకు రావలసిన బకాయిలు గురించి, పెండింగ్ డిఎలు, పిఆర్సీ కమిషన్ గురించి గానీ నిర్ణయం తీసుకోకపోవడంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి చెంది ఉన్నారన్నారు. త్వరలో ఉద్యోగ సంఘాలు ఏకతాటి పైకొచ్చి రోడ్డు ఎక్కే ఆలోచనతో ఉద్యోగులు ఉన్నారు. కావున కూటమి ప్రభుత్వం ఉద్యోగులను ప్రభుత్వానికి దూరం చేసుకోకుండా ఉద్యోగుల సమస్యలపై చర్చించి న్యాయం చేయాలన్నారు.

## స్టాల్ ఇన్ మాల్‌తో హస్తకళాకారులకు నాబార్డ్ చేయూత

**డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎంఎం బెహ్రా**

విజయవాడ, అక్టోబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామీణ హస్తకళాకారులు తయారుచేసిన ఉత్పత్తులకు సరైన మార్కెట్ సౌకర్యం కల్పించి ఉపాధి అవకాశాలు మెరుగు పరచాలనే లక్ష ్యంతో ప్రైవేటు షాపింగ్ మాల్స్‌లోనూ స్టాల్ ఇన్ మాల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం) ఎంఎం బెహ్రా అన్నారు. నాబార్డ్ ఆర్థిక సహాయంతో నేస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పీవీపీ మాల్‌లో ఏర్పాటుచేసిన స్టాల్ ఇన్ మాల్ ప్రదర్శనను శుక్రవారం నాబార్డ్ నాబార్డ్ డీజీఎం ఎంఎం బెహ్రా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామీణ హస్తకళాకారులు తయారుచేసిన ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించి, వారి జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు కళాత్మక సంపదను భావితరాలకు అందజేయాలనే లక్ష ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నేస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన చేనేత మంచి ఫలితాలు ఇచ్చిందన్నారు. నగర ప్రజలు హస్తకళాకారులను ప్రోత్సహించేందుకు ముందుకు రావాలన్నారు. పట్టణ ప్రాంత ప్రజల అభిరుచులకు తగ్గట్లు అందుబాటులో ఉత్పత్తులు ఉంచాలన్నారు.

## ఆ మార్గం తిరిగి ప్రారంభించాలి




వెంకటగిరి, అక్టోబరు 10 ప్రభాతవార్త: వెస్ట్ రైల్వే స్టేషన్ సమీపంలో దక్షిణం వైపు మార్గాన్ని తిరిగి ప్రారంభించాలని ఎంపీ డా. గురుమూర్తి విజ్ఞప్తి చేశారు. తిరుపతి వెస్ట్ రైల్వే స్టేషన్ వైపు మార్గం మూసివేత కారణంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందుల గూర్చి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కి లేఖ రాయడంతోపాటు, ఫోన్ చేసి విషయం తెలియజేశారు. ఎం.ఆర్.పల్లి, శ్రీనివాసనగర్, పద్మావతి నగర్, ఎస్‌వి నగర్ ప్రాంతాల ప్రజలు ఈ మార్గాన్ని ప్రధానంగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం మార్గం మూసివేత కారణంగా ప్రజలు రెండు కిలోమీటర్ల దూరం తిరిగి ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొన్నారు. అంతేకాక, విశ్వవిద్యాలయ ప్రాంగణంలో భద్రతా కారణాల వల్ల ఉత్తర ద్వారం మూసివేయడం కూడా ప్రజలకు అదనపు ఇబ్బందులను కలిగిస్తోందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ప్రజల సౌకర్యార్థం దక్షిణ మార్గాన్ని తిరిగి ప్రారంభించి, రోటేటింగ్ గేట్ ఏర్పాటు చేసి నియంత్రిత ప్రవేశం కల్పించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. ఇందుకు అవసరమైన నిధులను తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల ద్వారా అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీ మద్దిల గురుమూర్తి కోరారు

## టెక్స్‌టైల్స్‌కు ఉజ్వల భవిష్యత్తు



విజయవాడ, అక్టోబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో టెక్స్ టైల్స్ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. టెక్స్ టైల్స్ రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహమంది స్తోందన్నారు. అమరావతి లోని రాష్ట్ర సచివాలయం నాలుగో బ్లాక్ లోని తన కార్యాల యంలో ఏర్పాటు మంత్రి సవితను శుక్రవారం అమెల్ సి ఆల్ట్ కన్సార్టియం ప్రతినిధులు కలిశారు. హిందూపురంలోని ఇంటిగ్రేటెడ్ టెక్స్ టైల్స్ పార్క్ లో పెట్టుబడులకు ఆసక్తిచూపుతున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధులు డాక్టర్ చక్రవర్తి, సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం నెలకొల్పిందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను తక్షణమే అందజేస్తున్నా మన్నారు. ముఖ్యంగా నూతన టెక్స్ టైల్స్ పాలసీ తీసుకురావడంతో ఆ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఏర్పాడిందన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున టెక్స్ టైల్స్ పార్క్ లో నిర్మాణం చేపట్టామన్నారు. అనంతరం అమెల్ సి ఆల్ట్ కన్సార్టియం ప్రతినిధులను మంత్రి సవిత ఘనంగా సత్కరించారు.

## ఎయిడ్స్ మారథాన్

విజయవాడ, అక్టోబరు 10 ప్రభాతవార్తప్రతినిధి: యువతలో హెచ్ఐవి/ ఎయిడ్స్ పై పూర్తి అవగాహన పెంచే విధంగా జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ శుక్రవారం నాడు 5కే మారథాన్‌ను డాక్టర్ కె నీలకంఠ రెడ్డి, ఐఎఎస్, ప్రాజెక్ట్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ మారథాన్ ద్వారా హెచ్ఐవి ఇన్ఫెక్షన్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు పట్ల ప్రజలలో అవగాహన కల్పిస్తూ, హెచ్ఐవితో జీవిస్తున్న వారికి ఆరోగ్యంగా జీవించేలా అన్ని గవర్నమెంట్ హాస్పిటల్లో ఉచితంగా ఏ ఆర్ టి మందును అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు. ఈ మారథాన్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్, డా.కె.సుచిత్ర, ఐఈసి జాయింట్ డైరెక్టర్, డా.టి.మంజుల, డా.అంకినీడు ప్రసాద్, కృష్ణా జిల్లా ఏడిఎమ్ హెచ్ ఓ, డా.భాను నాయక్, ప్రిపర్ సంస్థ కో ఆర్డినేటర్, డా. రాజేంద్రప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సిబ్బంది, పోలీసు శాఖ మరియు ఇతర ఎన్ జి ఓ సంస్థలు పాల్గొన్నారు.

### కాచిగూడ- గుంతకల్లు పాసింజర్

## రైలు వేళల్లో మార్పులు

**కర్నూలు- నంద్యాల రైలు వేళలు**

గుంతకల్లు రైల్వే, అక్టోబరు 10 ప్రభాతవార్త: రాయలసీమ జిల్లాల మీదుగా కాచిగూడ-గుంతకల్లు, కర్నూలు- డోన్-నంద్యాల మధ్య తిరిగే పాసింజర్ రైలు సర్వీసుల వేళలను నేటి (శనివారం) నుంచి మార్పులు చేసినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. కాచిగూడ నుంచి గుంతకల్లు వెళ్ళే 57412 పాసింజర్ రైలు శనివారం నుంచి ప్రతి రోజూ ఉదయం 11.45 గంటలకు కాచిగూడ నుంచి బయలుదేరి, మహబూబ్ నగర్ మధ్యాహ్నం 02.06/08, గద్వాల 03.45/47, కర్నూలు సాయంత్రం 05.00/02, డోన్ 06.25/30, గుంతకల్లుకు రాత్రి 09.05 గంటలకు చేరుకుంటుంది. అలాగే కర్నూలు నుంచి నంద్యాల వెళ్ళే 77209 పాసింజర్ రైలు శనివారం నుంచి ప్రతి రోజూ సాయంత్రం 05.20 గంటలకు కర్నూలు నుంచి బయలుదేరి డోన్ 06.40/50, నంద్యాలకు రాత్రి 0925 గంటలకు చేరుకుంటుంది. ఈ రైళ్ళకు మార్గమధ్యంలో ఉన్న స్టేషన్లలో సైతం మార్పులు చేసినట్లు తెలిపారు.

# మానసిక వైద్యుల సేవలు వెలకట్టలేనివి

**- వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**



విజయవాడ, అక్టోబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: సమాజానికి వెలకట్టలేని వైద్యసేవలు అందిస్తున్న మానసిక వైద్యులు క్లినికల్ సైకాలజిస్టుల కొరత వుందని, ఆ కొరత తీర్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టిందని, అందులో భాగంగా ఇటీవలే ఇండ్లాస్ హాస్పిటల్ లో క్లినికల్ సైకాలజీ కోర్సులు ప్రారంభించిందని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, విద్యావైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఇండ్లాస్ హాస్పిటల్స్ శుక్రవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో అత్యవసర పరిస్థితుల్లో మానసిక ఆరోగ్య సంరక్షణ అంశంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత నిర్వాహకులు ఏర్పాటు చేసిన మెంటల్ హెల్త్ వాక్‌ను జెండా ఊపి ప్రారంభించి, వాక్‌లో మిగతా వారితో కలిసి నడిచారు. అనంతరం సదస్సులో మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ రోజువారీ జీవనంలో వస్తున్న అనేక మార్పుల కారణంగా మనుషుల్లో మానసిక సమస్యలు పెరిగిపోతున్నాయన్నారు. మానసిక సమస్యల వల్ల ఆ వ్యక్తి కుటుంబమే కాదు, సమాజం దేశం కూడా నష్టపోతుందన్నారు. ఆర్థిక వ్యవస్థ దెబ్బతినేందుకు మానసిక జబ్బులు కూడా ముఖ్య కారణమని గణాంకాలతో వివరించారు. మానసిక వ్యాధి నిపుణుల కొరత తీర్చేందుకు మరిన్ని పీ.జీ సీట్లను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమానికి గౌరవ అతిథి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ హాజరు కాగా, సదస్సుకు డా. ఇండ్ల రామసుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. ఇండ్లాస్ డైరెక్టర్ డా. విశాల్ ఇండ్ల, డా. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా. వి. రాధికారెడ్డి, ఏపీ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డా. శ్రీహరిరావు, లండన్‌కు చెందిన ప్రముఖ ఇ.ఎన్.టి సర్జన్ డా. కృష్ణారెడ్డి, డి.ఎమ్.హెచ్‌వో డా. సుహాసిని, ఐఎమ్ఐ అధ్యక్షులు డా. హనుమయ్య, పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.




నాయీ బ్రాహ్మణుల సమావేశంలో ప్రసంగిస్తున్న బిజెపి చీఫ్ మాధవ్

## నాదస్వరం డోలు పోస్టులు భర్తీకి చర్యలు

**ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ వెల్లడి**

విజయవాడ, అక్టోబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: నాయీ బ్రాహ్మణుల గౌరవం, గుర్తింపు తీసుకుని రావడమే బిజెపి ధ్యేయంగా ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ స్పష్టం చేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నాయీ బ్రాహ్మణుల సంఘాలతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాధవ్ నాయీ బ్రాహ్మణులకు హామీల వర్షం కురిపించారు. దేవాలయాలలో నాదస్వరం డోలు పోస్టులు భర్తీకి కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తామన్నారు. నాయీ బ్రాహ్మణులకు రాజ్యాధికారంతో పాటు గౌరవం తీసుకుని వస్తామన్నారు. నాయీ బ్రాహ్మణుల వల్లనే భారతీయ సాంప్రదాయ భవిష్యత్తు తరాలకు అందించటానికి వీలు కలుగుతుందన్నారు. అణగారిన వర్గాల భవిష్యత్తు కాపాడడమే బిజెపి ధ్యేయమని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అణగారిన వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగొల గోపి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, నాయీ బ్రాహ్మణుల కార్పోరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, బిజెపి చీఫ్ స్పోక్స్ పర్సన్ వల్లూరు జయప్రకాష్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీ రాం,బిఎస్ఆర్ పట్నాయక్, మురళీ నాయుడు, రామకృష్ణ, నంద బాబ్జీ, తాటి కొండ నరసింహ రావు తదితరులు పాల్గొన్నారు.

## సిజెఐపై దాడి ఘటనకు మోడీదే బాధ్యత




**కాంగ్రెస్ నేత, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ చింతా మోహన్**

తిరుపతి, అక్టోబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడి ఘటనకు ప్రధాని మోడీ బాధ్యత తీసుకోవాలని, కర్నూలు పర్యటనకు రాకముందే దీనిపై స్పందించాలని కాంగ్రెస్ నేత, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ చింతా మోహన్ డిమాండ్ చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దళిత ఐపిఎస్ అధికారి హర్యానాలో డిజిపి స్థాయిలో ఉంటే అక్కడి బిజెపి ప్రభుత్వం అత్యంత ఘోరంగా అవమానించడంతో తన రివాల్వర్‌తో కాల్చుకుని చనిపోవడం అవమానించడమేనని అన్నారు. శుక్రవారం తిరుపతిలో గాంధీవిగ్రహం వద్ద ఈ ఘటనలపై కాంగ్రెస్ పార్టీ నిరసన తెలిపింది. ఈ సందర్భంగా చింతా మోహన్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై చెప్పువిసిరేసి దాడిచేయడం, హర్యానాలో డిజిపి స్థాయి అధికారిపై వేధింపులు దేనికి నిదర్శనమన్నారు. కాశ్మీరి నుండి కన్యాకుమారి వరకు దేశంలో 20శాతం దళితులు ఉన్నారని, వీరిపై విపరీతమైనదాడులు జరుగుతున్నాయని ఆందోళన చెందారు. ఈ నిరసనలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపిగౌడ్, రవి, రావణ్, తేజోవతి తదితరులు పాల్గొన్నారు.




## పెన్షన్ బిక్ష కాదు ఉద్యోగి హక్కు

గుంతకల్లు రైల్వే, అక్టోబరు 10 ప్రభాతవార్త: ప్రభుత్వ సిబ్బంది ఉద్యోగానంతరం పొందే పెన్షన్ ఎవరో దయాదక్షణ్యాలతో పెట్టే బిక్షకాదని, ప్రతి ప్రభుత్వ ఉద్యోగి హక్కు అని అఖిల భారత రిటైర్డ్ రైల్వే కార్మిక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్, గుంతకల్లు డివిజనల్ కార్యదర్శి డాక్టర్. వి.సుంకప్ప అన్నారు. ఇటీవల పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఆమోదించిన పెన్షన్ నిబంధనలు-2025 బిల్లును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పెన్షనర్లకు సంబంధించి జాతీయ సమాఖ్యలు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం స్థానిక డిఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డివిజనల్ అధ్యక్షుడు డాక్టర్ డి.జయంత్ కుమార్, కోశాధికారి డాక్టర్ జి.వీరన్న తదితరులు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లందరికి 2026 జనవరి నుంచి వర్తించేలా కేంద్ర ఎనిమిదవ వేతన సంఘ సిఫార్సులను వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. కమ్యుటేషన్ పెన్షన్ కాల వ్యవధిని 12 సంవత్సరాలకు కుదించాలని, కోవిడ్ మహమ్మారి సమయంలో స్తంభింపచేసిన జేసిన మూడు విడతల కరువు భత్యాన్ని తక్షణం మంజూరు చేయాలని కోరారు. ఎన్‌పిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని కోరుతూ రైల్వే అధికార వర్గాల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి వినతి పత్రాన్ని పంపారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ఎఐఆర్ఆర్ఎఫ్ బ్రాంచిల నుండి అధిక సంఖ్యలో రైల్వే పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు తరలి వచ్చారు.



కో ఆపరేటివ్‌టౌన్ బ్యాంకు ఛైర్మన్ ప్రమాణ స్వీకారం సభలో ఎమ్మెల్యే, బిజెపి నాయకులు

# గన్నవరంలో క్రికెట్ బాక్స్



గన్నవరం(కృష్ణా), అక్టోబరు 10 ప్రభాతవార్త: రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో యువకులు క్రికెట్ ఆడుకునేందుకు వీలుగా కొత్తగా క్రికెట్ బాక్స్‌ను ఏర్పాటు చేయించిన ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ శుక్రవారం రాత్రి ప్రారంభించారు. గన్నవరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రూ.13.5లక్షల ఖర్చుతో గన్నవరం సివిల్ కోర్టు సమీపంలోని ప్రభుత్వ భూమిలో క్రికెట్ బాక్స్‌ను ఏర్పాటు చేసారు. ఈ క్రికెట్ బాక్స్‌ను ప్రారంభించిన అనంతరం యార్లగడ్డ మీడియాతో మాట్లాడుతూ గ్రామాల్లో యువతకు క్రీడావసతులు కల్పించి మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మొట్టమొదటగా ఇక్కడ క్రికెట్ బాక్స్‌ని ఏర్పాటు చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. రాబోయే మూడునెలల కాలంలో మరో 10 గ్రామాల్లో గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో క్రికెట్‌బాక్స్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటిలో నామమాత్రపు ఫీజుతో క్రికెట్ ఆడుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని, తద్వారా గ్రామపంచాయతీకి ఆదాయం వస్తుందన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ నిధులతో వాలీబాల్, షటిల్, కబడ్డీ కోర్టులు ఏర్పాటు చేస్తామని యువతకు యార్లగడ్డ భరోసా ఇచ్చారు.

## పార్టీ విధేయులకు పదవులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 10 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీని నమ్ముకొని పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా అండగా నిలిచిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని వారి ఇంటి తలుపు తట్టి పదవులు వస్తాయని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు కొత్త పాలకమండలి ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పట్టణంలోని మహేష్ కళ్యాణ్ సదన్‌లో బ్యాంకు సిఇఓ ధనంజయులు సారధ్యంలో నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం చేసింది. ఈ సభలో ఛైర్మన్‌గా షేక్ ఖాదర్‌బాషా, సభ్యులుగా పలువురు ప్రమాణ స్వీకారం చేసారు. ఈ సభలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గాలి చలపతి నాయుడు, పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు విజయకుమార్ నాయుడు, రంగినేని చెంచయ్యనాయుడు, రావ్మి మునిరాజానాయుడు, కాసరం రమేష్, కంఠా రమేష్ పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# స్త్రీల సమస్యల పరిష్కారానికి పోర్టల్



అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ తదితరులు


**- విద్యార్థులు విద్య, కెరీర్ పై దృష్టి సారించాలి**

**- బాలికలు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు**

**- ఏపీ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ రాయపాటి శైలజ**

విజయవాడ, అక్టోబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: బాలికలు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడినా, సోషల్ మీడియాలో తప్పుగా పోస్ట్ చేసినా కఠిన చర్యలు తప్పవని ఏపీ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ రాయపాటి శైలజ హెచ్చరించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా యూజీసీ ఉమెన్స్ స్టడీ సెంటర్, ఏపీ మహిళా కమిషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ పాతబస్తీ (వన్ టౌన్)లోని కేబీఎన్ కళాశాలలో స్పాట్ లైట్ సెషన్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన అనంతరం రాయపాటి శైలజ మాట్లాడుతూ చిన్నారులు, బాలికలు, మహిళలు స్వేచ్ఛగా, సంతోషంగా జీవించే హక్కు కలిగి ఉన్నారని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. బాలికలు, మహిళలు చదువుకునే సమయంలో, ఉద్యోగ విధుల్లో ఉన్న సమయంలో ఎటువంటి భయం లేకుండా జీవితం కొనసాగించేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. పని ప్రదేశంలో అఘాయిత్యాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు రాష్ట్ర మహిళా కమిషన్ విధులు, విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రాయపాటి శైలజ సూచించారు. మహిళలు, బాలికలు స్వయంగా తమ కార్యాలయానికి రాలేని పరిస్థితులు ఉండటం, మరొక సందర్భంలో తమ వివరాల గోప్యత వంటి విషయాలను గుర్తించి ఆన్‌లైన్ పోర్టల్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. సదరు పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేస్తే ఆ ఫిర్యాదు స్టేటస్ కూడా ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు.

చట్టాలపై అవగాహన సదస్సులు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడంతో పాటు విద్యలో ఒక భాగం చేయాలన్న ఆలోచన చేస్తున్నామని రాయపాటి శైలజ తెలిపారు. ముందుగా మారపు ట్రస్ట్ ఛైర్మన్ ఆర్.సుయజ్ రాయపాటి శైలజతో ముఖాముఖి నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, సోషల్ మీడియా వేదికగా వేధింపులు ఇలా పలు అంశాలపై అడిగిన ప్రశ్నలకు రాయపాటి శైలజ విపులంగా సమాధానాలు చెప్పారు. విద్యార్థినీలు అడిగిన ప్రశ్నలకు కూడా సమాధానాలు చెప్పడంతో పాటు వారిలోని జిజ్ఞాసను ప్రశంసించారు.



# సిఆర్‌డిఏ కార్యాలయం 13నే ప్రారంభం

విజయవాడ, అక్టోబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: సిఆర్‌డిఏ ప్రధాన కార్యాలయం హంగులతో సిద్ధమైంది. సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన రాయపూడి సమీపంలో నిర్మించిన ఈ భవనం ఎన్నో ప్రత్యేకతలను సంతరించుకుంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ప్రారంభించనున్న తొలి పూర్తి స్థాయి భవనం ఇదే. రాజధాని ప్రాంత ప్రాధికార సంస్థ కార్యకలాపాలు ఇక విజయవాడ నుంచి అమరావతికి మారనున్నాయి. రాజధాని అమరావతిలో ఈ నెల 13న ప్రారంభించనున్న సిఆర్‌డిఏ ప్రధాన కార్యాలయ నిర్మాణ పనులు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రారంభమయ్యాయి. 2019లో వైఎస్సార్సీ ప్రభుత్వం వచ్చే నాటికి గ్రౌండ్ ఫ్లోర్ సహా మిగిలిన 7 అంతస్థులు కట్టుబడి పూర్తైంది. 5 ఏళ్లు నిలిపిన పనులను గత ప్రభుత్వం ఆఖరులో హడావుడిగా తిరిగి ప్రారంభించారు. గత ప్లాన్‌కు భిన్నంగా ఖర్చు తగ్గించేలా తూతూమంత్రంగా చేపట్టారు. అమరావతి పునర్నిర్మాణ పనులకు సీఎం చంద్రబాబు ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. నగర వ్యాప్తంగా పనులు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. వీటి నుంచి వచ్చే ఫీడ్‌ను ఈ కేంద్రానికి అనుసంధానం చేయనున్నారు. వీటితో పాటు డ్రోన్ల ద్వారా చిత్రీకరించే దృశ్యాల ద్వారా ఇక్కడి నుంచి పర్యవేక్షించే అవకాశం ఉంది. నిర్మాణ పనులు పూర్తైన తర్వాత నగరంలో పారిశుద్ధం, వరదలు, ట్రాఫిక్, భద్రత, వాతావరణం, తదితర అవసరాల కోసం వినియోగిస్తారు. దీనికి అనుబంధంగా కాల్ సెంటర్ ఏర్పాటైంది. కమాండ్ కంట్రోల్ కేంద్రం పూర్తిగా సౌండ్ ప్రూఫ్‌తో నిర్మించారు.

రాజధాని నగరంలోని కీలకమైన ప్రాంతాలు, భవనాలకు సంబంధించి సూక్ష్మ నమూనాలను ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో ప్రదర్శనకు ఉంచుతారు. అమరావతి బృహత్ ప్రణాళికను ఈ కేంద్రంలోని నమూనాల ద్వారా ప్రత్యక్షంగా చూసి అనుభూతి చెందొచ్చు. సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ, రాజ్‌భవన్, సీఎం నివాసం, ఉద్యానాలు, రహదారుల నెట్‌వర్క్, ఏపీ ఎన్ఆర్‌టీ, క్వాంటమ్ వ్యాలీ, తదితర వాటి డిజైన్లను చూడొచ్చు. కార్యాలయం ముందు భాగంలో ఎత్తైన జాతీయ జెండా పోస్టును ఏర్పాటు చేశారు. ధ్వనిని నియంత్రించేందుకు అంతర్గతంగా బాఫిల్ సీలింగ్‌తో నిర్మించారు. టెర్రస్‌పైన వివిధ కార్యక్రమాలు, సభలు నిర్వహించేందుకు వీలుగా తీర్చిదిద్దారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో సమీకృత కమాండ్ కంట్రోల్ కేంద్రం, కాల్ సెంటర్ సహా క్యాంటీన్, ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను నిర్మించారు. మొదటి అంతస్తులో సమావేశ మందిరాలు, 2, 3, 5 అంతస్తులు సీఆర్‌డీఏ, 4వ అంతస్తులో పురపాలక శాఖ డైరెక్టరేట్లను ఏర్పాటు చేశారు. 6వ అంతస్తులో అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, 7వ అంతస్తును పురపాలక శాఖ మంత్రి పేషీ, పురపాల శాఖ ముఖ్యకార్యదర్శి, ప్రజారోగ్య శాఖ ఈఎన్‌సీ, సీడీఈ, ఎస్‌డీఈ కార్యాలయాలకు కేటాయించారు. మొత్తం 4.23 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ భవనంలో మొత్తం 2.42 లక్షల చదరపు అడుగులు బిల్టప్ ఏరియా ఉంది. ప్రతి అంతస్తులో 33 వేల చదరపు అడుగులు అందుబాటులోకి వచ్చింది.

# మైనారిటీల యువతకు ఖతార్‌లో జాబ్స్

**మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ జిల్లా ఈడీ ఎస్‌కే ఫర్జానా బేగం**

విజయవాడ, అక్టోబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని ముస్లిం, క్రైస్తవ, ఇతర మైనారిటీ వర్గాల యువతకు నర్సింగ్, హెల్త్‌కేర్, టెక్నికల్, సేవా రంగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయని, ప్రభుత్వ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల ద్వారా అవసరమైన శిక్షణ అందించి, ఖతార్‌లో ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ జిల్లా ఈడీ ఫర్జానా బేగం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రిజిస్టర్ నర్స్ ఉద్యోగానికి మైనారిటీ (పురుషులు, మహిళలు) అభ్యర్థులు చేసుకోవచ్చని చెప్పారు. బీఎస్‌సీ/ జీఎన్‌ఎం పూర్తిచేసి 2140 ఏళ్ల మధ్య వయసు ఉండాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.1,20,000 వేతనం ఉంటుందని, ఉచిత నివాసం, ఉచిత రవాణా, వైద్యం, వీసా, విమాన ఛార్జీలు ఉంటాయన్నారు. ఈ నెల 13న నమోదు, ఇంటర్వ్యూలు ఉంటాయని.. అభ్యర్థులు తమ వివరాలను జిల్లా మైనారిటీ కార్యాలయంలో సమర్పించాలన్నారు. వివరాలకు 98499 01148, 99853 06408, 0866 2491148 నంబర్లలో సంప్రదించాలని ఈడీ ఫర్జానా బేగం తెలిపారు.

# ఎన్ఆర్‌టి కమ్యూనిటీ సమస్యలపై ప్రత్యేక దృష్టి

**- భారతీయ డయాస్పోరా అవసరాలను తీర్చడంలో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పాత్ర అభినందనీయం**

**- ఎన్ఆర్ఐ సాధికారిత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



విజయవాడ, అక్టోబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విదేశ్ సంపర్క్ కార్యక్రమాన్ని స్థానిక వివంత హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెర్ప్, ఎమ్ఎస్ఎమ్ఈ, ఎన్ఆర్ఐ సాధికారిత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ భారతీయ డయాస్పొరా అవసరాలను తీర్చడంలో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చేస్తున్న సేవలను మంత్రి అభినందించారు. కొత్త రాజధాని అమరావతిలో సంబంధిత శాఖ కార్యాలయాలు త్వరగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్ఆర్‌టీ కమ్యూనిటీ సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర సంస్థల మధ్య సమన్వయం బలోపేతం కావాలని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. ముఖ్యంగా విదేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొనే కార్మికులు, మరణించిన కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర స్థాయి సమిష్టి కృషి అవసరమన్నారు. థాయిలాండ్, లావోస్, కాంబోడియా వంటి దేశాల్లో మోసపూరిత రిక్రూటర్ల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు ఎంబసీల సహకారం మరింత బలపడాలని అభ్యర్థించారు. మన రాష్ట్రం అక్వా ఎగుమతుల ద్వారా విదేశీ మారకద్రవ్య ఆదాయానికి ప్రధాన భాగస్వామిగా ఉందని గుర్తుచేస్తూ, లీనితి సహకారంతో కొత్త మార్కెట్ల అభివృద్ధికి రోడ్‌మాప్ రూపొందించాలని సూచించారు. విదేశీ విద్యార్థులకు పాస్‌పోర్ట్ సేవలు వేగవంతంగా అందించాలని, రాయలసీమ ప్రాంతానికి కడపలో కొత్త ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం (ఆర్పిఓ) ఏర్పాటు చేయాలని కోరారు. విదేశాల్లో ఉపాధి అవకాశాలపై రాష్ట్రానికి సమాచారం అందించి, యువతకు శిక్షణ ఇప్పించడంలో ఎపిఎన్ఆర్‌టి, ఎంఇఎ కలిసి పనిచేయాలి అని మంత్రి అభిప్రాయపడ్డారు. ఎపిఎన్ ఆర్‌టి, ఎంబసీల మధ్య సమన్వయం ద్వారా విదేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొనే వలస కార్మికులకు గుర్తింపు, సహాయం అందించాల్సిన అవసరముందని తెలిపారు. ఎన్ఆర్ఐల పెట్టుబడులను ప్రోత్సహించేందుకు, అమరావతిలో ప్రవాస భారతీయ దివాస్" నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. లీనితి భవన సముదాయం నిర్మాణాన్ని అమరావతిలో త్వరితగతిన ప్రారంభించాలని, తద్వారా రాష్ట్ర ప్రజలకు అన్ని సేవలు ఒకే కేంద్రంలో అందుబాటులో ఉంటాయని మంత్రి సూచించారు. దేశ విదేశాలు వెళ్లేందుకు మెడికల్ టెస్ట్ లకు హైదరాబాద్ వెళ్లకుండా మన రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని మంత్రి కోరారు. ఏమైనా సమస్యలు ఎదురైతే త్వరితగతిన పరిష్కరించేందుకు నోడల్ ఆఫీసర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఎన్నారైలకు మెరుగైన సేవలు, ఉపాధి, విద్య, పెట్టుబడుల రంగాల్లో కేంద్ర-రాష్ట్ర స్థాయిలో సమన్వయం బలోపేతం కావడం రాష్ట్రానికి మేలుచేస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధులు, ఏపీఎన్ఆర్టీ అధికారులు, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# జిఎస్‌టి 2.0 సంస్కరణలపై అవగాహన కల్పించడంలో విద్యాసంస్థలదే కీలకపాత్ర

విజయవాడ, అక్టోబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: జిఎస్‌టి 2.0 సంస్కరణలు, ఆర్థిక క్రమశిక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించడంలో విద్యాసంస్థలు ముందుండాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టర్ ప్రొఫెసర్ రామినేని శివరామ ప్రసాద్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో జిఎస్‌టి 2.0 సంస్కరణల-విద్యార్థులకు మహత్తర ఉపశమనం" అనే అంశంపై నిర్వహించినఅవగాహన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ప్రొఫెసర్ రామినేని మాట్లాడుతూ, జిఎస్‌టి 2.0 పారదర్శకత, సరళత వంటి అంశాలు యువతలో ఆర్థిక అవగాహన పెంపు దిశగా కీలకమైన అడుగు అని పేర్కొన్నారు. దేశ ఆర్థిక దృష్టికోణానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో ఆర్థిక పరంగా బాధ్యతాయుత చైతన్యాన్ని పెంపొందించడమే దీని లక్ష్యమన్నారు. ప్రధాన అతిథులుగా జిఎస్‌టి సహాయ కమిషనర్ డి.శివప్రసాదరావు, డెప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ సాయిశంకర్ లండా హాజరయ్యారు. జిఎకొత్తగా తీసుకువచ్చినసంస్కరణలపైవిశదంగా వివరించారు.

# నీవా నదిలో చిక్కుకున్న వ్యక్తి సురక్షితం

చిత్తూరు, అక్టోబరు 10 ప్రభాతవార్త: చిత్తూరు నీవా నది ప్రవాహంలో రెండు రోజులుగా చిక్కుకుని ప్రాణ భీతిలో అల్లాడిన ఓ వ్యక్తిని చిత్తూరు టుటౌన్ పోలీసులు శుక్రవారం రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి రక్షించారు. నీవా నది ప్రవాహంలో చిక్కుకున్న వ్యక్తిని టుటౌన్ పోలీసులు సురక్షితంగా గట్టుకు చేర్చారు. కర్నాటక రాష్ట్రం మైసూర్ సిటీ శ్రీరాంపురం ప్రాంతానికి చెందిన శరణ్‌రాజ్ (49) పెయింటింగ్ పనులు నిమిత్తం వచ్చి చిత్తూరులో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో కియా షోరూమ్ వెనుకభాగం వున్న నీవా నది పరిసరాల్లో బహిర్భూమికి వెళ్ళిన శరణ్‌రాజ్ పొరబాటును నదిలో పడిపోయాడు. అప్పటి నుండి శరణ్‌రాజ్ నీవా నదిలో చెట్టును పట్టుకుని వుండిపోయాడు. ఈ పరిస్థితుల్లో శుక్రవారం అటుగా వెళ్ళిన ఒక వ్యక్తి నదిలో చిక్కుకున్న శరణ్‌రాజ్‌ను గమనించి ఈ విషయంను 112కు డయల్ చేసి సమాచారం అందించాడు. చిత్తూరు టుటౌన్ ఇన్‌స్పెక్టర్ నెట్టికంఠయ్య సిబ్బందితో సత్వరం సంఘటనా స్థలంకు వెళ్ళి శరణ్‌రాజ్‌ను రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి రక్షించారు. గట్టుకు తీసుకువచ్చి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



సంకటహర చతుర్థి పూజాదికాలు నిర్వహిస్తున్న దృశ్యం



దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

# దుర్గమ్మవారి ఆలయంలో వేదోక్తంగా సంకటహర చతుర్ధి

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 10 ప్రభాతవార్త: అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ వారి ఆలయంలో శుక్రవారం సంకటహర చతుర్థి పూజాదికాలు వేదోక్తంగా నిర్వహించారు. శ్రీ గణేశునికి అభిషేకం నిర్వహించారు. అనంతరం గణపతి హోమం నిర్వహించగా ఇఓ వికె శీనానాయక్ దంపతులు పాల్గొన్నారు.

శ్రీ అమ్మవారి చీరల టెండర్లు రు.8,15,00,000 కు ఆమోదం దుర్గమ్మవారి ఆలయంలో శుక్రవారం చీరల టెండర్ కార్యక్రమాన్ని ఇఓ వికె శీనా నాయక్ పాల్గొని నిర్వహించారు. గుంటూరుకు చెందిన నల్లూరి పావని ప్రొప్రెయిటర్‌గా వున్న మెస్సర్స్ శ్రీ పావని కలెక్షన్స్ వారికి రు.8,15,00,000లకు టెండర్‌ను ఖరారు చేసి, దేవదాయ శాఖ కమీషనర్ ఆమోదం కోసం నివేదిక సిద్ధం చేశారు. మొదటి సంవత్సరం జిఎస్‌టి 5శాతం అదనంగా చెల్లించటానికి, రెండో సంవత్సరం లైసెన్స్ సొమ్ముపై 10శాతం అదనంగా చెల్లించడానికి శ్రీ పావని కలెక్షన్స్ సంస్థ వారు ఈ టెండర్లో ఆమోదించారు. దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన కోనేరు కోటేశ్వం రావు తమ కుటుంబసభ్యులతో కలిసి రు.1లక్షను ఉచిత ప్రసాద వితరణకు, రు.50 వేలను నిత్యాన్నదాన పథకానికి విరాళంగా శుక్రవారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం దుర్గమ్మవారి ప్రసాదాలు అందించారు.

# గ్రంధాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

**- అమరావతిలో అత్యాధునిక సెంట్రల్ లైబ్రరీ నిర్మాణం**

**- రాష్ట్ర గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు**



విజయవాడ, అక్టోబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతిలో అద్భుతమైన అత్యాధునిక వసతులతో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారని రాష్ట్ర గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి సంబంధించి అవగాహన కలిగించేందుకు ఏర్పాటు చేసిన కార్యశాలను రాష్ట్ర గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో గుర్తింపు ఉండేలా ఐదు ఎకరాల స్థలంలో ఈ లైబ్రరీ నిర్మాణం ఉంటుందన్నారు. గతంలో హైటెక్ సిటీ నిర్మాణం ద్వారా వేలాది మందికి హైద్రాబాద్‌లో ఉద్యోగాలు పొందారన్నారు. 2025లో నిర్మాణం చేయబోయే ఈ లైబ్రరీ కూడా భవిష్యత్ తరాలకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించేలా ఉంటుందన్నారు. ఇతర దేశాల్లో కూడా పలు లైబ్రరీలను సందర్శించి వచ్చానన్నారు. ఆ వివరాలతో పాటు, నిపుణుల అభిప్రాయాలను తీసుకుని అందరికీ నచ్చేలా మెచ్చేలా గ్రంధాలయం ఉంటుందన్నారు.

దేశంలోనే అత్యాధునిక సెంట్రల్ లైబ్రరీని అమరావతిలో నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నమూనా ఎలా ఉండాలి, ఏ విధంగా రూపకల్పన చేయాలనే అంశాలపై వర్క్ షాపు నిర్వహించామన్నారు. అనేక ప్రాంతాల నుంచి నిపుణులైన ఆర్కిటెక్చరర్లు వచ్చారన్నారు. డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు, సాఫ్ట్ వేర్ లకు సంబంధించిన అంశాలను నిపుణులు వివరించారన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని లైబ్రరీలకు పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు తీసుకోవాల్సిన అంశాలపై నైపుణ్యం కల్గిన వారి నుంచి, వివిధ యూనివర్శిటీ ప్రొఫెసర్ల నుంచి అభిప్రాయాలను తీసుకుంటున్నామన్నారు. వచ్చే రెండేళ్ళల్లో ఈ సెంట్రల్ లైబ్రరీ దేశానికే ఆదర్శంగా ఉండబోతుందన్నారు. ఈ గ్రంధాలయం నిర్మాణం కోసం త్వరలోనే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో డిజైన్ కాంపిటేషన్స్ నిర్వహిస్తామన్నారు. ప్రముఖ ఆర్కిటెక్చర్లు కూడా ఈ పోటీలో పాల్గొని వివిధ నిర్మాణ ఆకృతులను కూడా అందించ వచ్చునన్నారు. అనంతరం అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, అద్భుతమైన డిజైన్‌తో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణం రెండేళ్లలో పూర్తి అయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మౌలిక వసతులు కల్పన బోర్డు ఛైర్మన్ రాజశేఖర్, గ్రంథాలయ సంస్థ బోర్డు డైరెక్టర్ డైరెక్టర్ రాసాని పద్మజ, రామూర్తి, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ కృష్ణ మోహన్, తదితరలు పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ప్రక్రియను ఊరూరా ఎండ కడతాం

**మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు**



ఒంగోలు, అక్టోబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రజా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్ఆర్ పార్టీ ఇంచార్జ్ అన్నా రాంబాబు హెచ్చరించారు. మార్కాపురం పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అన్నా రాంబాబు మాట్లాడారు. వైయస్సార్ పార్టీ అధిష్టానం పిలుపుమేరకు అక్టోబర్ 10 నుంచి నవంబర్ 22వ తేదీ వరకు చేపట్టనున్న రచ్చబండ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటు కరణ వల్ల పేద ప్రజలు పడే ఇబ్బందులను స్పష్టంగా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు కోటి సంతకాల సేకరణకు ప్రజా నిరసనను తెలియజేసేందుకు సిద్ధమయ్యామన్నారు. గ్రామాల్లో రచ్చబండ నిర్వహించి మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ వ్యవహారంపై ప్రజల నిరసనలను సంతకాల రూపంలో సేకరిస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ ప్రక్రియను నిలిపివేసి ప్రభుత్వమే నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో భాగంగా ఈనెల 28వ తేదీ మార్కాపురం రెవిన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట నిరసన నిరసన ర్యాలీని నిర్వహించనున్నామన్నారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి రమణారెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ షంషీర్ అలీ బేగ్, జడ్పిటిసి నారు బాపన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, శ్రీశైలం దేవస్థానం మాజీ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ కనకదుర్గ, పిన్నిక లక్ష్మీ ప్రసాద్ యాదవ్,పట్టణ కన్వీనర్ సలీం,మండల పార్టీ కన్వీనర్లు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, గుజ్జుల సంజీవరెడ్డి, కొనకనమిట్ట వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, వైయస్సార్ పార్టీ నాయకులు గౌస్ మోహిద్దీన్, కొండయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణలో కరెంట్‌కు భారీ డిమాండ్

**హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త :** తెలంగాణలో ఇంధన వినియోగం క్రమేపీ భారీగా పెరుగుతోంది. 2031-32 ఆర్థిక సంవత్సరం నాటికి తెలంగాణ ఇంధన వినియోగంలో 58.71 శాతానికి పైగా వృద్ధిని సాధించనుంది. ఈ మేరకు దీనికి సంబంధించి సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సిఇఎ) అంచనా వేసింది. ముఖ్యంగా ఎల్‌టి, హెచ్‌టి విద్యుత్ కనెక్షన్లు మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తోంది. మరోపక్క దేశంలోనే అత్యధిక విద్యుత్ డిమాండ్ ఉన్న ప్రధాన నగరాల జాబితాలో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని మొత్తం ఇంధన అవసరాల్లో హైదరాబాద్‌కు 30 శాతానికి పైగా ఉండటం విశేషం. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల సామర్థ్యం, బహుళ పరిశ్రమల అభివృద్ధి పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ కనెక్షకు డిమాండ్ పెరిగింది. ఇందులో భాగంగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి ఎస్పీడిసిఎల్ పరిధిలో 15 శాతం, ఎన్పీడిసిఎల్ పరిధిలో 6 శాతం పెరుగుదల నమోదైంది. వీటి పరిధిలో 2021-22 సంవత్సరం నాటికి రాష్ట్రంలో మొత్తం 1.70 కోట్ల విద్యుత్ సర్వీస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 1.21 కోట్ల గృహ విద్యుత్ కనెక్షన్లు, గృహేతర (వాణిజ్యం తదితర) కనెక్షన్లు 16.72 లక్షలు, పారిశ్రామిక రంగంలో 98,247 కనెక్షన్లు, వ్యవసాయానికి సంబంధించి 26.23 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. ఇదే 2022-23 సంవత్సరానికి అన్ని వర్గాల విద్యుత్ వినియోగదారులలో గణనీయమైన పెరుగుదల చోటు చేసుకుంది. దీంతో రాష్ట్రంలో మొత్తం విద్యుత్ వినియోగదారుల సంఖ్య దాదాపు 2,06,19,263 కనెక్షన్లకు పెరిగాయి. ఇందులో 1,23,36,341 గృహ విద్యుత్ కనెక్షన్లు, 17,25,414 వాణిజ్య, 1,02,763 కనెక్షన్లు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అయితే 26,37,868కు పెరిగాయి. ఒక్క ఎస్పీడిసిఎల్ పరిధిలో ప్రతీ నెలా దాదాపు 37వేల చొప్పున ఏటా 4లక్షలకు పైగా కొత్త విద్యుత్ కనెక్షన్లు మంజూరవుతున్నట్లు ఎస్పీడిసిఎల్ అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ గృహ విద్యుత్ కనెక్షన్లతో పాటు, పరిశ్రమలకు హెచ్‌టి కనెక్షన్లు క్రమంగా పెరగడం విశేషం. 2020-22 సంవత్సరాల మధ్య విద్యుత్ కనెక్షన్లు ఏటా 7నుండి 8శాతం పెరగ్గా, 2022-23 సంవత్సరం నాటికి ఇది రెండింతలు పెరిగి 15శాతానికి చేరుకుంది. హైదరాబాద్ ఫార్మా సిటీ ప్రాజెక్టుతో రాబోయే 5 నుండి 10 ఏళ్లలో 1000 మెగావాట్ల అదనపు డిమాండ్‌కు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.



# దివ్యాంగ విద్యార్థులకు విపిఆర్ దంపతుల చేయూత

కోవూరు (నెల్లూరు), అక్టోబరు 10 ప్రభాతవార్త: నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకం రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు మరోసారి తమ గొప్ప మనసును చాటారు. తాము మాట ఇస్తే తప్ప కుండా అండగా నిలబడతామంటూ రుజువు చేశారు. ఉత్తమ ప్రతిభ చూపిస్తూ.. మంచి ఫలితాలు సాధించిన దివ్యాంగ విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారు. గురువారం విపిఆర్ నివాసంలో కళాశాల ఫీజుల నిమిత్తం విద్యా స్వరూపిణికి 1 లక్ష 30 వేలు, సిరివల్లికి 1 లక్ష 25 వేలు, భవాని పూజితకు 30 వేలు అందజేశారు, వారి తల్లిదండ్రులకు ఈ మేరకు నగదు అందజేశారు.

ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు చిన్నారులను ఆశీర్వదించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. వారు ఎంత వరకు చదువుకుంటే అంతవరకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. విపిఆర్ దంపతుల చేయూతపై విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అడగకుండానే అండగా నిలిచి తమ పిల్లల చదువుల బాధ్యతను తీసుకున్నవారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిజేశారు. ఏపీసీ వెంకట సుబ్బయ్య, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ ప్రసాద్‌రావు, ఎంఈవో మురళి, ఐఈఆర్‌టీలు తదితరులు పాల్గొన్నారు.

# వెస్టిండీస్‌తో రెండో టెస్టు.. భారత్ భళా!



**• తొలి రోజే భారీ స్కోరు • సెంచరీతో కదంతొక్కిన జైస్వాల్ • రాణించిన సాయి సుదర్శన్ • పటిష్ట స్థితిలో టీమిండియా • తొలి ఇన్నింగ్స్ 318-2**

**న్యూఢిల్లీ, అక్టోబరు 10:** వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో భారత యువ బ్యాటర్లు అద్భుతంగా రాణించారు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ అద్భుత ఫామ్ కొనసాగిస్తూ సెంచరీతో కదం తొక్కాడు. మరో ఓపెనర్ కెఎల్ రాహుల్ విఫలం కాగా, వన్‌డౌన్‌లో వచ్చిన సాయి సుదర్శన్ తనదైన శైలిలో బ్యాట్‌ను ఝులిపించారు. బౌండరీలతో హోరెత్తించాడు. సెంచరీకి చేరవవుతున్న సమయంలో వికెట్ల ముందుకు దొరికిపోయాడు. మొదటిరోజు ఆట ముగిసే సమయానికి భారత్ 2 వికెట్లు కోల్పోయి 318 పరుగులు చేసి, పటిష్ట స్థితిలో నిలిచింది. ఇక మ్యాచ్ విషయానికొస్తే... టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ కలిసి తొలి వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి శుభారంభం అందించారు. ఆ తర్వాత రాహుల్ (38) ఔటయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన సాయి సుదర్శన్‌తో కలిసి జైస్వాల్ ఇన్నింగ్స్‌ను అద్భుతంగా నిర్మించాడు. వీరిద్దరూ కలిసి రెండో వికెట్‌కు ఏకంగా 193 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ క్రమంలో సుదర్శన్ (87) తన తొలి టెస్టు శతకానికి చేరువలో వికెట్ చేజార్చుకున్నాడు. జోమెల్ వారికన్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. రివ్యూ తీసుకున్నా ఫలితం లేకపోవడంతో నిరాశగా పెవిలియన్ చేరాడు. మరోవైపు, ఆరంభంలో ఆచితూచి ఆడిన యశస్వి జైస్వాల్, క్రీజులో కుదురుకున్న తర్వాత తన దూకుడు పెంచాడు. చెత్త బంతులను బౌండరీలకు తరలిస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. తన టెస్టు కెరీర్‌లో ఐదోసారి 150 పరుగుల మార్కును దాటిన జైస్వాల్, డబుల్ సెంచరీ దిశగా సాగుతున్నాడు.

సుదర్శన్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (20నాటౌట్)తో కలిసి జైస్వాల్ మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి వీరిద్దరూ క్రీజులో ఉన్నారు. ఇక రెండో రోజు కూడా జైస్వాల్ ఇదే జోరు కొనసాగిస్తే, కెరీర్‌లో మరో డబుల్ సెంచరీ సాధించే అవకాశం ఉంది. అతడు ఉన్న ఫామ్‌కు ఈ మార్క్ ఈజీగా అందుకోవచ్చు. అటు గిల్ కూడా క్రీజులో ఉండడం, ఇంకా బ్యాటింగ్ లైనప్ ఉండడంతో భారత్ భారీ స్కోర్ సాధించడం పక్కా! వెస్టిండీస్ బౌలర్లలో వారికన్ రెండు వికెట్లు పడగొట్టాడు.

**జైస్వాల్ రికార్డు**

ఓపెనర్ యశస్వీ జైస్వాల్ సూపర్ సెంచరీతో రాణించాడు. ఈ క్రమంలోనే ప్రస్తుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రికార్డును బ్రేక్ చేశాడు. ఇన్నింగ్స్ ప్రారంభం నుంచి జైస్వాల్ చక్కటి షాట్లతో అలరించాడు. బౌండరీతో అదరగొట్టాడు. ఈ క్రమంలోనే 145 బంతుల్లో శతకం అందుకున్నాడు. టెస్టు కెరీర్‌లో జైస్వాల్‌కు ఇది ఏడో సెంచరీ. ఓవరాల్‌గా చూసుకుంటే ఎనిమిదోది. అతడు టీ20ల్లో ఇప్పటికే సెంచరీ నమోదు చేశాడు. దీంతో జైస్వాల్ అరుదైన ఘనత సాధించాడు. ఈ ఇన్నింగ్స్‌తో జైస్వాల్ మరో ఘనత అందుకున్నాడు. టెస్టుల్లో తొలి రోజే అత్యధిక పరుగులు సాధించిన భారత ఓపెనర్లలో నాలుగో స్థానం దక్కించుకున్నాడు. అయితే మూడో స్థానంలో రికార్డ్ కూడా జైస్వాల్‌దే. అతడు 2024లో ఇంగ్లాండ్‌పై ఓపెనర్‌గా వచ్చి తొలి రోజే 179 పరుగులు చేశాడు.



## ముంబై రంజీ టీమ్ కెప్టెన్‌గా శార్దూల్

### రహానే, సర్ఫరాజ్‌లకు చోటు

**ముంబయి, అక్టోబరు 10:** రంజీ ట్రోఫీ 2025-26 టోర్నమెంట్ కోసం ముంబయి సెలెక్టర్లు 16 సభ్యులతో జట్టును ప్రకటించారు. శార్దూల్ ఠాకూర్‌కు కెప్టెన్ బాధ్యతలు అప్పగించారు. అజింక్యా రహానే, ఖాన్ బ్రదర్స్ సర్ఫరాజ్, ముషీర్ ఖాన్‌లకు చోటు లభించింది. ఆసియా కప్‌లో సత్తా చాటిన ఆల్‌రౌండర్ శివం దూబే సైతం స్క్వాడ్‌లో ఉన్నాడు. గత కొంతకాలంగా ముంబయికి ప్రాతినిధ్యం వహిస్తున్న షామ్స్ ములానీ, తనుష్ కొతియాన్, తుషార్ దేశ్‌పాండేలు సైతం ఎంపికయ్యారు.ముంబై రంజీ జట్టు: శార్దూల్ ఠాకూర్(కెప్టెన్), ఆయుశ్ మాత్రే, ఆకాశ్ ఆనంద్ (వైస్ కెప్టెన్), హార్దిక్ తమోర్ (వికెట్ కీపర్), సిద్దేశ్ లాడ్, అజింక్యా రహానే, సర్ఫరాజ్ ఖాన్, శివం దూబే, షామ్స్ ములానీ, తనుష్ కొతియాన్, తుషార్ దేశ్‌పాండే, సిల్వెస్టర్ డిసౌజా, ఇర్ఫాన్ ఉమైర్, ముషీర్ ఖాన్, అఖిల్ హెర్వాడ్కర్, రాయ్‌స్టాన్ డియాస్.ఎలైట్ గ్రూప్ డీలో దేశవాళీ క్రికెట్‌లో వరల్డ్ కప్‌తో సమానమైన రంజీ ట్రోఫీలో ముంబయి జట్టుది తిరుగులేని ఆధిపత్యం. రికార్డు స్థాయిలో 42 సార్లు రంజీ ట్రోఫీ ఛాంపియన్‌గా ముంబయి నిలిచిన విషయం తెలిసిందే. ఈసారి కూడా ముంబయి జట్టు ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. ఎలైట్ గ్రూప్-డిలోని ముంబయి జట్టు రంజీ ట్రోఫీ తొలి పోరులో జమ్ము కశ్మీర్‌ను ఢీకొట్టనుంది. అక్టోబర్ 15 నుంచి అక్టోబర్ 18 వరకూ శ్రీనగర్‌లో ఇరుజట్లు తలపడనున్నాయి. గ్రూప్-డిలో హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, హైదరాబాద్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, పాండిచ్చేరి జట్లు ఉన్నాయి.

## రోహిత్ నెట్ ప్రాక్టీస్



**ముంబయి, అక్టోబరు 10:** ఆస్ట్రేలియా వన్డే టూర్‌కు భారత జట్టు సన్నద్ధమవుతోంది. అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్ జరుగనున్న విషయం తెలిసిందే. ఈ సిరీస్‌కు 38ఏళ్ల శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. వన్డే కెప్టెన్సీ నుంచి తప్పుకున్న సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ, మరో సీనియర్ విరాట్ కోహ్లీ కూడా ఆస్ట్రేలియా పర్యటనకెళుతున్నారు. ఈ నేపథ్యంలో స్పెషలిస్ట్ బ్యాటర్ రోహిత్ శర్మ శుక్రవారం ముంబయిలోని శివాజీ పార్క్‌లో నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ ప్రారంభించాడు. ఈ ప్రాక్టీస్ సెషన్‌లో పలువురు టీమిండియా క్రికెటర్లతోపాటు రోహిత్ శర్మ రితికా సజ్దే కూడా హాజరయ్యారు. భారత క్రికెటర్లు ప్రాక్టీసు చేస్తుండటంతో శివాజీ పార్క్ అభిమానులతో నిండిపోయింది.

## డిసెంబరు 15న ఐపిఎల్ వేలం!

**కోల్‌కతా, అక్టోబరు 10:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ అభిమానులకు గుడ్‌న్యూస్. మహిళల ప్రీమియర్ లీగ్ వేలం తేదీలను ప్రకటించిన బిసిసిఐ, ఐపీఎల్‌కు కూడా పచ్చజెండా ఊపింది. డిసెంబర్ 14 లేదా 15వ తేదీన పంతొమ్మిదో సీజన్ వేలం నిర్వహణకు బిసిసిఐ సిద్ధమవుతోంది. అయితే.. వేలం తేదీని ఫ్రాంచైజీలతో మాట్లాడి బిసిసిఐ ఖరారు చేయాల్సి ఉంది. ఈ మేరకు ఐపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్ వర్గాలు ఫ్రాంచైజీలకు ప్రాథమిక సమాచారం అందించినట్లు వార్తలు వస్తున్నాయి. గత రెండు సీజన్లుగా విదేశాల్లో జరుగుతున్న వేలంపాట, ఈసారి మళ్లీ స్వదేశానికి తిరిగి రానుంది. గతంలో దుబాయ్, జెడ్డాలలో వేలం నిర్వహించగా,



ఈసారి భారత్‌లోనే జరపాలని నిర్వాహకులు భావిస్తున్నారు. వేలానికి ఆతిథ్యం ఇచ్చే నగరాల జాబితాలో ముంబై, బెంగళూరు ముందువరుసలో ఉన్నాయి. ఆటగాళ్ల రిటెన్షన్‌కు సంబంధించి ఫ్రాంచైజీలు తమ తుది జాబితాను నవంబర్ 15లోగా సమర్పించాల్సి ఉంటుంది. గత సీజన్‌లో ఫాఫ్ డుప్లెసిస్‌ను వదులుకున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబి), 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ రజత్ పాటిదార్ కెప్టెన్సీలో తొలిసారి టైటిల్‌ను ముద్దాడింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న ఆర్సీబీ, తమ జట్టును మరింత పటిష్టం చేసుకునేందుకు ఈ వేలంపై దృష్టి సారించనుంది. మరోవైపు, గత సీజన్‌లో పేలవ ప్రదర్శనతో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లకు ఈ వేలం కీలకంగా మారింది. వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఐపీఎల్‌కు వీడ్కోలు పలకడంతో చెన్నై పర్సులో భారీగా డబ్బు చేరనుంది. దీంతో కొత్త ఆటగాళ్లను కొనుగోలు చేసేందుకు సీఎస్‌కేకు మంచి అవకాశం లభించింది. ఇక రాజస్థాన్ రాయల్స్ తమ కెప్టెన్ సంజూ శాంసన్‌ను ట్రేడింగ్ ద్వారా మరో జట్టుకు పంపే ఆలోచనలో ఉన్నట్లు వస్తున్న వార్తలు ఆసక్తిని రేపుతున్నాయి. ఐపిఎల్ వేలం వస్తోందంటే చాలు.. ప్రతిభావంతులపై కోట్లు కుమ్మరించేందుకు ఫ్రాంచైజీలు రెడీ అవుతుంటాయి. రికార్డు ధర పలికేది ఎవరు? అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. గత సీజన్‌లో రిషబ్ పంత్ రూ.27 కోట్లతో అత్యధిక ధర పలకగా.. శ్రేయాస్ అయ్యర్ రూ.26.75 కోట్లతో రెండో స్థానంలో నిలిచాడు. వెంకటేశ్ అయ్యర్‌ను రూ.23.75 కోట్లకు కోల్‌కతా నైట్ రైడర్స్ అట్టిపెట్టుకుంది.

### బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ జూనియర్ టీమ్ చాంపియన్‌షిప్స్

## భారత్‌కు కాంస్యం



**న్యూఢిల్లీ, అక్టోబరు 10:** బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్స్‌లో భారత్ కాంస్యం పతకం కైవసం చేసుకుంది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్‌లో ఆతిథ్య జట్టు ఇండియా తీవ్రంగా పోరాడినప్పటికీ డిఫెండింగ్ చాంపియన్స్ ఇండోనేషియాను అధిగమించలేకపోయింది. సెమీఫైనల్‌లో భారత్ 35-45, 21-45 తేడాతో ఇండోనేషియా జట్టు చేతిలో పరాజయం పాలైంది. భారత్ జట్టు ఓటమిని చవిచూసినప్పటికీ జట్టు అంతటా దృఢసంకల్పంతో స్ఫూర్తిదాయక ఆటతీరును కనబరిచింది. ఏదిఏమైనా గురువారంనాడు మాజీ చాంపియన్స్ కొరియాను ఓడించి టోర్నీలో తమ తొలి పతకాన్ని కైవసం చేసుకుంది.

## డాలర్ వర్సెస్ రూపాయి 88.69గా చెలామణీ



**న్యూఢిల్లీ, అక్టోబరు10:** డాలరుతో రూపాయి మారకం విలువలు శుక్రవారం 88.69గా నమోదయ్యాయి. వారాంతంలో కొంతమేర రూపాయి పదిపైసలు పటిష్టం అయింది. దేశీయ మార్కెట్లు లాభాలు, ముడిచమురు ధరల్లో తగ్గుదల రూపాయి చెలామణిని మెరుగుపరిచింది. విదేశీ కరెన్సీ ట్రేడర్ల వివరాలప్రకారం రూపాయి ఎక్కువగా దేశీయ మార్కెట్లపరంగానే స్థిరపడిందని కమోడిటీ ధరల్లో ఒక్కసారిగా తగ్గుదల రూపాయిని పటిష్టపరిచిందని చెపుతున్నారు. అలాగే కేంద్ర బ్యాంకు సరైన సమయంలో జోక్యంచేసుకుని డాలర్ల విక్రయాలు చేయడం కూడా కొంత కలిసొచ్చింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్ఛేంజిలో రూపాయి 88.80 వద్ద ట్రేడింగ్ ప్రారంభం అయింది. ఒకదశలో 88.50 నుంచి 88.80వద్దకు కూడా వెళ్లింది. చివరు 88.69వద్ద స్థిరపడింది. ముందురోజు డాలరుతో రూపాయి మారకం విలువలు 88.79వద్ద ముగిసింది. అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్‌ప్రభావం డాలర్ మార్కెట్‌పై ఎక్కువచూపించింది. అమెరికా ఫెడ్‌రిజర్వు మరింతగా ఫండ్‌రేట్లు కట్‌చేయవచ్చన్న అంచనాలు కూడా ఉన్నాయని మిరాయే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చి విశ్లేషకులు అనూజ్ చౌదరి అన్నారు. డాలర్ భారత్ రూపాయి స్పాట్ ధరలు 88.40 నుంచి 88.85వరకూ రావచ్చన్న అంచనాలున్నాయి. బ్రెంట్ ముడిచమురుధరల పరంగా చూస్తే 0.61శాతం దిగువన అంటే బ్యారెల్‌కు 64.85 డాలర్లవద్ద స్థిరపడింది. ఇక దేశీయ మార్కెట్లపరంగా బెంచ్‌మార్క్ సూచీ సెన్సెక్స్ 327.72 పాయింట్లు లాభపడింది. నిఫ్టీ కూడా 103.55 పాయింట్లు ఎగువకు ఎగబాకింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు దేశీయ మార్కెట్లలో 1308.16 కోట్లవిలువైన ఈక్విటీలు కొనుగోలుచేసినట్లు ఎక్ఛేంజి గణాంకాలు చెపుతున్నాయి.

## ఒక్క నెలలో గోల్డ్ ఇటిఎఫ్‌ల్లోకి రూ.8363 కోట్లు..



**న్యూఢిల్లీ,అక్టోబరు 10:** భౌగోళిక అనిశ్చితులు, అమెరికా షట్‌డౌన్ ప్రభావాలకు తోడు కరెన్సీ మార్కెట్ ఒడిదొడుకులు బంగారంధరలు ఒక్కసారిగా పెరుగుతుండటం వంటి అంశాలపై ఇన్వెస్టర్లు ఎక్కువగా గోల్డ్ ఈటిఎఫ్‌లపట్ల ఆసక్తిచూపించారు. ఒక్క ఆగస్టులోనే రూ.2190 కోట్ల ఇన్‌ఫ్లో ఉన్న గోల్డ్ ఈటిఎఫ్‌లు సెప్టెంబరులో నాలుగు రెట్లుపెరిగి రూ.8363 కోట్లకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇదే అత్యధిక నెలవారీ ఇన్‌ఫ్లో అని చెప్పుకెవచ్చు. గోల్డ్ ఇటిఎఫ్‌లమొత్తం నిర్వహణ ఆస్తులు రూ.90వేల కోట్ల మార్కును దాటాయి. వెండి ఈటిఎఫ్‌ల్లో కూడా పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. భారత్ మ్యూచువల్ ఫండ్స్ సంఘం ఆంఫీ తాజా గణాంకాలు ప్రకారంబంగారం, వెండి కేటాయింపులు పెరగడంతో మల్టీ అసెట్ ఫండ్లు కూడా సుమారు రూ.5వేల కోట్ల ఇన్‌ఫ్లో నమోదుచేసినట్లు శ్రీరాం ఎఎంసి ఎండి కార్తీక్ జైన్ తెలిపారు. మరోవైపు ఈక్విటీఫండ్‌ల ఇన్‌ఫ్లక్ష రెండోనెలలోకూడా తగ్గాయి. ఆగస్టులో రూ.33,430 కోట్లు ఉంటే సెప్టెంబరులో 9శాతం తగ్గి రూ.30,421 కోట వరకూ ఉన్నట్లుఆంఫీ ప్రకటించింది. ఫ్లెక్సీ క్యాప్; మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్‌లు ఇన్‌ఫ్లోల్లో ముందున్నాయి. డెట్‌ఫండ్‌లనుంచి మాత్రం ఎక్కువ నిధులు విత్‌డ్రా కావడం గమ నార్హం. ప్రస్తుత తరుణంలో గోల్డ్‌సిల్వర్ ఈటిఎఫ్‌లకే ఇన్వెస్టర్లు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు.

## పిఎస్‌యు, ఐటి రంగం మద్దతు..
## రెండోరోజూ లాభాల్లోనే ముగిసిన సెన్సెక్స్ నిఫ్టీ

**ముంబయి, అక్టోబరు 10:** దేశీయ స్టాక్ మార్కెట్లు రెండోరోజు కూడా లాభాల్లోనే ముగిసాయి. ఇన్వెస్టర్లు రెండోత్రైమాసిక ఫలితాలపై ఎక్కువ ఫోకస్ పెంచారు. ఐపిఓ లావాదేవీలపైనా వారి నజర్ పెరిగింది. నిఫ్టీ వారాంతంలో 25,250 మార్క్ ఎగువన ముగిసింది. పిఎస్‌యు బ్యాంకు, రియాల్టీ, ఫార్మారంగ షేర్లు భారీగాపెరిగితే మెటల్, ఐటి రంగ షేర్లు క్షీణించాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 328.72 పాయింట్లుపెరిగి 82,500.82 వద్ద స్థిరపడితే నిఫ్టీ 50 సూచీ 103.55 పాయింట్లుపెరిగి 25,285.35 పాయింట్లవద్దట్రేడింగ్‌ముగించింది. గడచిన రెండు సెషన్లలోను సెన్సెక్స్ నిఫ్టీలు 0.89శాతం, 0.96శాతంచొప్పున పెరిగాయి. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ 0.36శాతం పెరిగితే స్మాల్‌క్యాప్ సూచీ కూడా 0.59శాతంగా పెరిగింది. మార్కెట్లపరంగా సానుకూల ట్రేడింగ్‌కనిపించింది. బిఎస్‌ఇలో 2482 షేర్లు పెరిగాయి. 1695 కంపెనీల షేర్లు దిగజారితే మరో 173 కంపెనీలషేర్లు స్థిరంగా కొనసాగాయి. వియ్‌వర్క్ ఇండియా షేర్లు 624.75గా కొనసాగాయి. రూబికాన్ రీసెర్చి 2,07,86,340 షేర్లకు బిడ్లు స్వీకరించింది. కెనరా రోబెకో అసెట్‌మేనేజ్‌మెంట్‌కంపెనీ కూడా 1,52,98,192 వాటాలకు బిడ్లు రాబట్టింది. కెనరా హెచ్‌ఎస్‌బిసి లైఫ్ కంపెనీ తొలివిడతగా 1,37,68,160 షేర్లకు బిడ్లు వచ్చాయి. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో యుకోబ్యాంకు 3.48, ఐఒబి 2.91శాతం, పీఎన్బీ 2.78శాతం, పంజాబ్ సింధుబ్యాంకు 2.76శాతం, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2.28శాతం, ఎస్బీఐ 2.16శాతం, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 1.64 శాతం, ఇండియన్‌బ్యాంకు 1.55శాతం, బ్యాంక్ ఆఫ్ బరోడా 1.14శాతం, యూనియన్‌బ్యాంక్ ఆఫ్ఇండియాలు 1.12శాతం లాభపడ్డాయి. ఇక టిసిఎస్ 1.11శాతం దిగజారింది. టాటా ఎలిక్సీ కూడా 3.01శాతం క్షీణించింది, ఫైవ్‌పైసా క్యాపిటల్ 6.32శాతం, జెఎస్‌డబ్ల్యుస్టీల్ 0.91శాతంచొప్పున క్షీణించాయి. గ్లోబల్ మార్కెట్ల పరంగా యూరోపి యన్ మార్కెట్లు మిశ్రమంగా కొనసాగాయి. ఆసియా మార్కెట్లు వారాంతం ప్రభావాలను ఎదుర్కొన్నాయి. దక్షిణ కొరియా కోస్పి కూడా ఫ్లాట్‌గానే ముగిసింది. ఇక వాల్‌స్ట్రీట్‌లో భారీ యుఎస్ సూచీలు ఒత్తిడికి లోనయ్యాయి. ఎస్ అండ్‌పి 500 0.28శాతం, నాస్‌డాక్ కాంపో జిట్ 0.08శాతం, డోజోన్స్ పారిశ్రామిక సగటు 243.36 పాయింట్లు చొప్పున దిగజారాయి.



## మూడునెలల్లోనే 20 వేల మందికి టిసిఎస్ ఉద్వాసన

**ముంబయి, అక్టోబరు 10:** భారత ఐటీ రంగంలో అగ్రగామి సంస్థ అయిన టీసీఎస్ తన ఉద్యోగులకు భారీ షాక్ ఇచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రెండో త్రైమాసిక ఫలితాలను ప్రకటించిన ఆ సంస్థ, ఇదే సమయంలో తమ ఉద్యోగుల సంఖ్యలో భారీ తగ్గుదల ఉన్నట్లు వెల్లడించింది. కేవలం మూడు నెలల వ్యవధిలోనే దాదాపు 20 వేల మంది ఉద్యోగులు తగ్గడం ఐటీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కంపెనీ అధికారికంగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం, జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో టీసీఎస్ మొత్తం ఉద్యోగుల సంఖ్య 6,13,069గా ఉండగా, సెప్టెంబర్ నాటికి ఆ సంఖ్య 5,93,314కు పడిపోయింది. అంటే, కేవలం జులై-సెప్టెంబర్ త్రైమాసికంలోనే ఏకంగా 19,755 మంది ఉద్యోగులు తగ్గారు. ఇది ఐటీ రంగంలో ఇటీవలి కాలంలో నమోదైన అతిపెద్ద తగ్గుదలలో ఒకటిగా నిపుణులు పేర్కొంటున్నారు. మరోవైపు కంపెనీ ఆర్థిక పనితీరును పరిశీలిస్తే, నికర లాభంలో స్వల్ప వృద్ధి మాత్రమే నమోదైంది. ఈ త్రైమాసికంలో టీసీఎస్ రూ. 12,075 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది కేవలం 1.39 శాతం మాత్రమే ఎక్కువ. ఇక, కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 2.39 శాతం పెరిగి రూ. 65,799 కోట్లకు చేరినట్లు కంపెనీ తెలిపింది. ఉద్యోగుల సంఖ్యలో ఈ భారీ తగ్గుదలపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎలాంటి సరైన సమాచారం ఇవ్వకుండా టీసీఎస్ పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తొలగించిందని ఉద్యోగుల సంఘం నైట్స్ ఆరోపించింది. అయితే, ఈ ఆరోపణలను టీసీఎస్ సీహెచ్‌ఆర్ఓ సుదీప్ కున్నుమల్ తోసిపుచ్చారు. పునర్వ్యవస్థీకరణ ప్రణాళికలో భాగంగా కేవలం ఒక శాతం మందిని, అంటే దాదాపు 6 వేల మందిని మాత్రమే తొలగించినట్లు ఆయన వివరించారు.

**వాణిజ్యం**

## ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఐపిఒకు భారీ స్పందన

**ముంబయి, అక్టోబరు 10:** భారత పబ్లిక్ ఇష్యూ మార్కెట్ చరిత్రలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ సరికొత్త అధ్యాయాన్ని నమోదుచేసింది. పెట్టుబడిదారుల నుంచి అపూర్వ స్పందనను అందుకున్న ఈ కంపెనీ ఐపీవో, బిడ్ల విలువ పరంగా ఆల్ టైమ్ రికార్డును సృష్టించింది. ఈ పబ్లిక్ ఇష్యూకు ఏకంగా రూ.4.4 లక్షల కోట్ల విలువైన బిడ్లురావడం మార్కెట్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ రూ.11,607 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో ఐపీవోకు



వచ్చింది. ఇష్యూలో భాగంగా 7.13 కోట్ల షేర్లను జారీ చేయగా, చివరి రోజు ముగిసే సమయానికి ఏకంగా 3.85 కోట్ల షేర్ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. అంటే, ఇష్యూ పరిమాణం కంటే 54.02 రెట్లు అధికంగా సబ్‌స్క్రయిబ్ అయింది. ఇప్పటివరకు ఏ భారతీయ ఐపీవోకి ఇంత భారీ స్థాయిలో స్పందన లభించలేదు. గత ఏడాది బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీవోకు వచ్చిన రూ.3.24 లక్షల కోట్ల బిడ్ల రికార్డును ఎల్జీ ఎలక్ట్రానిక్స్ తాజాగా అధిగమించింది. మరోవైపు, బులియన్ మార్కెట్లో వెండి ధర రికార్డుల మోత మోగిస్తోంది. ఒక్కరోజే ఢిల్లీలో కిలో వెండి ధర రూ.6,000 పెరిగి రూ.1.63 లక్షల వద్ద సరికొత్త గరిష్ఠ స్థాయికి చేరింది. దీంతో ఈ ఏడాదిలో ఇప్పటివరకు వెండి ధర 72 శాతం పెరిగినట్లయింది. అయితే, పది గ్రాముల బంగారం ధర మాత్రం రూ.1,23,600 వద్ద స్థిరంగా కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్లో కూడా ఔన్స్ వెండి ధర 50 డాలర్ల మార్కును దాటింది.

## రూ.451 కోట్ల సమీకరణకు మిడ్‌వెస్ట్ ఐపిఒ..

**న్యూఢిల్లీ, అక్టోబరు 10:**మిడ్‌వెస్ట్ లిమిటెడ్ కంపెనీ ఐపిఒకు వస్తోంది. రూ.451 కోట్ల నిధులు సమీకరించే లక్ష్యంతో ఐపిఒలో ఒక్కోషేరుకు ధరను రూ.1014నుంచి రూ.1065గా నిర్ణయించింది. ఐపిఒలో ఈనెల 15న ప్రారంభం అయి 17వ తేదీముగుస్తుంది. యాంకర్ ఇన్వెస్టర్ బుకింగ్ 14న ప్రారంభిస్తారు. రూ.250 కోట్లు సమీకరించేందుకు కొత్తషేర్లు జారీచేస్తున్నది. ఆఫర్‌ఫర్‌సేల్ కిందమరో రూ.201 కోట్లు సమీకరించాలనినిర్ణయించింది. ఈ నిధులతో 130.3 కోట్లు మిడ్‌వెస్ట్ నియోస్టోన్ అనుబంధ సంస్థకు ఉన్న క్వార్ట్జ్‌యూనిట్ రెండోదశ విస్తరణకు ఖర్చుచేస్తారు. రూ.25.7 కోట్లు విద్యుత్ డంప్‌ట్రక్కుల కొనుగోలు, రూ.3.2 కోట్లు ఎంఒకచేసిన గనుల వద్ద సౌరవిద్యుత్ సమీకరణకోసం వినియోగిస్తామని కంపెనీ ప్రకటించింది. మరో 562కోట్లు రుణాల చెల్లింపులకు వినియోగిస్తుంది. మిగిలిన నిధులు సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయిస్తామన్నారు. ఈ సంస్థ గ్రానైట్‌తోపాటు క్వార్ట్జ్‌శుద్ధి విభాగంలోకి



ప్రవేశించింది. అలాగే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ప్రాసెసింగ్‌లోకి కూడా వస్తోంది. బుక్‌రన్నింగ్ లీడ్‌మేనేజర్లుగా డిఎఎం క్యాపిటల్ అడ్వయిజర్స్ మోతీలాల్ ఓస్వాల్ ఇన్వెస్ట్‌మెంట్స్, ఇంటెన్సివ్ ఫిస్కల్ సర్వీసులు వ్యవహరిస్తున్నాయి. కెఫిన్ టెక్నాలజీస్ రిజిస్ట్రారుగా ఉంది. ఈనెల 24నస్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ చేసేందుకు కసరత్తులు ముమ్మరం చేసింది.

## ఒక్కనెలలోనే బిజినెస్ ప్రీమియంలు రూ.40,206 కోట్లు

**న్యూఢిల్లీ, అక్టోబరు 10:** భారత్ బీమాసంస్థల్లో కొత్త బిజినెస్ ప్రీమియంలు గతనెలలో 14.81శాతంపెరిగి 35,020 కోట్లనుంచి 40,206 కోట్లకు పెరిగింది.వ్యక్తిగత సింగిల్ ఈబీమా ప్రీమియంలు కూడా 4515.78 కోట్లుగా ఉన్నాయి. వార్షిక పద్ధతిలోచూస్తే 4.99శాతం వృద్ధి ఉన్నట్లు కంపెనీలు చెపుతున్నాయి. అలాగే బిజినెస్ ప్రీమియంలపరంగా కూడా గత ఏడాది 1,89,214 కోట్లనుంచి ఈఏడాది 2,03,668 కోట్లకు పెరిగినట్లు వెల్లడి అయింది. వార్షిక పద్ధతిలోచూస్తే వ్యక్తిగత నాన్ సింగిల్‌ప్రనీమియం 10,837 కోట్లుగా ఉంది. వార్షిఖ పద్ధతిలో 2.16 శాతం వృద్ధి నమోదయింది. ఇక గ్రూప్ పాలసీపరంగా సింగిల్‌ప్రీమియంలు 32.39 శాతంపెరిగితేనెలవారీ వసూళ్లు 22,574 కోట్లుగా ఉన్నాయి. గ్రూప్ పాలసీ కేటగిరీలో 35.23శాతం వృద్ధినమోదయింది. గతంలో బీమా పట్ల అవగాహలేని ప్రాంతాలకు సైతం ఇపుడు భారత్‌లో బీమా సంస్థలు విస్తరించి బీమాపట్ల అవగాహనను



పెంచి వారిని వ్యక్తిగత ప్రీమియంలవైపు ఆకర్షిస్తుండటంతో బీమారంగంలో ప్రీమియం మార్కెట్‌మరింతగా పెరుగుతున్నది. దేశవ్యాప్తంగా ఈ ఏడాది 5,39,804 మంది వ్యక్తిగత బీమా ఏజెంట్లు ఉండగా వార్షికపద్ధతిలో 3.71శాతం ఏజెంట్ల సంఖ్యాపరంగా కూడా వృద్ధినమోదయింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14